ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విజయవాడ
: fb.com/vaartha Digital

నేటి మీ కపిల్ చిట్స్ తో సభ్యత్వం ఓ మంచి ఆర్థిక నేస్తంతో బంధుత్వం
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-12-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 328 పేజీలు: 12 వెల: 6.50



# నరసాపురం 'అల్లిక' జిగిబిగి

**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** ప్రధాని మోడీ ఆదివారం మన్‌కీ బాత్ ప్రసంగంలో ఏపీలోని నరసాపురం ప్రస్తావన తీసుకొచ్చారు. దేశంలోని సంప్రదాయ కళల అంశంపై మాట్లాడుతూ లేస్(అల్లికలు) గురించి ప్రస్తావించారు. ఈ కళ తరతరాలుగా మహిళల చేతుల్లో ఉందని చెప్పారు. నరసాపురం లేస్‌కు జీఐ ట్యాగ్ ఉందని తెలిపారు.కాగా సుమారు 500 రకాల ఉత్పత్తుల తయారీలో లక్షమంది మహిళలు భాగమవుతున్నారు. హ్యాంగింగ్స్, డోర్ కర్టెన్లు, సోఫా కవర్లు, కిడ్స్‌వేర్‌లో ఈ లేస్‌ను వినియోగిస్తారు. ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 'మన సాంప్రదాయ కళలు సమాజాన్ని బలోపేతం చేస్తున్నాయి. ప్రజల ఆర్థిక ప్రగతికి ఒక ప్రధాన సాధనంగా మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం జిల్లాకు చెందిన లేస్(అల్లికలు) కళ దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ లేస్‌కళ తరతరాలుగా మహిళలచేతుల్లోనే ఉంది. దేశంలోని మహిళలు >>2



జిఐ ట్యాగ్ ఉన్న లేస్ అది..
తయారీలో లక్షమంది మహిళలు నిమగ్నం
మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

## పట్టణాల తరహాలో గ్రామాల అభివృద్ధి
### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**శ్రీకాకుళం, డిసెంబరు 28 ప్రభాతవార్త:** పట్టణాలకు ధీటుగా ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, చేసి చూపిస్తున్నామని, ప్రతీ గ్రామం 'సుందరగ్రామమే' కూటమి ధ్యేయమని కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నియోజకవర్గ గార మండలం బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ 15 ఫైనాన్స్ కమీషన్ నుండి 50 లక్షల విలువ గల వైద్యశాలను, శ్రీకూర్మం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కేపిహెచ్‌విబి నుండి 260 లక్షల విలువ గల బాలికల హాస్టల్, శ్రీకాకుళం స్థానిక ఎల్‌బిఎస్ కాలనీ, పద్మావతినగర్‌లో, హెచ్‌ఎంసియే, మున్సిపల్ కార్పొరేషన్ నుండి సుమారు 19 లక్షల సిసి రోడ్డు, ఎంపిడివో కార్యాలయం సుమారు 34 లక్షల సిసి రోడ్‌లను, నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్‌తో కలసి ప్రారంభించి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ బాబు సహకారాలతో రాష్ట్రాన్ని >>2




2లో

ఆదివారం కర్ణాటకలోని కార్వార్ నావల్ హార్బర్‌లో జలాంతర్గామి ఎక్కిన రాష్ట్రపతి ముర్ము

## నేవీ ఏ సవాళ్లకైనా రెడీ

ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో రాష్ట్రపతి ముర్ము
జలాంతర్గామిలో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగా రికార్డు

## పెదమైనవాని లంక
# డ్రోన్ శిక్షణలో టాప్

**నరసాపురం, డిసెంబరు 28, ప్రభాతవార్త:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ జిల్లా పర్యటన సందర్భంగా ఆదివారం పెదమైనవాని లంక గ్రామంలో డిజిటల్ భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ఆర్థికమంత్రితో పాటు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, కూటమి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంశా పత్రాలు, మెమ్మెంటోలు కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అందజేసి, అభినందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ పిఎం లంక గ్రామం అభివృద్ధి గ్రామ మహిళల మద్దతుతోనే సాధ్యమైంది అన్నారు. ఆంధ్ర కోడలు పెదమైనవానలంక కూతురిగా ఇక్కడ వారికి ఎప్పుడు సుపరిచితమేనన్నారు. పీఎం లంకలో నిర్మించిన సైక్లోన్ భవనం అన్ని విధాలుగా ఉపయోగపడడం సంతోషకరమన్నారు. పియం లంక మహిళల మద్దతు వల్లే సైక్లోన్ భవనం డిజిటల్ భవనంగా మారిందని, డ్రోన్లు నడిపేవారు ఉన్నారన్నారు. కానీ వాటిని ఎలా తయారు చేయాలి, మరమత్తు వస్తే ఏం చేయాలి అసలు డ్రోన్ అంటే ఏంటి ఎలా ఉపయోగించాలి దానిపై ఆంధ్రాలో మొట్టమొదటిసారిగా పిఎం లంకలో శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ >>2



ఎఐ టెక్నాలజీలో దూసుకుపోతున్న గ్రామం

నేను దత్తత తీసుకోవడం కాదు.. ఈ గ్రామ ప్రజలే నన్ను దత్తత తీసుకొన్నారు: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



ఆదివారం అయోధ్య రామయ్యను సందర్శించి ప్రణమిల్లుతున్న సిఎం చంద్రబాబు

## సుపరిపాలనకు కొలమానం
# రామరాజ్యమే

దేశ సంస్కృతి, సంప్రదాయాలకు అయోధ్య ప్రతిబింబం
అయోధ్యరాముని దర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** సుపరిపాలనకు రామరాజ్యమే బెంచ్ మార్క్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. మంచి పరిపాలనను రామరాజ్యంతోనే పోల్చుకుంటామని అన్నారు. ఆదివారం అయోధ్యలో శ్రీరాముడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహిత్‌లు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సింధూరం దిద్ది. సంప్రదాయక పద్దతుల్లో ఆయనను సత్కరించారు.ఆలయ మర్యాదలను అనుసరించి రామ మాలతో చంద్రబాబును అలంకరించి స్వస్తి పలికారు. దర్శనం అనంతరం ఆలయ నిర్వాహకులు చంద్రబాబుకు ఆలయ నిర్మాణ శైలి, ఇతర విశేషాలను వివరించారు. ఆయన ఆసక్తిగా ఆలయ విశేషాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ పర్యటన తనకు ఎంతో ప్రశాంతమైన, ఆధ్యాత్మిక అనుభూతిని ఇచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. అత్యుత్తమ పాలనకు రాముడి పాలనే కొలమానంగా తీసుకుంటామని అన్నారు. అయోధ్యలో నిర్మించిన రామమందిరం మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఎన్నో వివాదాల అనంతరం ఆలయం నిర్మితమై దేశప్రజల కల సాకార >>2

# పూర్తి సాయం చేస్తాం

సిఎం చంద్రబాబుకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హామీ
బ్యాంకుల నిర్మాణ పురోగతిని వివరించిన సిఎం

**విజయవాడ, డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ అనుహ్యంగా అభివృద్ధి సాధిస్తుంది.మరింత ప్రగతిని సాధించడానికి కేంద్రం అండగా ఉంటుంది అని సెంట్రల్ ఫైనాన్ మినిష్టర్ నిర్మలా సీతారామన్ అన్నారు.ఆదివారం రాష్ట్రానికి వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రితో విజయవాడ(గన్నవరం) విమానాశ్రయంలో మర్యాద పూర్వకంగా సమావేశం అయిన సీఎం చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లా పర్యటన ముగించుకుని వచ్చిన కేంద్ర మంత్రితో కొద్దిసేపు సమావేశం సీఎం మయ్యారు. సీఎం చంద్రబాబు ఉత్తర ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో శ్రీబాలరాముని దర్శించి పూజలు నిర్వహించారు. ఈ సాయంత్రం ఆయన విజయవాడ తిరిగి వచ్చిన సందర్భంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బేటీ అయ్యారు.ఆమెకు చంద్రబాబు రాష్ట్రాబివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.




కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సిఎం చంద్రబాబు భేటీ

అమరావతి రాజధాని అభివృద్ధిని గురించి నిధులు కోరారు.ఇటీవల నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేసిన జాతీయ సంస్థలు,బ్యాంకులు నిర్మాణ పనుల పురోగతిని సీఎం వివరించారు.ఏపీ నిర్దిష్ట కాలంలో మీ నాయకత్వం అతివేగంగా వృద్ధి చెందుతుందనే ధీమాను నిర్మలా సీతారామన్ వ్యక్తం చేసారు.అంతకు ముందు నిర్మలా సీతారామన్ దత్తత గ్రామమైన పెదమైనవాని >>2

## ఇక రాష్ట్రంలో రెవెన్యూ క్లినిక్‌లు

**విజయవాడ,డిసెంబరు28,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో భూ సంబంధిత సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసి సత్ఫలితాలనిచ్చిన రెవెన్యూ క్లినిక్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి అధి కారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కొత్త విధానం ప్రకారం, రాష్ట్రంలోని ప్రతి జిల్లా కలెక్టరేట్‌లో ఖిప్రత్యేక రెవెన్యూ డెస్క్ఖి (రెవెన్యూ క్లినిక్) ఏర్పాటు చేస్తారు. ఇకపై భూ సమస్యలపై అర్జీ ఇవ్వడానికి వచ్చే పౌరులకు కేవలం రసీదు మాత్రమే కాకుండా, వారి సమస్యను ఎవరు, ఎప్పటిలోగా పరిష్కరిస్తారో స్పష్టంగా పేర్కొంటూ ఒక ఖిసర్టిఫైడ్ యాక్షన్ ప్లాన్ఖి (కార్యాచరణ పత్రం) అందిస్తారు. ఈ పత్రంపై డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి సంతకం ఉంటుంది. దీంతో తమ పని పురోగతి గురించి తెలుసుకునేందుకు ప్రజలు పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి తమ జిల్లాలో అమలు చేస్తున్న ఖిరెవెన్యూ క్లినిక్ఖి విధానం విజయవంతమైన తీరును ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానం ద్వారా అర్జీల పునరావృతం >>2

## రేషన్ దుకాణాలలో
# రూ.20కే కిలో గోధుమ పిండి

సంక్రాంతి నుంచి అమలు

**విజయవాడ,డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** నూతన సంవత్సరంలో,సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, జొన్నలతో పాటు గోధుమ పిండి(హోల్ వీట్ ఆటా) పంపిణీ చేసేందుకు ఏపీ పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. బహిరంగ మార్కెట్లో హోల్ వీట్ ఆటా కిలో ధర రూ.40కి పైగా ఉంది. దీనిని సగం ధర రూ.20కే కిలో చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు సంబంధించి స్టాక్ కేటాయింపులు జరిగాయి. గుంటూరు జిల్లాలో గోధుమపిండి వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనిని >>2

## మార్చిలోగా కోటి మందికి స్వమిత్వ
# యాజమాన్య హక్కు పత్రాలు



డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ,డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆస్తులకు యాజమాన్య హక్కులు కల్పించే స్వమిత్వ పథకం ద్వారా వచ్చే మార్చి నాటికి రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి ప్రాపర్టీ కార్డులు అందజేసే విధంగా ముందుకు అడుగులు వేస్తున్నట్లు ఏపీ డీసీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు.ఈ మేరకు డీసీఎంవో ఓ ప్రకటన విడుదల చేసింది.స్వమిత్వ మొదటి విడత కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే 613 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 5.18 లక్షల మందికి యాజమాన్య పత్రాలు అందించేందుకు సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. రెండో విడత మరో 5,847 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేసి ఈ నెలాఖరుకి మరో 45.66 లక్షల మందికి వారి యాజమాన్య హక్కు పత్రాలు సిద్ధం చేస్తాం. డిసెంబర్ నుంచి మూడో విడత ప్రారంభించి మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని అధికా రులకు నిర్ధేశించాం. అందుకోసం సర్వే విభాగం గ్రామ సర్వేయర్ల సేవలను >>2

# ప్రైవేట్ పిఆర్‌ఒలదే 'కొండ' పెత్తనం!

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమలకొండపై ప్రైవేట్ పిఆర్‌ఒలదే అంతటా పెత్తనంగా మారింది. వసతి కల్పించే ముఖ్యమైన విచారణ కార్యాలయాల నుండి దర్శనాలు చేయించడం వరకు సర్వం వాళ్ళ కనుసైగల్లోనే టిటిడి యంత్రాంగంనడుస్తోందంటే ఆశ్చర్యపోవలసిన విషయం లేదు.అసలు వీళ్ళంతా ఎవరు, పలుచోట్ల పెత్తనం చేస్తున్నా ఎందుకు కట్టడిచేయలేకపోతురన్నారు ,వీరిని ఎవరు నియమించారనే సమాచారం కూడా టిటిడి అధికారుల వద్ద ఉండకపోవడం విస్మయం కలిగిస్తుంది. చిన్నాచితకా విషయాలకు సామాన్యభక్తులను భయభ్రాంతులకు గురిచేసే టిటిడి విజిలెన్స్ అధికారులు ప్రైవేట్ పిఆర్ఒ వ్యక్తులు చేస్తున్న అజమాయిషీ పెత్తనంపై నిఘా పెట్టలేకపోతుండటం వెనుక అసలు విషయం దేవుడికే ఎరుక అని పలువురు టిటిడి సిబ్బంది బాహాటంగా ఆరోపణలు. పిఆర్‌ఒల పేరుతో చలామణి అవుతున్న వ్యక్తులకు పద్మావతి విచారణ కార్యాలయం,ఎంబిసి విచారణ కార్యాలయాల వద్ద కొందరు అధికారులు,క్రిందిస్థాయి ఆఫీస్ సబార్డినేట్‌లు వారికి గేట్లు తెరిచి రాచమర్యాదలు చేయడంలో ఆంతర్యమేమిటనేది ప్రశ్నార్థకమే. మరీ ఏకంగా వాళ్ళు అడిగిన చోట గదులు కేటాయించడం వెనుక కూడా ఉన్న మతలబు ఏంటనేది టిటిడి విజిలెన్స్ వర్గాలకు తెలిసిన సత్యమే. అయినా కట్టడిచేయడంలో పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీలకు సంబంధించి ఎంపిలు, ఎమ్మెల్సీలు, మంత్రులు,ఎమ్మెల్యేలు తిరుమలలో వసతి, దర్శనాలకు సంబంధించి సేవలకు తమకు అనుకూలురైన వారిని కొంతమందిని నియమించుకుని పనిచే యించుకుంటున్నారు. మంత్రులు వారికి సంబంధించి శాఖల ప్రోటోకాల్ చూడటానికి తిరు పతి, చిత్తూరుజిల్లాల్లో ఆయాశాఖలకు చెందిన >>2



రేపు ఆగమోక్తంగా తెరచుకోనున్న వైకుంఠ ద్వారాలు 3లో

వసతి నుంచి దర్శనాల దాకా వారిదే హవా
డయల్ యువర్ ఇఒకు ఫిర్యాదు అందినా ప్రయోజనం శూన్యం
పట్టించుకోని విజిలెన్స్ యంత్రాంగం

29-12pg2exHMNWJQE 2_29-12pg2exHMNWJQE.qxd 29/Dec/25 12:33 AM Page 1





ఆదివారం ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామి సిబ్బందితో రాష్ట్రపతి ముర్ము

# నేవీ ఏ సవాళ్లకైనా రెడీ

**బెంగళూరు, డిసెంబరు 28:** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమ సముద్ర తీరంలో ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ జలాంతర్గామిలో ప్రయాణించారు. నావికాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కె.త్రిపాఠి కూడా ప్రయాణించారు. ఆదివారం కర్ణాటకలోని కార్వార్ నావల్ హార్బర్‌లో జలాంతర్గామిని ఎక్కారు. రెండు గంటలకు పైగా ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో ప్రయాణించారు. కల్వరి-క్లాస్ సబ్‌మెరైన్ అయిన ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో జలాంతర్గామి సిబ్బందితో సంభాషించారు. నావికాదళ కార్యాచరణ ప్రదర్శనలను వీక్షించారు. స్వదేశీ కల్వరి-క్లాస్ జలాంతర్గామిలో ఈ తొలి ఎంబార్కింగ్ సుప్రీం కమాండర్ సాయుధ దళాలతో కార్యాచరణ సెట్టింగ్‌లలో నిరంతరం అప్రమత్తత ప్రతిబింబిస్తున్నదని రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు. 2024 నవంబర్ ప్రారంభంలో స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌లో భారత నావికాదళం చేసిన ఆపరేషనల్ డెమోన్‌స్ట్రేషన్‌ను రాష్ట్రపతి వీక్షించారు. తరువాత సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి తన అనుభవాలను వ్యక్తం చేస్తూ సంక్షిప్తంగా రాశారు. "ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో మా నావికులు, అధికారులతో ప్రయాణించడం, డైవ్ చేయడం, సమయం గడపడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభవం. ఐఎన్ఎస్ వాఘ్‌షీర్ నిర్వహించిన బహుళ విజయవంతమైన కసరత్తులు, సవాలుతో కూడిన కార్యకలాపాలు 'వీర్య వర్చస్వ విజయ' అనే దాని నినాదానికి అనుగుణంగా సిబ్బంది అసాధారణ సంసిద్ధత, అంకితభావాన్ని ప్రదర్శిస్తాయి. వాఘ్‌షీర్ సిబ్బంది క్రమశిక్షణ, విశ్వాసం ఉత్సాహాన్ని చూడటంవల్ల మన జలాంతర్గాములు, భారత నావికాదళం ఏదైనా ముప్పును, అన్ని పరిస్థితులలోనూ పోరాటానికి సిద్ధంగా ఉన్నాయని నా హృదయం సందర్శకుల పుస్తకంలో రాష్ట్రపతి రాసుకొచ్చారు. జలాంతర్గామిలో సముద్రంలోకి వెళ్లిన రెండో రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము చరిత్ర సృష్టించారు. అంతకు ముందు 2006లో జలాంతర్గామిలో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ఏపీజే అబ్దుల్ కలాం నిలిచారు.

**చరిత్ర సృష్టించిన రాష్ట్రపతి:** భారత సాయుధ దళాల సుప్రీం కమాండర్ అయిన రాష్ట్రపతి నావికాదళ యూనిఫాం ధరించి, సబ్‌మెరైన్‌లోకి ప్రవేశించారు. "కార్వార్ నావల్ బేస్‌లో ఇండియన్ నేవీ స్వదేశీ కల్వరి క్లాస్ జలాంతర్గామి ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రయాణించారు" అని రాష్ట్రపతి కార్యాలయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. పీ75 స్కార్పీన్ ప్రాజెక్ట్‌లో చివరిదైన ఆరవ జలాంతర్గామి అయిన ఐఎన్ఎస్ వాఘ్‌షీర్‌ను జనవరిలో భారత నావికాదళంలోకి ప్రవేశపెట్టారు. నేవీ అధికారులు దీనిని ప్రపంచంలోనే అత్యంత నిశ్శబ్దమైన డీజిల్-ఎలక్ట్రిక్ జలాంతర్గాముల్లో ఒకటిగా అభివర్ణిస్తున్నారు. ఈ జలాంతర్గామిని అనేక రకాల మిషన్‌లను నిర్వహించడానికి రూపకల్పన చేశారు. శత్రువుల ఉపరితలనౌకలు (యాంటీ-సర్ఫేస్ వార్‌షేర్), శత్రు జలాంతర్గాములపై పోరాటం (యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్), గూఢచార సమాచారసేకరణ, ప్రత్యేక ఆపరేషన్లు, నిఘాకు ఉపయోగపడుతుంది. ఇదివైర్-గైడెడ్‌టార్పెడోలు, యాంటీ-షిప్‌క్షిపణులు, ఆధునిక సోనార్ వ్యవస్థలతో ఆయుధీకరించబడింది.

# స్వమిత్వ యాజమాన్య హక్కు పత్రాలు

>> పంచాయతీరాజ్ శాఖకు కేటాయించే ఏర్పాటు చేయాలి. పంచాయతీరాజ్ శాఖ, సర్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు స్వమిత్వ సర్వేను నిరంతరం పర్యవేక్షించాలి. క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా స్వమిత్వ పథకం కింద నిర్వహిస్తున్న సర్వేలో ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల అభిప్రాయం సేకరిస్తాం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వే, గత ముఖ్యమంత్రి ఫోటోతో కూడిన పాసు పుస్తకాల కారణంగా ప్రజలు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. మన ప్రభుత్వంలో అలాంటి తప్పులకు తావుండదు. రీ సర్వే తర్వాత ఎవరి భూములు వారికి అప్పగిస్తూ ప్రాపర్టీ కార్డులు ఇస్తాం. రాజ ముద్రతో కూడిన కార్డులు అందిస్తాం. ఈ ప్రాపర్టీ కార్డులు వచ్చిన తర్వాత ఆయా స్థలాలు అమ్ముకునేందుకు, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం వినియోగించుకునేందుకు అవకాశం లభిస్తుంద"న్నారు. గిరిజన గ్రామాల్లో చేపట్టిన అడవి తల్లిబాట పనుల్లో ఆశించిన స్థాయిలో పురోగతి కనబడడం లేదు. ఏజెన్సీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. పక్కా ప్రణాళికతో అన్నింటినీ అధిగమించాలి. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం జన్మన్ పథకం కింద వచ్చే నిధులతోపాటు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సాయం మొత్తం కలిపి రూ.1,158 కోట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 761 గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ 662 రహదారులు నిర్మించాలన్న సంకల్పంతో పనులు ప్రారంభించాం. అడవి తల్లిబాట పనులను వేగవంతం చేయండి. ఎక్కడైనా అటవీ శాఖతోగాని, ఇంకా ఏదైనా సమస్యలు ఉంటే వాటిని తక్షణం పరిష్కరించుకునేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోండి. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించాలి. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లా, మన్యం జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ ఏదైనా సమస్య ఉంటే దాన్ని తక్షణం పరిష్కరించి పనులు ముందుకు తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలి. పండగ 2.0ని విజయవంతంగా ముందుకు తీసుకుని వెళ్లాలన్నారు. రూ.2,123 కోట్ల సాస్కి నిధులతో పల్లెల్లో 4007 కిలోమీటర్ల మేర రహదారులు, గోకులాలు, మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, కమిషనర్లు ఈ ప్రక్రియను పర్యవేక్షించాలన్నారు. పల్లెల్లో ప్రతి ఇంటికీ తాగునీరు అందించాలన్న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ పనులు ముందుకు తీసుకువెళ్తున్నాం. ప్రస్తుతం చిత్తూరు, ప్రకాశం, పల్నాడు, ఉభయ గోదావరి జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల్లో నాణ్యతా ప్రమాణాలు పక్కాగా అమలు చేయాలి. నీటి నాణ్యత పక్కగా ఉండాలి. అదే అందరి ప్రధమ బాధ్యత కావాలన్నారు.ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉన్న మంచి నీటి సరఫరా వ్యవస్థల వద్ద నీటి నాణ్యతను స్వయంగా పరిశీలన చేస్తాను. గ్రామీణ ప్రజలకు అందించే మౌలిక వసతుల్లో రోడ్లు, మంచి నీటికే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించామన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

# పట్టణాల తరహాలో గ్రామాల అభివృద్ధి

>> సుపరిపాలన దిశగా, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ శ్రీకాకుళాన్ని ఎన్నడూ లేని రీతిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. నియోజకవర్గ శాసనసభ్యులు గొండు శంకర్ ప్రజాసేవకునిగా నిరంతరం శ్రమిస్తూ నగర ప్రజలకే పరిమితం కాకుండా, జిల్లా వ్యాప్తంగా కుటుంబ సభ్యునిగా మారిపోయారని, ఆయన చేస్తున్న సేవలు, అభివృద్ధితోనే ఈ స్థాయికి చేరుకున్నారన్నారు. అనంతరం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తుందంటే ముఖ్య కారకులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, రాష్ట్ర మంత్రి లోకేష్ బాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి, శ్రీకాకుళం ముద్దు బిడ్డ కింజరాపు రామ్మోహన్ నాయుడుల సహకారాలని, కార్యకర్తలకు, బడుగు, బలహీన వర్గాలని తేడా లేకుండా, ప్రతీ ఒక్కరినీ కలుపుకుంటూ, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న పార్టీ టీడీపీ అని, అందరినీ సమన్వయం చేసుకుంటూ, అందరికీ అందుబాటులో ఉంటూ, ప్రతీ సమస్యకు సత్వర పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా వైద్యాశాఖాధికారి అనిత, మండల, నగర టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, మండల, నగర పరిధి ప్రజలు, మహిళా నాయకులు, వైద్య, సచివాలయ, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామరాజ్యమే

>> మైందన్నారు. భారత్‌లో ఆధ్యాత్మిక కేంద్రంగా అయోధ్య రామాలయం మారిందని అన్నారు. ఆలయ నిర్మాణంతో పాటు యూపీలో సుపరిపాలన అందిస్తున్న యోగి ఆదిత్య నాథ్ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసించారు. దేశంలోని ఇతర దేవాలయాలకు అయోధ్య రామాలయం మార్గదర్శకంగా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. సాంకేతికంగా ముందుడుగు వేస్తున్న భారత్‌ను ఎవరూ నిలువరించలేరని స్పష్టం చేశారు. 2047 వికసిత్ భారత్ లక్ష్యంలో యూపీ, బీహార్‌లు కూడా కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈరోజు అయోధ్యలోని దివ్యమైన, అద్భుతమైన శ్రీరామ జన్మభూమి మందిరంలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసుకునే భాగ్యం కలిగింది. మరోసారి ఇక్కడికి రావడం ఎంతో శాంతియుతంగా, ఆధ్యాత్మికంగా అనిపించింది. శ్రీరాముడి విలువలు, ఆదర్శాలు మనందరికీ శాశ్వతమైన పాఠాలు. అవి మనకు ఎల్లప్పుడూ మార్గనిర్దేశం చేస్తూ, స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. అంతకుముందు, బాలరాముడి దర్శనార్థం అయోధ్య చేరుకున్న చంద్రబాబుకు దేవాలయ అధికారులు, ఉత్తరప్రదేశ్ ఎన్డీఏ నాయకులు ఘన స్వాగతం పలికారు. శ్రీరాముడి దర్శనం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ సామాజిక మాధ్యమం వేదికగాను స్పందించారు. శ్రీరాముడు పాటించిన విలువలు కాలానికి అతీతంగా ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంటాయి. రాముడు పాటించిన విలువలు సుపరిపాలనకు నిరంతరం మార్గదర్శంగా నిలుస్తాయి. అయోధ్యలో శ్రీరామ దర్శనం నాకు నూతన శక్తిని ఇచ్చింద్ధి అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

# ప్రైవేట్ పిఆర్‌ఒలదే 'కొండ' పెత్తనం!

>> కొందరు మాటతీరు, చక్కటి వ్యవహారశైలి కలిగిన ఉద్యో గులు ప్రోటోకాల్ చూసేందుకు ప్రత్యేకంగా కేటాయించబడుతారు. ఆయా మంత్రుల నుండి సిఫార్సు లేఖలు వీరికి అందితే ప్రోటోకాల్‌కు నియమించబడ్డ ఉద్యోగులు ఆ లేఖలను తిరుమలలో అదనపు ఇఒ కార్యాలయంలోసమర్పిస్తుంటారు. అక్కడ కొందరు ఉద్యోగులు తగిన విధంగా దర్శనాలు, వసతి సౌకర్యం మంజూ రుచేస్తారు. ఇక ప్రముఖంగా న్యాయశాఖ, జిల్లా కలెక్టర్ కార్యాల యం, రెవెన్యూ విభాగం, మున్సిపల్ కార్పొరేషన్, కొన్ని ప్రభుత్వశాఖల్లో ఐఎఎస్, ఐపిఎస్ హోదాల అధికారుల ప్రోటోకాల్ చూడటానికి ఆయా శాఖల నుండి తగిన గుర్తింపుకార్డులతో సిఫా ర్సు లేఖలు తీసుకువస్తుంటారు.కానీ ఎటువంటి గుర్తింపు కార్డుగానీ, అధికారికంగా తగిన ఆధారాలు లేకపోయినా ప్రైవేట్ పిఆర్‌ఒలు పెత్తనం మాత్రం తిరుమలలో పెరిగిపోయింది. దాదాపు యాభైఅరవైమంది వరకు ప్రైవేట్ పిఆర్‌ఒల పేరుతో పెత్తనం చేస్తున్నా విజిలెన్స్ కంటికి మాత్రం కనిపించరా అనేది ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది. రెండునెలల క్రిందట నవంబర్‌నెలలో జరిగిన డయల్ యువర్ ఇఒ కార్యక్రమంలో కూడా ఓ భక్తుడు ప్రైవేట్ పిఆర్‌ఒ పేరుతో జరిగిన దందాపై ఫిర్యాదు చేయడం ఇందుకు నిదర్శనం.అయితే ఇఒ కూడా తనదైన శైలిలో వసతి,దర్శనాలకు కొండపై భక్తులు దళారులను ఆశ్రయించవద్దని,మాయమాటలు వినవద్దని,సామాన్యభక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. అయినా అలా ప్రైవేట్ పిఆర్‌ఒల పేరుతో చలామణి అవుతున్న వ్యక్తులు ఎవరనేది ఇప్పటివరకు విజిలెన్స్ ఆరా తీయకపోవడం కొసమెరుపు.

**ప్రైవేటు పిఆర్‌వోల కట్టడి ఏదీ?:** రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత తిరుమలలో బిఆర్‌నాయుడుబోర్డు ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి టిటిడి ఇఒ , అదనపు ఇఒ అధికారులు పారదర్శకంగా సామాన్యభక్తులకు వసతి, దర్శనం చేయించేలా మార్పులు తీసుకువచ్చారు. గదులు దొరకని సామాన్యభక్తులకు యాత్రికుల వసతి సముదాయాల్లో సౌకర్యాలు అందుతూన్నాయి. కొంతకాలం క్రిందట సామాన్య భక్తుడు కనీసం గదిని కూడా పొందలేకపోయాడంటే ఆశ్చర్యం లేదు. ఆ విధానంలో ప్రస్తుత అధికారులు పూర్తిమార్పులు తీసుకువచ్చారు. అయినా అడపాదడపా పలు రకాలుగా సామాన్యభక్తులను మోసంచేయడానికి దళారులు ప్రయత్నాలు చేస్తున్నారనేది టిటిడికి ఫిర్యాదులు అందుతున్నాయి. తిరుమలలో ప్రైవేటు పిఆర్‌ఒల పేరుతో కొనసాగిస్తున్న పెత్తనాలకు మాత్రం బ్రేక్ వేయలేకపోతున్నారంటే ఏమిటనేది అర్థం చేసుకోవచ్చు. మూడునాలుగునెలల క్రిందట తిరుమలలో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో చేపట్టిన తనిఖీలు కొంతవరకు ఫలితాన్నిచ్చినా ఎక్కువగా ప్రజాప్రతినిధుల లేఖలతో ఉన్న వారెవరనేది మాత్రం సైలెంట్.



సముద్రపు కోతకు గురి కాకుండా నిర్మిస్తున్న కరకట్టను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి నిర్మల

# పెదమైనవాని లంక డ్రోన్ శిక్షణలో టాప్

>> పొందిన యువత దేశ విదేశాల్లో మంచి స్థానంలో ఉన్నారని , వారంతా తమ అభిప్రాయాలను పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విశ్వకర్మ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ జరిగిందని, శిక్షణ ఎలా ఉంది, ఎలా జరిగింది అని దేశవ్యా ప్తంగా సర్వే చేయగా జమ్మూ కాశ్మీర్ మొదటి స్థానంలో ఉండగా రెండో స్థానంలో పిఎం లంక ఉండడం ఎంతో ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. రైతులు, మహిళలు డ్రోన్లు వినియోగించే స్థాయికి చేరుకోవాలన్నారు. పదేళ్ల కిందట ఇదే ప్రాంతంలో పెద్ద కొబ్బరి తోట ఉండేదని, అది సముద్రపు అలల కోతకు సముద్రంలో కలిసి పోయింద న్నారు. అలల తాకిడిని ఆపేందుకు అధునాతన టెక్నాలజీతో అడ్డుకట్ట నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందన్నారు. పదేళ్ల తర్వాత ఇక్కడ ఎంతో మార్పు వచ్చిందని సైక్లోన్ వస్తే ఈ ప్రాంతాన్ని ఎలా రక్షించాలని ఆలోచన నుంచి ఏఐ శిక్షణ వరకు అభివృద్ధి చెందిందన్నారు. పీఎం లంక వాసులకు పీఎం ఆవాస్ యోజన కింద 146 మందికి ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని, అవి రాబోయే 12 నెలలలో పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మత్స్యకారులకు బోట్లు అందించేందుకు ధరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని అవి కూడా ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నిర్మలా సీతారామన్ సూచించారు. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ దేశ ప్రగతికి, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ క్రియాశీలక పాత్ర నిర్వహిస్తున్నారన్నారు. 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ నాలుగో స్థానానికి తీసుకురావడంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆర్థిక మంత్రిగా తీసుకున్న సంస్కరణలతో సాధ్యమైందన్నారు. పీఎం లంక, తూర్పు తాళ్ల గ్రామాలలో ఇంటింటా మరుగుదొడ్లు, స్కూలు భవనాల నిర్మాణాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. పీఎం లంక సముద్రపు కోతకు గురి కాకుండా రక్షణ గోడకు 13.50 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం త్వరలో పూర్తికానున్నట్లు తెలిపారు. పెదవైనవాని లంకలో డిజిటల్ భవనం నిర్మాణం పూర్తి చేసుకోవడం, వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యావంతులకు ఉపాధి కలుగుతుంది అన్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. అనంతరం పీఎం లంక సముద్ర తీరాన సముద్రపు కోతకు గురి కాకుండా సిఎస్ ఆర్ నిధులు రూ.13.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న అడ్డుకట్ట నిర్మాణం పనులను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులతో కలిసి స్వయంగా పరిశీలించి, ప్రాజెక్ట్ చేపట్టిన ఎలైట్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వివరాలను తెలుసుకుని, పనుల నిర్మాణం ప్రజెంటేషన్ ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అంతకుముందు అక్కడే ఉన్న శివాలయాన్ని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనాలను తీసుకున్నారు.

# పూర్తి సాయం చేస్తాం

>> లంకలో పర్యటించారు.ఈ గ్రామంలో నిర్మించిన సైక్లోన్ భవనం అనేక విధాలుగా ఉపయోగపడటం సంతోషాన్నిస్తోందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఇక పెదమైనవానిలంకల గ్రామ పర్యటనలో భాగంగా అక్కడ ఆమె మాట్లాడుతూ తాను గ్రామాన్ని దత్తత తీసుకోవడం కాదు, గ్రామమే తనను దత్తత తీసుకుందని ఉద్వేగానికి లోనయ్యారు. గ్రామ మహిళల మద్దతులో సైక్లోన్ భవనం డిజిటల్ భవనంగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కేంద్రంలో శిక్షణ పొందిన అనేక మంది దేశ, విదేశాల్లో మంచి స్థానంలో ఉన్నారని గుర్తుచేశారు. శిక్షణపై సర్వేలో పెదవానిలంక దేశంలోనే రెండో స్థానంలో నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు. డ్రోన్ల వినియోగంపై ఏపీలో తొలిసారి పీఎం (పెదమైనవానిలంక)లో శిక్షణ ఇస్తున్నారని నిర్మల అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, స్థానిక ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు పెదవానిలంకలో నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో నిర్మల పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని డిజిటల్ భవన్‌ను సందర్శించారు.శిక్షణ కేంద్రాలకు సంబంధించిన వివరాలను అధికారులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, తీరప్రాంత యువత ఉన్నత చదువులు చదివి దేశానికి, రాష్ట్రానికి మంచి సేవలు అందించాలని కోరారు.





# 'అల్లిక'జిగిబిగి

>> దీనిని ఎంతో ఓపికతో, నిశితమైన శ్రద్ధతో పరిరక్షించారు. నేడు ఈ సంప్రదాయం ఒక కొత్త కోణంలో ముందుకు తీసుకెళ్లబడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నాబార్డ్ సంయుక్తంగా కళాకారులకు కొత్త డిజైన్లను నేర్పిస్తూ, మెరుగైన నైపుణ్య శిక్షణను అందిస్తూ, వారిని కొత్త మార్కెట్లతో అనుసంధానం చేస్తున్నాయి.నరసాపురం లేస్‌కు జిఐ ట్యాగ్ కూడా లభించింది. నేడు, దీని నుండి 500 కంటే ఎక్కువ ఉత్పత్తులు తయారు చేయబడుతున్నాయి. 250కి పైగా గ్రామాలలో సుమారు లక్ష మంది మహిళలు దీని ద్వారా ఉపాధి పొందుతున్నారు' అని మోడీ ఈ సందర్భంగా వివరించారు.

# ఇక రాష్ట్రంలో రెవెన్యూ క్లినిక్‌లు

>> చిన సీఎం చంద్రబాబు, దీనిని తక్షణమే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సీసీఎల్ఏను ఆదేశించారు. ఈ నిర్ణయంపై కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. "జిల్లాలో మేం ప్రవేశపెట్టిన విధానాన్ని ప్రభుత్వం గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తుండటం చాలా సంతోషంగా ఉంది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా వినియోగిస్తున్నారు. అర్జీ నమోదు చేసిన వెంటనే, సమస్య పరిష్కారానికి పట్టే సమయం, బాధ్యతగల అధికారి వివరాలతో యాక్షన్ ప్లాన్ జనరేట్ అవుతుంది. అంతేకాకుండా, గడువు ముగిశాక ఐవీఆర్ఎస్ (ుజులిలీ) ద్వారా అర్జీదారునికి ఆటోమేటెడ్ కాల్ వెళ్లి, సమస్య పరిష్కారమైందో లేదో ఫీడ్‌బ్యాక్ తీసుకుంటారు. ఈ నూతన విధానంతో రెవెన్యూ యంత్రాంగంలో జవాబుదారీతనం పెరిగి, ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

# రూ.20కే కిలో గోధుమ పిండి

>> పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. 2,68,709 కేజీల ప్యాకెట్లను సివిల్ సప్లైస్ గోదాములలో నిల్వ ఉంచుతుంది.బాపట్ల జిల్లాకు 58,718 కేజీ ప్యాకెట్లు, పల్నాడు జిల్లాకు 1,19,677 ప్యాకెట్లను కేటాయించింది. గోధుమ పిండికి డీలర్ల నుంచి ముందుగానే నగదు చెల్లించుకుని సరఫరా చేసేందుకు సిద్ధమైంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి గోధుమపిండి ప్యాకెట్లను నెలాఖరులోగా రేషన్ దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి డీలర్లు రేషన్ సరుకుల్లో గోధుమ పిండి పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు. డీలర్లకు ఇచ్చే రూ.1 కమీషన్‌నూ రూ.20 ధరలోనే చేర్చారు. దీని వల్ల అదనంగా ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరాదని రేషన్ డీలర్లకు పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కార్డుదారులు జనవరి నెల రేషన్ సరకుల కోసం డిపోలకు వెళ్లినప్పుడు డీలర్లను అడిగి బియ్యం, చక్కెర, జొన్నలు, గోధుమపిండి ప్యాకెట్ తీసుకోవచ్చని అధికార వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం సబ్సిడీలను భరించి కార్డుదారుల కోసం ప్రత్యేకంగా జొన్నలు, గోధుమ పిండి కొనుగోలు చేసింది. వీటిని కార్డుదారులు సొంతానికి వినియోగించుకోవాలి. ఆయా సరకులను ఇతరులకు అమ్మడం నేరం. కార్డు దారులు ఎవరైనా అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుంటూరు డీఎస్ఓ కోమలి పద్మ హెచ్చరించారు. గత నెలలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ప్రభుత్వం బియ్యంతో పాటు జొన్నల పంపిణీని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందుకోసం గుంటూరు జిల్లాకు 17,70,982 కిలోలు, పల్నాడుకు 18,99,399 కిలోలను కేటాయిస్తోంది. ఒక్కో కార్డుదారులు 3 కేజీల వరకు జొన్నల్ని తీసుకునే వెసులుబాటు కల్పించింది ప్రభుత్వం. అయితే.. అంతకు సమానంగా బియ్యం కోటాను తగ్గిస్తారు.

# త్రివిధ లక్ష్యాలతో సుపరిపాలన

## రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారానే నిర్ణయాలు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 28,ప్రభాతవార్తప్రతినిధి:** "దీర్ఘ, మధ్య, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామన్నారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని సీఎం చంద్రబాబునాయుడు అన్ని ప్రభుత్వరంగ కీలకశాఖలకు ఆదేశాలను జారీ చేసారు. ప్రభుత్వ పనితీరు అత్యంత ప్రయోజనాత్మకంగా ఉందనే సంతృప్తి ప్రజలకు కలగచేయాలన్నారు.సీఎంవో కార్యాలయం ద్వారా ఈ సమాచారం వెల్ల నెలవారీ, త్రైమాసికాల వారీగా లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలి. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉంది. ప్రతీ నియోజకవర్గానికీ ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తాం. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నాం. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే అధికారులు, ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యత కావాలి. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్థవంతంగా ఆ విభాగాన్ని వినియోగించుకోవాలి. ఇటీవల వచ్చిన తుఫాన్ సమయంలో టెక్నాలజీ వినియోగించుకుని అంతా కలిసి కట్టుగా పని చేశాం. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగాం. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారింది. గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వన్ విజన్‌వన్ డైరెక్షన్ ఇదే ప్రభుత్వ విధానమని.. దీనికి అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ దిశగా ప్రభుత్వ యంత్రాంగం పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. సత్వర నిర్ణయాలు ఏ విధంగా తీసుకోవచ్చు...? డేటా ఆధారిత గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు ఏ విధంగా అందించవచ్చనే అంశాలపై సీఎం చంద్రబాబు అధికారులకు పలు సూచనలు చంద్రబాబు చేసారు. ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోంది. సిటిజెన్ డేటా అంతా క్రోడీకరించామన్నారు.

## వారం - వర్జ్యం

29-12-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
నవమి ఉ.10.10, పూర్వాషాఢ కార్తె
అశ్విని ఉ.6.04
వర్జ్యం : రా.2.20-రా.3.50
దు.ము.12.33-1.18
2) మ.2.46-3.32
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** ప్రజలతో సంబంధాలు మెరుగు పరచుకోవడానికి అవిరళ కృషి చేస్తారు. కీళ్ళ బాధలు ఇబ్బంది పెడతాయి.

**వృషభం:** స్త్రీల వలన చిక్కు సమస్యలు ఏర్పడతాయి. ఫలితాలు మాత్రం వెను వెంటనే రావు.క్రయ విక్రయాలకు దూరంగా వుండండి.

**మిథునం:** శత్రువర్గంలోని అనైక్యతను గుర్తించి వారితో ముఖాముఖి పోరాడి లాభపడతారు. ఆకస్మిక ప్రయాణాలు.

**కర్కాటకం:**ఎవ్వరినీ నమ్మకుండా మీ పనిని మీరే స్వయంగా చేసుకోవడం చెప్పదగినది. దైవానుగ్రహాన్ని ఎంతగానో నమ్ముకుంటారు.

**సింహం:**పని వత్తిడి అధికమవటం వలన క్షణం తీరికలేకుండా శ్రమిస్తారు. స్త్రీలతో విభేదాలు రాకుండా జాగ్రత్తలు పాటించండి.

**కన్య :** పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

**తుల :** పై అధికారులతో మెలుకవగా వ్యవహరించండి. అకాల భోజనం, వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు.

**వృశ్చికం:**బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. కళారంగంలోని వారికి విదేశీ పర్యటనలు.

**ధనుస్సు:** కుటుంబసభ్యులతో కలిసి దేవాలయ సందర్శనం చేసుకుంటారు. సోదర, సోదరీ వర్గంతో కలిసి ఇష్టాగోష్టి సాగిస్తారు.

**మకరం:** సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. వాహన సౌఖ్యం.

**కుంభం:** మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండటమే శ్రేయోదాయకం.

**మీనం :** సంఘంలో ఉన్నతమైన వారు మీకు అనుకూలంగా వ్యవహరించడం కొంత ఊరట కలిగించే అంశమవుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

29-12P g3exHMNWJQEKCTPL 3 VO_29-12P g3exHMNWJQEKCTPL.qxd 28/Dec/25 10:51 PM Page 1



# రేపు ఆగమోక్తంగా తెరచుకోనున్న వైకుంఠద్వారాలు!




## తెల్లవారుజామున 5 గంటల నుండి టోకెన్ భక్తులకు దర్శనం

తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: సాక్షాత్తు వైకుంఠంలో శ్రీమహావిష్ణువే కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామికి ఆవిర్భవించి భక్తులకు దర్శనం ఇస్తున్నాడనేది పురాణాల కథనం. కలియుగవైకుంఠం తిరుమల ఆలయంలో పవిత్రమైన ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశి(రేపు), ద్వాదశి (ఎల్లుండి) ఘడియల సందర్భంగా వైకుంఠవాకిలి ద్వారాలు మంగళవారం వేకువజామున (రేపు) 1.35-1.40 గంటలకు తెరచుకోనున్నాయి. వైఖానస ఆగమోక్తంగా విశేష పూజాదికార్యక్రమాలు, కైంకర్యాలు నిర్వహించిన అనంతరం శ్రీవారి ఆలయ అర్చకులు, అధికారులు తెల్లవారుజామున బంగారువాకిలికి సమీపంలో ఉన్న వైకుంఠద్వారాలను తెరవనున్నారు. ఆ తరువాత ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి కైంకర్యాలు ముగించిన తరువాత రేపు తెల్లవారుజామున 2గంటల నుండి తిరుమలకు చేరుకున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఐఏఎస్, ఐపిఎస్‌లు, టిటిడి బోర్డు సభ్యులు వారివారి కుటుంబాలతో వైకుంఠ ద్వార దర్శనం చేసుకోనున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం హారతి లేని లఘుదర్శనం కల్పిస్తారు. 3గంటల్లోపే ప్రముఖుల దర్శనాలు ముగించి ఉదయం 5గంటలకు ఇడిప్‌లో ఆన్‌లైన్ టోకెన్లు కలిగిన భక్తులను క్యూలైన్‌లలో వదలి లోపలకు అనుమతించనున్నారు. ఇప్పటికే తిరుమలలో ఆలయం పరిసరాలు సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం ముందు రంగనాథ మండపం సెట్టింగ్ ఈ ఏడాది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నేటి సాయంత్రానికి తిరుమలకు చేరుకునే ప్రముఖులకు పద్మావతి విచారణ కార్యాలయం సమీపంలోని వెంకటకళానిలయం వద్ద న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలకు వసతి, దర్శన టిక్కెట్లు మంజూరు కౌంటర్లు ఏర్పాటుచేశారు. వీరికి పద్మావతి ఏరియాలోనే గదులను కేటాయిస్తారు. ఇతరరాష్ట్రాల ప్రజాప్రతినిధులకు, సిఎం కార్యాలయం లేఖలకు నారాయణగిరి విశ్రాంతి గృహాల్లో వసతి కల్పిస్తారు. ఐఏఎస్, ఐపిఎస్ లేఖలకు నందకం, వకుళమాత విశ్రాంతి గృహాల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి పర్యవేక్షణలో డిప్యూటీ ఇఒలు లోకనాథం, భాస్కర్, రాజేంద్ర, సోమన్నారాయణ, సత్రానాయక్, సూపరింటెండెంట్‌లకు బాధ్యతలు అప్పగించారు.

**రేపు స్వర్ణరథం:** వైకుంఠ ఏకాదశి పర్వదినాన మంగళవారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు స్వర్ణరథం ఆలయ మాఢవీధుల్లో జరగనుంది. విశేష అలంకరణలో మలయప్పస్వామి స్వర్ణరథాన్ని అధిరోహించి మాఢవీదుల్లో భక్తులను కటాక్షించనున్నారు. ఆలయ మాఢవీధుల్లో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు.

## విద్యుత్ సమస్యలపై నేడు డయల్ యువర్ ఎస్పీడిసిఎల్ సిఎండి



తిరుపతి, డిసెంబరు 28 ప్రభాత వార్త ప్రతినిధి: ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో వినియోగదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిం చేందుకు నేటి ఉదయం "డయల్ యువర్ ఎస్పి డిసిఎల్ సిఎండి" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పిఆర్ఓ మధుసూదన తెలిపారు. తొమ్మిది జిల్లాల్లోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సిఎండి శివశంకర్ లోతేటికి నేరుగా ఫోన్ ద్వారా 89777 16661నంబర్‌కు తెలియ జేయాలని తెలిపారు. వినియోగదారులు తమ విద్యుత్ సర్వీస్ నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలని టి.మధుసూదన తెలిపారు. విద్యుత్ సమస్యలను విన్నవించాలని కోరారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మధుసూదన వివరించారు.

### టోకెన్ కలిగిన భక్తులకు అసౌకర్యం లేకుండా

# వైకుంఠ దర్శనాలు

### పార్కింగ్ ఏర్పాట్లు, క్యూలైన్ల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు

తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసంలో రేపటి నుండి జనవరి 8వరకు పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలను భక్తులకు సౌకర్యవంతంగా కల్పించేలా అన్ని ఏర్పాట్లు చేపట్టామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ముఖ్యంగా తొలి మూడు రోజులు (30, 31, జనవరి 1)రేపు, ఎల్లుండి, గురువారం వరకు ఆన్‌లైన్‌లో టోకెన్లు అందుకున్న భక్తులను మాత్రమే ఆయా రోజుల్లో స్లాట్ సమయానికి ముందు క్యూలైన్లలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు అన్ని శాఖల అదికారులు, ఉద్యోగులు, సిబ్బంది సిద్దంగా ఉన్నారన్నారు. ఇప్పటికే పదిరోజుల వైకుంఠ ద్వార దర్శనాల్లో తొలి మూడురోజులు టోకెన్లు పొందిన 1.75లక్షల మంది భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, అదనపు సౌకర్యాలు కల్పించడంలో టిటిడి విజిలెన్స్, టిటిడి ఉద్యోగులు, పోలీసులతో సమన్వయం చేసుకున్నామన్నారు. ఈ ఏడాది భక్తులకు అదనంగా వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించేలా స్థలాలను సిద్దంచేయడం జరిగిందన్నారు. ఈ మూడురోజులు టోకెన్ కలిగిన భక్తులను క్యూలైన్లలోనికి నిర్దేశిత సమయం ప్రకారం ఆయా రోజుల్లోనే అనుమతించేలా ఆదేశాలిచ్చామన్నారు. జనవరి 2నుండి 8వరకు ముక్తిద్వారం కోసం తరలివచ్చే భక్తులకు సురక్షిత దర్శనం, ప్రశాంత వాతావరణం కల్పించడంలో పోలీసులు, విజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తారని అదనపు ఇఒ చౌదరి పేర్కొన్నారు. భక్తులకు ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. టోకెన్లుతో మూడురోజులు దర్శనం కోసం వచ్చిన భక్తులకు సాఫీగా క్యూలైన్ల నిర్వహణ, రద్దీ ప్రాంతాల్లో భక్తుల భద్రతకు అదనపు సిబ్బంది నియామకం, భక్తుల రద్దీ చేరినా తగినట్లు సామరస్యంగా వ్యవహరించి నియంత్రించడం జరుగుతుంద

## తిరుమల సమాచారం





న్నారు. టోకెన్ లేని భక్తులను తిరుమలపైకి అనుమతించినా ఆలయం ముందు వరకే, అఖిలాండం వరకే పరిమితం చేయడం వంటి వాటిపై దృష్టి పెట్టామన్నారు. ఈ పదిరోజులు ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది అంకితభావంతో నిబ్ధదతో సేవలందిస్తారని ఆయన తెలిపారు. ఆలయంలో భక్తులకు మహాలఘు దర్శనంలో వైకుంఠవాకిలి దర్శనం చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు.

ఆన్‌లైన్‌లో సామాన్యభక్తులకు వైకుంఠద్వార దర్శనాలకు సంబంధించి 300 రూపాయలు ప్రత్యేక ప్రవేశ దర్శనం 1.20లక్షలు టిక్కెట్లు, శ్రీవాణి విఐపి బ్రేక్ దర్శనాలను వారంరోజులకు ఏడువేల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేయడం జరిగిందన్నారు.

వైకుంఠద్వారం తెరచి ఉంచే పదిరోజులు సిఫార్సు లేఖలు స్వీకరించడం లేదని టిటిడి ప్రకటించింది. తదనుగుణంగా సామాన్యభక్తులకు దర్శనాలు చేయించేలా చూస్తారు.

### జనవరి 3న మొగలిచెర్ల

# దత్తమందిరంలో సుదర్శనహోమం

తిరుపతి, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: వేదశాస్త్రాల ప్రకారం పుష్యమాసంలో నిర్వహించే సుదర్శనహోమం ద్వారా శ్రీమహావిష్ణువు సుదర్శనచక్ర శక్తి సక్రియమై, గ్రహదోషాలు, శత్రుబాధలు నివృత్తి అవుతాయని వేదపండితుల వాక్కు. జనవరి 3వ తేదీ పుష్యమాస పౌర్ణమి ఘడియల్లో నెల్లూరు జిల్లా లింగసముద్రం మొగలిచెర్ల గ్రామంలోని దత్తాత్రేయ మందిరంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్, కన్వీనర్ పవని విష్ణుకౌశిక్ తెలిపారు. ఈ హోమంలో ప్రత్యక్షంగా పాల్గొనే భక్తులు 3వ తేదీ ఉదయం 8గంటలకు మందిరం వద్దకు చేరుకోవాలని కోరారు. పరోక్షంగా పాల్గొనే భక్తులు గోత్రనామాలతో 99089 73699, 91828 82632 నంబర్లకు సంప్రదించాలని కోరారు.





### శ్రీవారి మెట్లమార్గంలో

# ప్రాథమిక చికిత్స కేంద్రం

తిరుమల, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి గోవింద నామస్మరణతో భక్తితో తిరుమలకు నడచుకుని వచ్చే యాత్రికుల సౌకర్యార్థం అలిపిరి నడకమార్గంలో ఏడోమైలు వద్ద ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని టిటిడి ఏర్పాటుచేసింది. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ కేంద్రాన్ని ఆదివారం ఉదయం టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రారంభించారు. నడకదారి భక్తుల సౌకర్యార్థం ఇక్కడ ప్రాథమిక చికిత్సా కేంద్రం నెలకొల్పడంతో అత్యవసర పరిస్థితుల్లో భక్తులు ఈ కేంద్రం వద్ద వైద్యసేవలను వినియోగించుకోవచ్చన్నారు. ఇప్పటికే శ్రీవారి మెట్టు మార్గంలో కూడా ప్రాథమిక చికిత్సా కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మాట్లాడుతూ తిరుమలలో వైద్యసౌకర్యాలను విస్తృతం చేయడంలో భాగంగా అలిపిరి నడకమార్గంలో ఆధునిక సౌకర్యాలతో ప్రాథమిక చికిత్సా కేంద్రం భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ప్రతిరోజూ ఈ మార్గంలో 30వేల వరకు భక్తులు నడుచుకుంటూ వస్తారని తెలిపారు. వారికి ఏదేని అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కేంద్రంలో వైద్యసహాయం పొందవచ్చని చౌదరి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ, టిటిడి సిఎంఒ డాక్టర్ బి.కుసుమకుమారి, మెడికల్ అధికారిణి డాక్టర్ ఎస్.కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు.

### పిపిపి పేరిట ప్రైవేటు వ్యక్తులకు

# ప్రభుత్వ ఆస్తులు

### సిఎంకు సిపిఐ రామకృష్ణ బహిరంగ లేఖ

విజయవాడ,డిసెంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి: మెడికల్ కాలేజీల పీపీపీ విధానాన్ని విరమించుకోవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. పీపీపీ పేరుతో ఏపీలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించే యోచనను విరమించుకోవాలని సూచించారు. మెడికల్ కళాశాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ముఖ్యమంత్రి అత్యుత్సాహం చూపిస్తూ, మొండిగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఏపీలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలు, మేధావులు అందరూ ముక్తకంఠంతో రాష్ట్ర ప్రభుత్వ పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటైన వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించడంతోపాటు, రెండేళ్ల పాటు సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమవటం తగదని అన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకునేందుకు మాత్రమే ప్రైవేటుకు అవకాశం కల్పించడం విచారకరమని తెలిపారు.

## తిరుపతి జిల్లా గంజాయి, డ్రగ్స్ రహితమే లక్ష్యం



# భద్రతకే తొలి ప్రాధాన్యత

### - వార్షిక నివేదికలో తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: యాత్రాస్థలం, ప్రసిద్ధపుణ్యక్షేత్రంకు నిలయమైన తిరుపతి జిల్లాను గంజాయి, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడమే ముందున్న లక్ష్యమని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఉద్ఘాటించారు. జిల్లా ప్రజలకు, నిత్యం ప్రపంచంనలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తులకు భద్రత కల్పించడం తొలి ప్రాధాన్యత అన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు పలు రకాలుగా నేరాలకు పాల్పడిన పలువురు నేరస్తులపై పిడియాక్టు నమోదు చేశామన్నారు. మొత్తం 16మందిపై నమోదు చేసి కేంద్ర కర్మాగారానికి తరలించామన్నారు. ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా నూతన పోలీస్ కార్యాలయంలో 2025 వార్షిక నివేదిక వెల్లడించారు. తిరుపతి జిల్లా అదనపు ఎస్పీలు రవిమనోహరచారి, శ్రీనివాసులు, నాగభూషణం, ఎస్‌బి డిఎస్పీ జె.వెంకటనారాయణ, సిఐ విక్రమ్‌తో కలసి వివరాలు తెలిపారు. పుణ్యక్షేత్రాలకు నిలయమైన తిరుపతి జిల్లాను ప్రశాంత వాతారణంలో చూడటమే ముఖ్యమన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో డిజిపి హరీశ్‌కుమార్ గుప్త సూచనలతో తిరుపతి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవడంతో పాటు తిరుమలకు వచ్చే ప్రముఖులకు భద్రతలో రాజీపడకుండా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అధునాతక సాంకేతికతను వినియోగించుకుని పలు రకాల నేరాలను నియంత్రించడం చేస్తున్నామన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 2024లో జిల్లాలో 9,118 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 9,253 కేసులు నమోదయ్యాయన్నారు. 0.71శాతం కేసులు స్వల్పంగా పెరిగాయి. 2025లో సైబర్ కేసుల్లో 14,45,13,864 రూపాయలు నగదును సైబర్ నేరస్తులు దోచుకోగా 3,53,01,114 రూపాయలు తిరిగి స్వాధీనం చేసుకోవడం, బాధితులకు నేరుగా రీఫండ్ చేయించారు. 2,485 మొబైల్‌ఫోన్లను రికవరీ చేశారు. పటిష్టమైన కోర్టు మానిటరింగ్ వ్యవస్థతో నేరాల పై విచారణలను ప్రత్యక్షంగా పర్యవేక్షించి ముద్దాయిలకు శిక్షపడేలా చూశారు. జిల్లాలో 10వరకు ఫోక్సో కేసులు నమోదయ్యాయి. 9 హత్య కేసులు, హత్యాయత్నం 3కేసులు నమోదుచేశారు. గంజాయి నిర్మూలనకు, మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. 258 మందిపై వివిధ రకాల షీట్లు తెరిచారు. సాంకేతికతను వినియోగించి సంచలన కేసులను శోధించామని ఎస్పీ వివరించారు.



హోంమంత్రి అనితను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

# నేర నియంత్రణలో మరింత పట్టుదలతో వ్యవహరించాలి

### - పోలీసులకు హోంమంత్రి అనిత ఆదేశం

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: నేర నియంత్రణలో పోలీసు మరింత పట్టుదలతో వ్యవహరించాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. గత 18 నెలల కూటమి పాలన క్రైమ్ నేరాలను అదుపుచేసిన పోలీసుకు ఆమె అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో సైబర్ నేరస్తులను గుర్తించి. అరెస్ట్ చేస్తున్న క్రైమ్ విభాగాన్ని ప్రశంసించారు. తాడేపల్లిలో రాష్ట్ర స్థాయి క్రైమ్ రివ్యూ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తుత ఏడాదిలో నమోదైన నేరాలు, వాటిపై విధించిన శిక్షలు, కేసుల పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. నేరాల నియంత్రణ, కేసుల త్వరిత పరిష్కారం దిశగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సైబర్ క్రైమ్, క్రిప్టో కరెన్సీ దుర్వినియోగం, బ్లాక్ చైన్ టెక్నాలజీ, డీప్ ఫేక్ టెక్నాలజీ వంటి ఆధునిక సవాళ్లను ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన నివారణ చర్యలపై మంత్రి అనిత అధికారులతో చర్చించారు. సమావేశంలో భాగంగా నేర పరిశోధనలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 12 మంది అధికారులను సన్మానించారు. వారి సేవలను ప్రశంసిస్తూ, ఇతరులకు ప్రేరణగా నిలవాలని సూచించారు. నూతన సంవత్సరంలో కేసుల పరిష్కారానికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి అనిత ఆదేశించారు. మంత్రి అనితను పోలీసు అధికారులు సన్మానించారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులు, నిపుణులైన ప్రొఫెసర్లు పాల్గొని తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణకు సమన్వయంతో కూడిన కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు. సిఐడి డిజి డాక్టర్ రవిశంకర్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు, సిఐడి ఎస్పీలు పాల్గొన్నారు.




# పిపిపిపై తీవ్ర ప్రజా వ్యతిరేకత

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పీపీపీ విధానంలో చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపై తొలి నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. అయితే తాజాగా అధికార పార్టీ, వైఎస్సార్ కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం మరింత పెరిగింది. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలకు ప్రభుత్వం నిర్వహించిన టెండర్లకు మిశ్రమ స్పందన రావడానికి వైసీపీ నేతలే కారణమని అధికార పార్టీ నాయకులు విమర్శిస్తుంటే వారికి వైసీపీ శ్రేణులు అదే స్థాయిలో స్ట్రాంగ్ కౌంటర్లు ఇస్తున్నారు. అంతేకాదు మెడికల్ కాలేజీలను ప్రవేటీకరణ చేయొద్దని, ప్రభుత్వమే నిర్మించి పేదలకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. తాజాగా సైతం విరుచుకుపడ్డారు. వైద్యాన్ని ప్రైవేట్‌పరం చేయాలని సర్కార్ చూస్తోందని ఆయన ఆరోపించారు. ప్రైవేట్ వ్యక్తులు వాయపారం మాత్రమే చేస్తారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను చంద్రబాబుకు పట్టడం లేదని విమర్శించారు. 'పీపీపీ, పీ4తో ఎవరు బాగుపడ్డారో వారికే తెలియాలి. 90 పైసలకే 50 కోట్ల విలువైన భూములు కట్టబెడుతున్నారు. గూగుల్, టిసిఎస్ ఇంత చౌకగా ఎక్కడైనా భూములు తీసుకుందా? పెద్దోళ్ళ పేరుతో భూములు దోచుకుంటున్నారు. రాజధాని రైతులను సిఆర్డీఏ పట్టించుకోవడం లేదు' అని పేర్ని నాని ఆరోపించారు.

### ధార్మిక కేంద్రాలను రాజకీయాలకు

# వాడుకోవద్దు

### రాష్ట్ర ప్రభుత్వంపై వైసిపి నేతల మండిపాటు

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వ పాలనలో ధార్మిక సంస్థలపై దాడులు జరుగుతున్నాయని వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆరోపించారు. హిందువుల మనోభావాలతో ప్రస్తుత ప్రభుత్వం ఆటలాడుతోందని విమరి ్శంచారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం, పరకామణిలో చోరీ కేసులతో టీటీడీ ప్రతిష్టను దిగజార్చే ప్రయత్నం జరుగు తోందన్నారు. కేవలం వైసిపిపై బురదజల్లేందుకు ప్రభుత్వంలోని కొందరు పనిగట్టు కుని దేవాలయాలను మాధ్యమాలుగా వాడుకోవడాన్ని తప్పుబట్టారు. ధార్మిక కేంద్రాలను రాజకీయాలకు ఆయుధాలుగా వాడుకోవద్దన్నారు. ప్రఖ్యాతి గాంచిన విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేవాలయానికి ఆదాయం వస్తున్నా ఇటువంటి పరిస్థితి నెలకొనడం పట్ల విస్మయానికి గురయ్యారు. హిందువులకు అన్యాయం చేస్తున్నవారు హిందూ ధర్మ పరిరక్షణ విషయంపై వైసీపీ విమర్శించే అర్హత కల్గిఉండరని స్పష్టం చేశారు. పేదల ఇళ్ళపై సిఎం చంద్రబాబు నాయుడు దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ కీకల నేత మాజీ మంత్రి కాకాని గోవర్దన్ రెడ్డి ఆరోపించారు. వైసీపీ హయాంలో కట్టిన ఇళ్ళను కూటమి ప్రభుత్వ హయాంలో నిర్మించామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందన్నారు. అమరావతిలో ప్యాలెస్ కట్టుకునే ఆలోచన తప్ప పేదల ఇళ్ళపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇళ్ళ నిర్మాణంలో అవినీతి జరిగిందనే అనుమానాలున్నాయని, వాటిపై సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వైసీపీ కార్యకర్తలు రప్పా రప్పా అంటే జైలుకు పంపిస్తున్నారని టిడిపి శ్రేణులు చేసిన దాడులపై చర్యలెందుకు లేవని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జైళ్ళు, కేసులకు వైసిపి శ్రేణులు భయపడే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.



### సోషల్ మీడియాలో

# ప్రకాష్‌రాజ్ వర్సెస్ విష్ణువర్దన్‌రెడ్డి

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: సామాజిక మాధ్యమం వేదికగా సినీ నటుడు ప్రకాష్‌రాజ్, బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి నడుమ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి ఈ మధ్యన ఓ మీడియా సమావేశంలో ప్రకాష్‌రాజ్ మాట్లాడుతూ కేంద్రం మావోయిస్టులను హతమార్చడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం పాపం చేశారని అలా చంపేస్తున్నారని ప్రశ్నించారు. వాళ్లు కూడ ప్రజలే కదా... జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని అడగాలి కానీ చంపడం ఏంటి అని ప్రశ్నించారు. కాగా ఆ వీడియోను విష్ణువర్ధన్‌రెడ్డి షేర్ చేస్తూ ప్రకాష్ రాజ్‌కు కౌంటర్ ఇచ్చారు. మావోయిస్టులు ఎంతో మంది అమాయకులను చంపారు. అందులో ఎక్కువ మంది గిరిజనులు కూడా ఉన్నారని పోలీసులు, రాజకీయ నేతలు కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఏ కారణంతో చంపినా అసలు చంపే హక్కు ఉందని ఎప్పుడైనా మీరు ప్రశ్నించారా? అని అడిగారు. నేడు జనజీవన స్రవంతిలోకి వచ్చిన మావోయిస్టు నేతలే అడవిలో ఉన్న తోటివారి తుపాకులు హింసను ఆపమంటున్నారని పేర్కొన్నారు. ఇక తాజాగా విష్ణువర్దన్‌రెడ్డి ట్వీట్‌పై ప్రకాష్‌రాజ్ స్పందించారు. వెంటనే రియాక్ట్ అయ్యారు కాలిందా? జస్ట్ ఆస్కింగ్ అంటూ ట్వీట్ చేశారు. దీంతో విష్ణువర్దన్‌రాజు ఎలాంటి రిప్లై ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# సుంకిలో ఏనుగులు విధ్వంసం

గరుగుబిల్లి (పార్వతీపురం మన్యం జిల్లా), డిసెంబరు 28, ప్రభాతవార్త: పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండల పరిధిలోని సుంకి గ్రామపంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం సంబంధిం చిన పోల్స్ను శుక్రవారం ఏనుగులు ధ్వంసం చేశాయి. సుంకి గ్రామ పరిసరాల్లోకి ప్రవేశించిన ఏనుగులు గుంపు గ్రామ సమీపంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం చుట్టూ ఏర్పాటుచేసిన స్తంభాలను ధ్వంసం చేశాయని పంచాయతీ సర్పంచ్ కరణం రవీంద్ర తెలిపారు.

కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో సంచరిస్తున్న గజరాజులు సుంకి గ్రామ పరిసరాల్లోకి ప్రవేశించాయి. దీంతో సుంకి గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుంకి గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరి స్తుండటంతో పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతం నుంచి ఏనుగులు గుంపును తరలించేం దుకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

వార్త

లోకంలో నిన్ను గురించి భూషిస్తున్నారా? దూషిస్తున్నారా? అనేది ముఖ్యం కాదు. చర్చిస్తున్నారా? లేదా అనేది ముఖ్యం.


-చర్చిల్

# ఆరావళీ! ఇదేమి కేళి!

రేపోమాపో మాయమవుతాయనుకున్న ఆరావళీ పర్వత పంక్తులకు ఇప్పుడు బోలెడంత రక్షణ దొరుకుతోంది. గుట్టలు తవ్వడమంటే మామూలే. పర్వతాలను కూడా తవ్వేసుకునే తిమింగళాలున్నాయంటే కాస్త సరిపెట్టుకోవచ్చు. అవి చదునైతే జీవ జాతులు బతుకుతాయనీ సర్దేసుకోవచ్చు. గుట్టలు మింగే బకాసురుల వలన ప్రభుత్వ ఖజానాకు ఎంతో నష్టం వాటిల్లుతుంది. వాటిని ఏలిన వారు చూసుకుంటారులే అని సరిపెట్టుకునేలా విషయం లేదు. ఇప్పుడా ఏలిన వారి నుంచే చరిత్ర ప్రసిద్ధి కలిగిన ఆరావళీ పర్వతాలకు ముప్పు ఏర్పడింది. గగ్గోలు పెట్టాక కేంద్రమే కాస్త తగ్గి ఇకపై ఆరావళీ పర్వతాలు తవ్వుకునేందుకు అనుమతించబోమని గద్గద స్వరంతో ప్రజలకు ఓవిజ్ఞప్తిని జారీచేశారు. గతంలోనే వాటిని యధేచ్ఛగా కాకపోయినా కొంత ప్రాంతాన్ని మైనింగ్‌కిచ్చేసింది. ఇది మునుపటి మాట. చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఆరావళీ పర్వతాలు ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు దాదాపు 700 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉంది. వాటికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం తొలుత కొత్త నిర్వచనాన్ని చెప్పగా విపక్షాలు వ్యతిరేకించాయి. కేవలంవంద మీటర్ల ఎత్తు ఉన్నవి మాత్రమే ఆరావళీ పర్వతపంక్తుల లోకి వస్తాయని కేంద్రం ప్రకటించింది. దేశవ్యాప్తంగా కేంద్రం ఇచ్చిన ఈ నిర్వచనాన్ని జనం ఎండగట్టారు. నిజానికి అక్కడ విచ్చలవిడిగా జరుగుతున్న మైనింగ్, రియాల్టీ కార్యకలాపాల కారణంగా ఆ పర్వతాల ఉనికికే భంగం వాటిల్లింది. ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా ఆ ప్రాచీన పర్వతాల శ్రేణులను విశ్లేషించి నిర్వచించిందో కానీ దాదాపు ఆ పర్వతశ్రేణులు ఎప్పటికైనా కనుమరుగవుతాయని,వాటివల్ల పర్యావరణం బాగా దెబ్బ తింటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. మైనింగ్ అక్రమాలను అడ్డుకోవాల్సిన కేంద్రప్రభుత్వం తన బాధ్యతను మరచిపోయిందో ఏమోకానీ ఆరావళీ పర్వతాల భౌగోళిక స్వరూపాన్నే మార్చచూసింది. దాంతో పర్యావరణవేత్తలు, కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ ఆఖరికి కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ కూడా ప్రభుత్వం అలా చేయకుండా ఉండాల్సిందంటూ నిరసన వ్యక్తంచేశారు. ఆరావళీ నిలువునా అడవులు, నీటివనరులు ప్రఖ్యాతి చెందిన రాజస్థాన్‌ల శిధిలాలు, చారిత్రక ప్రదేశాలు, దేవాలయాలున్నాయి. అంతే ప్రాధాన్యత ఉన్న అరుదైన ఖనిజాలు కూడా ఈ పర్వతాల మాటున దాగి ఉన్నాయి. రాగి, జింక్, జిప్సమ్, క్వార్జ్, పాలరాయి, రాక్‌సల్ఫేట్ వంటి వన్నీ ఇందులో దాగిఉన్నాయి. దీన్ని హస్తగతం చేసుకోవాలని ఎదురు చూస్తున్న మైనింగ్ మాఫియాను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం కదిలిరాలేదు. పైగా ఆరావళీ పర్వతాలను పరిధిని కుదిస్తూ కేంద్ర పర్యావరణ శాఖ సుప్రీంకోర్టుకు ఓ నివేదిక సమర్పించింది. దాని ప్రకారం 100 మీటర్లకంటే లోపు ఎత్తు ఉన్న పర్వతాలను ఆరావళీ పరిధి నుంచి మినహాయింపు కోరింది. ఈ లేఖ సారాంశంపైసుప్రీంకోర్టు సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ ఈ ప్రతిపాదన ఆమోదించలేదు. ఇదే నిర్ణయాన్ని నివేదిక రూపంలో సుప్రీంకోర్టుకు దాఖలుపరచగా దాదాపు ఆమోదించింది. అయితే సైంటిఫిక్ మ్యాపింగ్ పూర్తయ్యేదాక ఎటువంటి కొత్త లీజులు ఇవ్వరాదని షరతుపెట్టింది. ఫారెస్టుసర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం ప్రకారం ఆరావళిలోని మొత్తం 12,081 పర్వతాల్లో 1,048 పర్వతాలు మాత్రమే 100 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులోఉన్నాయి. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను బట్టి ఆరావళీ పర్వతశ్రేణుల్లో 90 శాతం మైనింగ్‌కు అనుకూల పరిధిలోకి మారతాయి. దాంతో ఆ పర్వతాలు పిండవుతాయి.బోలెడంత ఖనిస సంపద దళారుల పాలవుతుంది. ఈవిధమైన అంచనాలతో పర్వతాలలో పది శాతం మాత్రమే పర్వతాలుగా పనికివస్తాయి. గతంలో 1975-2019 వరకు జరిగిన అక్రమ మైనింగ్ వలన ఇప్పటికే 8శాతం మేరకు ఆరావళీ మైనింగ్ తరలి వెళ్లిపోయింది.దాదాపు కనుమరుగైనట్లే. తాజాగా కేంద్రం ఇచ్చిన ప్రతిపాదనలలో ఆరావళీ మరింత కుదించుకుపోతాయి.అంతేకాదు ఈ పర్వతశ్రేణుల వైశాల్యం తగ్గిపోయే కొద్దీ ఢిల్లీ, తదితర మహానగరాలకు నష్టం కలుగుతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. ఒకపక్క థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక తుఫానులు ఢిల్లీ,హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల వైపు పయనించకుండా ఆరావళీ పర్వతాలే రక్షణ గోడలుగా కాపాడుతున్నాయి. అందుకే ఢిల్లీ (ఎన్‌సిఆర్) వంటి జనాభా ఎక్కువగా ఉన్న నగరాలకు ఇసుక రేణువులు తోడైతే అక్కడ ఆప్రాంతంలో బతికే పరిస్థితి మృగ్యమవుతోంది. ఈ పర్వతాలను స్వచ్ఛమైన గాలిని అందించే ఊపిరితిత్తులుగా 'గ్రీన్ లంగ్స్'గా పిలవడం కద్దు. ఈ పర్వతాలపై ఉండే దట్టమైన అడవులు రాళ్లు, భూగర్భ జలాల పెంపుతోపాటు వరదలను ఆపగలుగుతున్నాయి. ఈ కారణం గురుగ్రామ్,ఫరీదాబాద్, దక్షిణ ఢిల్లీ, అల్వార్ జైపూర్‌లకు ఇంతదాకా వరద తాకిడి లేదు. ఆరావళీ అనగానే అరుదైన వృక్ష జంతు జాతులకునెలవు. కాగాకేంద్రం ఇటీవల తీసుకున్న నిర్ణయం పర్యావరణ సమతుల్యతను దెబ్బ తీస్తుందన్న భయాందోళనలు తలెత్తాయి. భౌగోళిక పరిస్థితులు,వాటికి ప్రయోజనాలు కలిగించే అంశాలపై అధ్యయనం చేయకుండానే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, దానిని దేశ అత్యున్నత ధర్మాసనం కాకతాళీ యంగా ఆమోదించడమూ జరిగిపోయాయి. ఆందోళనలను ఎదుర్కొనే క్రమంలో మళ్లీ ఇప్పుడు కేంద్రం నాలిక్కరుచుకుని కొత్త మైనింగ్ అనుమతులేవీ ఇవ్వరాదని నిర్ణయించింది.స్థానిక నైసర్గిక స్వరూపం, జీవవైవిధ్యత, పర్యావరణ సున్నిత త్వాన్ని దృష్టిలో ఉంచుకుని తమ తాజా ఆదేశాలను ఆరావళీలోని మరికొన్నిగుట్టలు మైనింగ్ నుంచి రక్షణ పొందడం ఆహ్వానించదగిన నిర్ణయమే!


విజయం మేధావిని వినయవంతుణ్ని చేస్తుంది. సామాన్యుడిని ఆశ్చర్యపరుస్తుంది. అవివేకిని అహంభావిగా మారుస్తుంది.

స్వామి వివేకానంద


అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.

ఆస్కార్‌వైల్డ్

# బంగ్లా వైఖరి బయటపడేది ఎన్నికల తర్వాతే!

**ప్రస్తుతం తారిఖ్ రెహ్మాన్ ఎన్నికలలో గెలవటానికి తగ్గట్టుగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తున్నది. భారత్ పట్ల ఇంతవరకూ వ్యతిరేకంగా మాట్లాడలేదు కానీ షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన నేపథ్యంలో పూర్తిగా భారత్‌తో స్నేహాన్ని అభిలషిస్తాడని చెప్పడం కష్టమే. 1971లో బంగ్లాదేశ్ విముక్తికి షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు కానీ, ఇందిరా గాంధీకి కాని 'క్రెడిట్' ఇవ్వకుండా 'జియా'కు ఇవ్వడం రాజకీయం చేసే నాయకుడు మాట్లాడే విధంగానే ఉంది. అందుచేతనే భారత్ పట్ల రహమాన్ ధోరణిలో స్పష్టత లేదు. నిప్పుల కొలిమిలా ఉన్న బంగ్లా ఎన్నికల తర్వాతనే భారత్ పట్ల స్పష్టమైన వైఖరితో బయటపడగలదు. అంతవరకూ బంగ్లాదేశ్ మనకు ప్రశ్నార్థకమే!**


రావులపాటి సీతారాం రావు

పొరుగు దేశం బంగ్లాదేశ్, పాకిస్థాన్ మాదిరే భారత్‌కు మరో తలనొప్పిగా మారే సూచనలు ప్రగాఢంగా కనిపిస్తున్నాయి. ఇప్పటి నుంచే భారత దేశ దౌత్య నిపుణులూ విదేశాంగ శాఖ నిర్వహణలో ఆరితేరిన వారు తగు జాగ్రత్త చర్యలు తీసుకొని సముచిత రీతిలో రెండు దేశాల సంబంధాలను గాడిన పడేయకపోతే అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు ఆటంకాలు ఏర్పడతాయి. బంగ్లాదేశ్ నేషలిస్టు పార్టీ (బి.యస్‌పి) ఛైర్మెన్ ఒకప్పటి ప్రధాన మంత్రి ఖలీదా జియా, కుమారుడు తారిక్ రెహ్మాన్ (18 సంవత్సరాలు లండన్‌లో అజ్ఞాత వాసంలో ఉన్న నాయకుడు) స్వదేశానికి ఈ నెల వచ్చిన సందర్భంగా తాత్కాలిక నాయకుడుగా వ్యవహరిస్తున్న మహమ్మద్ యూనస్ అట్టహాసంగా స్వాగత ఏర్పాట్లు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. ఢాకాలో అతని రాకను ప్రతిపక్షాలు హిందూ నాయకులతో సహా తీవ్రంగా వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎలాంటి ఉపద్రవాలూ, అలజడులూ జరగబోతాయో అని ఆ దేశ ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వాన్ని నడుపుతున్న యూనస్‌కు చట్టపరంగా బంగ్లాదేశ్‌కు సారథ్యం వహించటానికి ఎలాంటి హక్కూ లేదు. కొన్ని రోజుల క్రితం షరీఫ్ ఉస్మాన్‌హదీ అనే యువ నాయకుడును చంపేసిన సందర్భంగా మరోసారి దేశంలో అలజడులు చెలరేగాయి.హాదీ ప్రధాన మంత్రి షేక్ హసీనా ప్రభుత్వానికి ప్రస్తుతం పదవీచ్యుతురాలై భారత్‌లో తలదాచుకుంటున్నది) వ్యతిరేకంగా ఉద్యమం నడిపిన వాడు! ప్రస్తుతం మరింత మార్పును రాజకీయ పార్టీలకు (జమల్ ఇస్లామీ పార్టీ లాంటి వాటికి) వెసులుబాటు కల్పించే విధంగా ఉండాలని లిబరేషన్ మూమెంట్ తర్వాత ఆలోచించిన నాయకుడు దారుణంగా డిసెంబరు 12 నాడు ఒక గన్‌మన్ కాల్పులకు గురై చంపబడ్డాడు. ఈ సందర్భంగా మీడియా సంస్థలపై అల్లరిమూకలు దాడులు కూడా చేశాయి. అవామీ లీగ్ ఆఫీసులు, కల్చరల్‌సెంటర్స్, మాజీ మంత్రుల గృహాలు ఇలా చాలా ఆస్తులపై దాడులు జరిగాయి. బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం తెచ్చిన ముజిబూర్ రెహ్మాన్ ఇంటిని కాల్చి వేశారు. అంతేకాదు ఒకహిందువును (25 సంవత్సరాల యువకుడ్ని) కూడా కిరాతకంగా చంపటాన్ని, దహనం చేయటాన్ని దారుణానికి పాల్పడ్డవారు ఫిల్మ్ తీశారు. షేక్ హసీనా నిష్క్రమణ జరిగి 15 నెలలు అవుతున్నది. అయినా బంగ్లాదేశ్‌లో అల్లరిమూకల దాడులు నిరాఘాటంగా సాగుతూనే ఉన్నాయి. ఒక విధంగా హసీనా నిష్క్రమణ, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని నిర్మించుకోటానికి అవకాశాన్ని కల్పించినా అక్కడి అల్లరిమూకలు సాగన్వికుండా అలజడుల్లో మునిగితేలుతూనే ఉన్నారు. అవామీలీగ్ కార్యకర్తల మీద, హిందువుల మీద, మైనార్టీ వారి మీద ఇంకా అప్రతిహతంగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. అవామీ లీగ్ మీద, స్టూడెంట్ ఆర్గనైజేషన్స్ మీద నిషేధం విధించి జమ్మత్- ఇ- ఇస్లామ్ మీద నిషేధం ఎత్తివేయడం గమనార్హం. బియన్‌పి లీడర్ రావడంతో రాజకీయాలు బంగ్లాదేశ్‌లో ఎలాంటి మార్పు తీసుకురాబోతాయో ఊహించటం కష్టం. ఎన్నికలు నిర్వహిస్తే కొంతలో కొంత ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడిన ప్రభుత్వం సాధారణ పరిస్థితులు ఈ దేశంలో నెలకొల్పే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వంలోని ఆర్థిక సలహాదారు సలీహుద్దీన్ అహ్మద్ మాత్రం భారత్‌తో సత్సంబంధాలు ఏర్పరుచుకొనే దిశగా ఆలోచిస్తున్నామని ఢాకాలో ఈ తరుణంలో ప్రకటించడం ఆలోచించదగ్గ విషయంగానే మారింది. మహమ్మద్ యూనస్ ఆ దిశగా ప్రయత్నిస్తున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధు



లు యూనస్, భారత ప్రభుత్వ ప్రతినిధులతో ప్రత్యక్షంగా మాట్లాడారా అని అడిగితే లేదనిచెబుతూ,ఇతర స్టేక్‌హోల్డర్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. ఎంతవరకు నమ్మాలో కానీ భారత్‌తో స్నేహసంబంధాలు పునరుద్ధరించుకోవాలనే ప్రయత్నాలు చేయాలని అనుకోవటం కూడా ఆహ్వానించదగ్గ పరిణామమే. పొరుగుదేశమైన బంగ్లాదేశ్ అనిశ్చిత పరిస్థితులలో ఉండటం భారత్‌కు మంచిది కానే కాదు. బంగ్లాదేశ్, భారత్‌కు తలనొప్పిగా మారుతున్నదని ఎందుకు విశ్లేషించాల్సి వస్తున్నదంటే అమెరికా ప్రభుత్వంలోనిన్యాయ నిపుణులు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ నాయకులతో దేశంలో ఎన్నికలు ఏవిధంగా జరుపుతే బాగుంటుందన్న విషయంలో సలహాలు, సూచనలు ఇచ్చిన సందర్భంలో ఢాకాలోని ప్రభుత్వ నాయకులు షేక్‌హసీనా పార్టీ అవామీ లీక్ మీద నిషేధం ఎత్తివేశారు. 2026 ఎన్నికల్లో ఆపార్టీ పాల్గొనే ప్రసక్తే లేదని ఖండితంగా చెప్పటంతో అక్కడ రాబోయే ఎన్నికలను ఒక తంతుగా మార్చే సూచనలు బహిర్గతమవుతున్నాయి. అదే జరిగితే 1971లో ఏర్పడిన అవామీలీగ్ పార్టీ ఎన్నికల్లో పాల్గొనకుండా ఉండటం మొదటిసారి అని భావించాలి. హసీనా మీద మరణశిక్ష విధించడం కూడా బంగ్లాదేశ్ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్ నవంబరు 17 నాడు చేసింది. ఫిబ్రవరి 12, 2026 నాడు జరిగే ఎన్నికలలో దేశ బహిష్కృతులు, వలస పోయినవారు పాల్గొనే అవకాశం లేదని కూడా ప్రభుత్వ సలహాదారులు చెబుతున్నారు. ఈ సందర్భంగా హసీనా రాతపూర్వకంగా ఇచ్చిన ఇంటర్వ్యూలలో అవామీలీగ్‌ను సపోర్టు చేసే ఎవరూ ఈ జరగబోయే ఎన్నికలలో (తమ పార్టీపై నిషేధం అమలులో ఉన్న పక్షంలో) ఓటువేయరని చెప్పటం కూడా ఈఎన్నికలు ఏ విధంగా జరగబోతున్నాయనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోక తప్పదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ నాయకుడు తారిఖ్ రహమాన్ ఢాకా రాగానే బ్రహ్మాండమైన ర్యాలీనుద్దేశించి ప్రసంగించాడు. ముఖ్యంగా వాక్ స్వాతంత్రం ఉండాలని ప్రజలనుద్దేశించి చెప్పటాన్ని చాలామంది మెచ్చుకుంటున్నారు. అంతేకాకుండా బంగ్లాదేశ్ అన్ని జాతుల వారు నివసించడానికి భద్రత ఉండాలని ప్రత్యేకంగా చెప్పటం విశేషం. దేశంలో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిన అవసరాన్ని గురించి ప్రత్యేకంగా ఆయన ప్రస్తావించారు. కొండల్లో ఉండేవారు, మైదాన ప్రాంతాల్లో ఉండేవారు, ఎవరైనా ఈ దేశంలో నివాసయోగ్యులే అని చెప్పారు. అన్ని మతాల వారు హిందువులతోసహా ఉండటానికి సురక్షిత బంగ్లాదేశ్ నిర్మించుకోవాలని కూడా చెప్పారు. అయితే షేక్ హసీనాను మాత్రం బాగా ఈ ర్యాలీలో విమర్శించారు. 2024లో దేశస్వాతంత్ర్యాన్ని కాపాడుకోవటానికి ప్రజలందరూ సమాయత్తమై, 1971లో మాదిరి పోరాడారని రెండు సంఘటనలను పోల్చటంతోపాటు జనరల్ జియాకు బంగ్లాదేశ్ స్వాతంత్ర్యాన్ని మార్చి 26,1971 నాడు ప్రకటించారని ఆ ఘనత ఆయనకు ఆపాదించారు. అంతేకాదు 'ఆపరేషన్ సెర్చ్ లైట్' పేరిట స్వాతంత్ర్యయోధులను సంహరించడానికి పాకిస్థాన్ బలగాలు సిద్ధపడినప్పుడు స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, బంగ్లా స్వాతంత్ర్య సమరయోధులను కాపాడారని చెప్పారు. ఏదిఏమైనా 2026లో బంగ్లాలో జరగబోయే ఎన్నికలు ఏ ఫలితాలతో బయటకు వస్తాయో ఊహించటం ఎవరికీ సాధ్యంకాని పరిస్థితి ప్రస్తుతం ఉన్నది. షేక్‌హసీనా గెలిచిన సీటులో ఒక హిందూ నాయకుడు పోటీకి దిగుతున్నాడని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎన్నికల్లో మైనార్టీలు ముఖ్యంగా హిందూ మతస్తులు కూడా పాల్గొనటానికి సిద్ధంగా ఉండటం ప్రజాస్వామ్యానికి శుభసూచకంగా పరిగణించాలి. అయితే ప్రస్తుతం తారిఖ్ రెహ్మాన్ ఎన్నికలలో గెలవటానికి తగ్గట్టుగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తున్నది. భారత్ పట్ల ఇంతవరకూ వ్యతిరేకంగా మాట్లాడలేదు కానీ షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన నేపథ్యంలో పూర్తిగా భారత్‌తో స్నేహాన్ని అభిలషిస్తాడని చెప్పడం కష్టమే. 1971 లో బంగ్లాదేశ్ విముక్తికి షేక్ ముజిబుర్ రహ్మాన్‌కు కానీ, ఇందిరా గాంధీకి కాని 'క్రెడిట్' ఇవ్వకుండా 'జియా'కు ఇవ్వడం రాజకీయం చేసే నాయకుడు మాట్లాడే విధంగానే ఉంది. అందుచేతనే భారత్ పట్ల రహమాన్ ధోరణిలో స్పష్టత లేదు. నిప్పుల కొలిమిలా ఉన్న బంగ్లా ఎన్నికల తర్వాతనే భారత్ పట్ల స్పష్టమైన వైఖరితో బయటపడగలదు. అంతవరకూ బంగ్లాదేశ్ మనకు ప్రశ్నార్థకమే! •

# యాసంగికి సన్నద్ధమవుతున్న రైతన్న

బైరబోయిన వెంకటేశ్వర్లు

రాష్ట్రంలో యాసంగి సాగు ఉపందుకుంది. వానాకాలం పంటకు మొంథా తుఫాన్ చేసిన బీభత్సం నుండి తేరుకుంటూ యాసంగి పంటకు రైతులందరూ సన్నద్ధమవుతున్నారు. సాధారణంగా తుఫానులు జూలై, ఆగస్టు నెలలో ఎక్కువగా సంభవిస్తాయి. అప్పుడు పంటవయసు పెట్టిన పెట్టుబడి తక్కువ ఉంటుంది. కానీ ఈసంవత్సరం మొంథా తుఫాన్‌మాత్రం అక్టోబర్ నెల చివరన వచ్చి రైతు చేతికందే పంటను నేలపాలు చేసింది. రైతు ఆరు నెలల కష్టాన్ని బూడిద పాలు చేసింది. ఈ తుఫాన్ రాష్ట్రంలో దాదాపుగా ఆరులక్షల ఎకరాలకు పైగా పంట నష్టం చేసింది. అందులో వరి మూడులక్షల ఎకరాలు, పత్తి లక్షన్నర ఎకరాలు, మొక్కజొన్న, మిగతా పంటలు అన్నికలసి 50 వేలా ఎకరాల వరకు నష్టం చేసింది. ఒక వరంగల్ జిల్లాలోనే రెండు లక్షల ఎకరాలకు పైగా పంట నష్టం చేసిందని అంచనా వేశారు. వానాకాలం పంట కాలంలో యూరియా కోసం రైతులు పడ్డ తిప్పలు అందరికీ తెలిసేఉంటుంది. ఎరుపెక్కిన పంటను తిరిగి పచ్చగా మార్చి నేలలో నత్రజని శాతాన్ని పెంచడానికి కావాల్సిన యూరియా కోసం పడినపాట్లు అన్నీ ఇన్నీకావు. ఇంతటి కష్టాన్ని గట్టెకి యూరియా సంపాదించి పంటను కాపాడుకుంటే తీరా చేతికొచ్చేసరికి తుఫాన్ ప్రభావానికి లోనయ్యాయి. ఈ పంట నష్టానికి రైతులకు ప్రభుత్వాల నుండి వచ్చే పరిహారం అంతంత మాత్రమే అని చెప్పాలి. సూర్యుడు అస్తమించిన తిరిగి ఉదయించినట్టుగానే భూమినే నమ్ముకునే రైతులు సాగు చేయాడం ఆపరు. రైతులకు ప్రత్యామ్నాయం లేకనే ఎంత నష్టం జరిగిన మళ్ళీ భూమినే నమ్ముకుంటాడు. వానాకాలం పంటల సాగు వర్షాలపై ఆధారపడిన యాసంగి సాగుకు మాత్రం బోర్లు, బావులు, చెరువులు, రిజర్వాయర్ల ద్వారా వచ్చే నీటిపారకం పైన ఆధారపడుతుంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఈ సంవత్సరం సగటు సాధారణ వర్షపాతం 850 మీ.మీగా పడాల్సి ఉంటే ఇప్పటివరకు 1178 మి.మి వర్షపాతం పడింది. ఇది సాధారణం కన్నా 39శాతం ఎక్కువగా నమోదైంది. గత సంవత్సరంతో పోలిస్తే 1045మి.మి కన్నా ఎక్కువ. రాష్ట్రవ్యాప్తంగా 4జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైతే 29 జిల్లాలో అధిక వర్షపాతం నమోదైంది. ఈ అధిక వర్షపాతం వల్ల భూగర్భ జలాల నీటిమట్టంకూడా పెరిగింది. ప్రస్తుతం బావులు, చెరువులు, రిజర్వాయర్లు నీటితో కలకలలాడుతున్నాయి. అలగే రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం గత ఏడాది డిసెంబర్ చివరి నాటికి 790 టీఎంసీలు ఉంటే అది ప్రస్తుతానికి 840 టీఎంసీలుగా ఉంది. రాష్ట్రంలో సరాసరి భూగర్భ జలలా నీటి మట్టం నవంబర్ చివరి నాటికి అత్యల్పంగా నాగర్ కర్నూల్ జిల్లాలో గ్రౌండ్ లెవల్ నుండి 1.89 మీటర్ లోతులో ఉంటే అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 7.71 మీటర్ లోతులో ఉన్నాయి. రాష్ట్ర సరాసరి భూగర్భ జలాల నీటి మట్టం 4.41 మీటర్‌గా ఉంది. ఇది గతడేది నవంబరు చివరినాటికి 6.05 మీటర్‌గా ఉండేది. ఈ గణాంకలన్నీ యాసంగి సాగుకు కావాల్సిన నీటిలభ్యత పుష్కలంగా ఉంది అనే చెబుతున్నాయి. ఒకప్పుడు పత్తి ఏడాది పంటగా ఉండేది ఇప్పుడు ఆరు నెలల పంటగా మారింది. గత పది సంవత్సరాలుగా వర్షాలు పుష్టిగా పడటంతో పత్తి పంట వానాకాలానికే పరిమితమై యాసంగిలో మొక్కజొన్న పంటను వేస్తున్నారు. ఇప్పుడు యాసంగిలో వరి, మొక్కజొన్న ప్రధాన పంటలుగా సాగవుతున్నాయి. యాసంగిలో సాధారణ సాగు భూమి 68.67 లక్షలుగా అంచనా వేస్తే డిసెంబరు ముడోవారానికి 8.20 ఎకరాలలో పంట సాగు మొదలైంది. వరి పంట 51 లక్షల ఎకరాలకు గాను లక్ష ఎకరాలు, మొక్కజొన్న ఆరున్నర లక్షల ఎకరాలకు గాను నాలుగులక్షల ఎకరాలలో సాగు మొదలైంది. లక్షన్నర ఎకరాలు శనగ సాగు ఐతే మిగిలినవి పప్పుధాన్యాలు సాగు అవుతున్నాయి.ఇప్పటివరకు 26 జిల్లాలో 25 శాతం లోపు 6 జిల్లాలో 25 శాతం పైగా సాగు జరుగుతుంది. పంట చేతికందే వరకు రైతు ముందున్నవి ప్రకృతి విపత్తులు ఒక సమస్య ఐతే మానవ విపత్తులు మరో సమస్య. యాసంగి పంట చేతికొచ్చే వేసవికాలంలోనే ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వానలు కురుస్తాయి. ఇవి వరి మొక్కజొన్న పంటలతో పాటు మామిడి తోటలకు తీవ్ర నష్టం చేస్తాయి.స్వార్థం లేని పుడమి పంటనివ్వడానికి సిద్ధంగా ఉన్న ధన దాహానికి మానవ స్వార్థపూరితమైన ఆలోచనలు రైతులకు ఎక్కువ నష్టం చేస్తున్నాయి. పంట ప్రారంభంలోనే నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువుల సమస్య ఒక వైపు ఐతే దిగుబడి అయిన పంటకు గిట్టుబాటు ధర లేక దళారుల మధ్య మోసపోవడం మరోసమస్య.ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం క్రింద రైతు భరోసా అందిస్తున్న, ప్రధానంగా నకిలీ విత్తనాల తయారీని నిర్మూలిస్తు యాసంగిపంటకు కావాల్సిన ఎరువులు,యూరియా,విద్యుత్‌ను అందుబాటులో ఉంచడంపై దృష్టిపెట్టాలి.అలాగే వానాకాలంలాగా యూరియా కొరత లేకుండా చూస్తూ అవసరానికి కావాల్సిన యూరియా సరఫరాచేస్తూ పరిమితికి మించి వాడితే భూమిలో ఆమ్లశాతం పెరుగుతుందని, దాని పర్యవసానాల పైఅలాగే పంటకు తగ్గట్టుగా నేలలోపోషకాలు వృద్ధిపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంఉంది. •

# గ్రామీణాభివృద్ధికి అడుగులు పడేనా?

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల కొలువుదీరిన 12,702 మంది సర్పంచులు, 1,11,803 మంది వార్డు సభ్యులు గ్రామ పాలనలో కీలక బాధ్యతలు చేపట్టారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామ పంచాయతీ అనేది పునాదివంటిది. గ్రామ పంచాయతీ బలంగా ఉంటేనే రాష్ట్రం అభివృద్ధిబాటలో నడు స్తుంది.అలాంటి గ్రామ పంచాయతీలకు నాయకత్వం వహించే సర్పంచుల పాత్ర అత్యంత కీలకం. అయితేగ్రామాభివృద్ధి అనేది మాటల్లో కాకుండా కార్యరూపంలోకి రావాలంటే సర్పంచులు అనేక సవాళ్లను ఎదుర్కొని, అవగాహనతో, నిబద్ధతతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.గ్రామ సర్పంచుల ముందు నిలిచే మొదటి పెద్ద సవాలు అభివృద్ధి పట్ల సరైన అవగాహన లేకపోవడం. చాలా మంది సర్పంచులు ప్రజాభిమానంతో ఎన్నికైనా, పాలనా విధానాలు, ప్రభుత్వ పథకాలు, నిధుల వినియోగం,చట్టపరమైన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన లేకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా గ్రామానికి రావాల్సిన నిధులను సద్వినియోగం చేయలేకపోవడం, లేదా పథకాలను పూర్తిగా అమలు చేయలేకపోవడం జరుగుతోంది. కాబట్టి గ్రామాభివృద్ధి కోసం ముందు సర్పంచులే శిక్షణపొందాల్సిన అవసరంఉంది. నిధుల కొరత మరో ప్రధాన సమస్య. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు వస్తున్నా అవి చాలవు. రోడ్లు,తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, పాఠశాలలు, ఆరోగ్య సదుపాయాలు వంటి అనేక అవసరాలకు ఒకేసారి నిధులు అవసరం అవుతాయి. కానీ పరిమిత నిధులతో అన్ని పనులు చేయడం సర్పంచులకు పెద్ద సవాలుగా మారుతోంది. అంతేకాకుండా, కొన్నిసార్లు నిధులు ఆలస్యంగా రావడం వల్ల అభివృద్ధి పనులు నిలిచిపోతున్నాయి. నిధులు వచ్చినా వాటి సరైన వినియోగం కూడా ఒక పెద్దసమస్యే.సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం, అధికారులపై ఆధారపడాల్సిరావడం వల్ల కొన్ని చోట్ల అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి.ఇది గ్రామాభివృద్ధికి పెద్దఅడ్డంకిగా మారుతోంది. సర్పంచులు నిజాయితీగా ఉన్నా,వ్యవస్థలోని లోపాలవల్ల ప్రజల్లో వారి మీదనమ్మకం తగ్గేపరిస్థితి ఏర్పడుతోంది.గ్రామాభివృద్ధి




లో మరోసవాలు ప్రజల భాగస్వామ్యం లేకపోవడం. అభివృద్ధిఅనేది కేవలం సర్పంచి బాధ్యత మాత్రమే కాదు.గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలి. కానీ చాలా గ్రామాల్లో ప్రజలు సమావేశాలకు రాకపోవడం, గ్రామసభలను పట్టించుకోకపోవడం కనిపిస్తోంది. ఫలితంగా సర్పంచులు తీసుకునే నిర్ణయాలకు పూర్తిమద్దతు లభించడంలేదు. ప్రజల సహకారం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు.రాజకీయ జోక్యం కూడా సర్పంచుల పనితీరును ప్రభావితం చేసే అంశం. గ్రామస్థాయిలోనే వర్గపోరులు, రాజకీయ విభేదాలు సర్పంచుల ముందున్న పెద్ద సమస్య. అభివృద్ధి పనులను రాజకీయ కోణంలో చూసి అడ్డుకోవడం, వ్యక్తిగత లాభనష్టాల కోసం పనులను నిలిపివేయడం జరుగుతోంది. దీనివల్ల గ్రామానికి మేలు చేసే పనులు కూడా ఆలస్యమవుతున్నాయి. ఇక అధికారులతో సమన్వయం లోపించడం కూడా ఒక సవాలే. గ్రామ పంచాయతీకి సంబంధించిన పనుల్లో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్లు, ఇతర శాఖల అధికారులు కీలక పాత్ర పోషిస్తారు. వీరితో సమన్వయం సరిగా లేకపోతే పనులు ముందుకు సాగవు. కొన్నిసార్లు అధికారుల నిర్లక్ష్యం, ఆలస్యంవల్ల సర్పంచులు ప్రజల విమర్శలకు గురవుతున్నారు. అయితే ఈ సవాళ్ల మధ్య సర్పంచులు చేయాల్సిన బాధ్యతలు మరింత పెరుగుతున్నాయి.కేవలంప్రభుత్వ నిధులపై ఆధారపడకుండా స్థానికంగా నిధులు సృష్టించుకోవడం నేటి అవసరం. గ్రామపంచాయతీ పరిధిలోని మార్కెట్లు,వారపుసంతలు,దుకాణాలు, ప్రకటనల ద్వారా ఆదాయం పెంచుకోవచ్చు. ఆస్తిపన్ను, నీటి పన్నువంటి వాటిని సమర్థవంతంగా వసూలు చేయడంద్వారా కూడా గ్రామానికి ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ విషయంలో సర్పంచులు ధైర్యంగా, పారదర్శకంగా వ్యవహరించాలి.అలాగే సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కూడా ఎంతో అవసరం. డిజిటల్ పాలన, ఆన్‌లైన్ దరఖాస్తులు, పారదర్శక లెక్కల నిర్వహణ ద్వారా గ్రామపాలన మరింత సమర్థవంతంగా మారుతుంది. యువతను గ్రామాభివృద్ధిలో భాగస్వాములుగా చేయడం ద్వారా కొత్త ఆలోచనలు, కొత్తమార్గాలు ముందుకువస్తాయి. మొత్తంగా చూస్తే, తెలంగాణ గ్రామ సర్పంచుల ముందు ఉన్న సవాళ్లు అనేకమైనా, అవి అధిగమించలేనివి కావు. సరైన అవగాహన, నిజాయితీ, ప్రజల భాగస్వామ్యం, అధికారులతో సమన్వయం,స్థానిక నిధుల సృష్టివంటి అంశాలపై దృష్టి సారిస్తే గ్రామాభివృద్ధిసాధ్యమే. గ్రామం అభివృద్ధిచెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. ఆ అభివృద్ధికి పునాది వేయాల్సిన బాధ్యత గ్రామ సర్పంచులదే. •

# ప్రజావాక్కు



## వార్తా పత్రికలను చదవాలి

**చరవాణి** చేతులలోకి విస్తృతంగా వచ్చి చేరిన తరువాత చాలామంది పిల్లలు,పెద్దలు వాటిఉచ్చులో పడి పుస్తకాలను, వార్తా పత్రికలను చదవడం తగ్గించారని అనాలో లేక మానేశారని అనాలో. ఇప్పటి విద్యార్థులు ముఖ్యంగా టెక్నికల్ కోర్సులు చదివేవారికి దేశ కాల,మాన పరిస్థితులు తెలుసుకోవాలనే జిజ్ఞాస కూడాలేదు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంఅన్ని గవర్నమెంట్ స్కూళ్లలో ప్రతిరోజూ విద్యార్థులచే వార్తా పత్రికలలో వచ్చిన ముఖ్యమైనవి చదివి తీరాలనే నిర్ణయం కొన్ని రోజుల క్రితం తీసుకున్నది. మన తెలుగు రాష్ట్రాలలో కూడా ఈ నిర్ణయాన్ని అమలు పరచాలి. ఇంజినీరింగ్ క్యాంపస్ ఇంటర్వ్యూలలో వారి సబ్జట్ మీద పూర్తి అవగాహన ఉన్నా జనరల్ నాలెడ్జ్ దాదాపు సున్నా. చరవాణిలో చదవడం కంటి, ఒంటి ఆరోగ్యానికి మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## సర్దుబాటు ముఖ్యం

**బంగ్లా** సంక్షోభం తారా స్థాయికి చేరింది. దానికి ప్రధాన కారణం యూనిస్‌అంటే అతిశయోక్తికాదేమో.శాంతి దూత కష్ట కాలంలో దేశాన్ని నడపడంలో విఫలం అయ్యారు. చైనా, పాకిస్థాన్ చెంతన చేరి బలమైన మూలాలు కలిగిన భారత్‌తో బంధాలు ఇరుకున పెట్టుకున్నారు.4096 కిలో మీటర్ల సరిహద్దుకలిగిన మనదేశంతో చారిత్రక జాతీయవాదాస్నేహం కలిగిఉన్న ఆ దేశంపాకిస్థాన్ నుండి విముక్తి పొందడంలో భారత్ చేసిన సహాయాన్ని కూడా మరిచినట్టు ఉంది. అస్సాం, బెంగాల్ లాంటి రాష్ట్రాలలో మళ్ళీ వలసలు పెరిగే అవకాశం ఉంది. భారత్ కూడా బంగ్లాలో ఎవరు అధికారంలో ఉన్నవాళ్లతో సర్దుబాటు చేసుకోవాలి.

- భారత అవినాష్, జనగామ

## వికలాంగులకు న్యాయం చేయాలి

**వికలాంగులు** కష్టపడి సంపాదించిన డబ్బులు పొదుపు చేసుకుంటే అవసరానికి అప్పుతీసుకొన్నవారు, సకలాంగులు తిరిగిఇవ్వాడంలో చాలా ఇబ్బందులు పెడుతున్నారు. వికలాంగుల నుండి అప్పులు తీసుకొన్నవారు కూడా అడిగితేదాడులు,దౌర్జన్యాలు చేస్తున్నారు.వికలాంగులు చాలా కష్టపడి సంపాదించిన డబ్బులు అప్పుగా తీసుకున్నవారు తిరిగి ఇవ్వడంలో వివక్షత చూపుతున్నారు.

-రాపాక రవీందర్, జనగాం

## రైల్వేలు ప్రజాసేవా వ్యవస్థలు

**భారతీయ** రైల్వేలు ఒకప్పుడు సామాన్యుడి జీవనరేఖగా వెలుగొందాయి. కానీ ప్రస్తుత పరిణామాలు ఆ ప్రజాస్వామ్య స్వరూపాన్ని మసకబారుస్తున్నాయి.గత జూలైనుంచి రాబోయే మార్చి వరకు విడతల వారీగా పెంచిన చార్జీల వల్ల ప్రయాణికులపై దాదాపు రూ.1,300కోట్ల అదనపు భారం పడనుంది. ప్రభుత్వానికి ఇది ఆదాయ వనరుగా కనిపించినా, సామాన్యుడి జేబుకు ఇది పెద్ద చిల్లు. ఆధునికీకరణ పేరుతో సాధారణ రైళ్లను తగ్గించి, ఖరీదైన వేగవంతమైన రైళ్లను పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు ప్రయాణం భారంగా మారుతోంది. చార్జీలు పెరుగుతున్నా రైళ్ల జాప్యం, శుభ్రతలోపం, రద్దీ వంటి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. దీనికి తోడు రైల్వే సేవల్లో ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం వల్ల నిర్వహణ వ్యయం పెరిగి, ఆభారం చివరకు ప్రయాణికులపైనే పడుతోంది.రైల్వేలు కేవలం లాభనష్టాల కోసం నడిచే వాణిజ్య సంస్థలు కావు, అవి ప్రజాసేవా వ్యవస్థలు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## పరిశ్రమ విద్యాసంస్థల అనుసంధానం

**ప్రస్తుతం** ఉన్న డిగ్రీ, పీజీ సిలబస్‌లో కాలానికి అనుగుణమైన మార్పులు అత్యవసరమయ్యాయి. ఉద్యోగమార్కెట్ పెద్దఎత్తున మారిపోయింది. పరిశ్రమలు నైపుణ్యాలు, ప్రాక్టికల్ పరిజ్ఞానం, సమస్య పరిష్కార సామర్థ్యాన్ని కోరుతున్నాయి. కానీ మన సిలబస్‌లో ఇంకా పాతసిద్ధాంతాలు, కాలంచెల్లిన మాడ్యూల్స్, ప్రయోగాత్మక శిక్షణకు తక్కువ అవకాశాలు ఉన్నాయి. విద్యార్థి పుస్తక జ్ఞానంతో బయటకు వస్తున్నాడు.కానీపరిశ్రమ అవసరాలకు సిద్ధంగా ఉండటంలేదు.ఫలితంగా చదువుకున్న నిరుద్యోగం పెరుగుతోంది.ప్రభుత్వంముందుగా పరిశ్రమ-విద్యాసంస్థల అనుసంధాన విధానాన్ని బలోపేతం చేయాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

## సీట్ల కొరత

భారత దేశంలో డిమాండ్ ఉన్న కోర్సులు చదువుకునేందుకు సీట్ల కొరత అలాగే చదివిన చదువులకు ఉద్యోగాల కొరత ఉంది. ఎంబీబీఎస్ , ఇంజనీరింగ్ , ఎంబీఏ, తదితర ఉన్నత చదువులు విదేశాల్లో చదవలసిన పరిస్థితి ఉంది. డిమాండ్ ఉన్న కోర్సుల సీట్‌లను భారత్‌లో పెంచితే విదేశాలకు వెళ్లే అవకాశం ఉండదు. చదివిన చదువులకు తగ్గట్టుగా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-డి చాంద్ బాషా, కర్నూలు

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

## నిషేధిత మత్తు పదార్థాలతో బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దు : ఎస్సై గంధం మహాలక్ష్ముడు

ఎ కొండూరు, డిశంబర్ 28, ప్రభాతవార్త : నిషేధిత గుట్కా గంజాయి ఇంకా ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని దానివల్ల పచ్చని సంసారాలు పాడైపోతాయని నిషేధిత గంజాయి యింకా ఇతర మత్తు పదార్థాల జోలికి వెళితే చట్టప్రకారం శిక్షార్హులు అవుతారని ఈ నిషేధిత మత్తు పదార్థాలపై పోలీస్ శాఖకు సమాచారం అందించి సహకరించి ఆరోగ్యాంధ్రప్రదేశ్ కృషి చేయాలని మేకల రామారావు (జాన్) కోరారు. ఇంకా ఈ



మత్తు పదార్థాలకు అలవాటు పడి పోలీసులకు చిక్కితే చట్టప్రకారం పిడి యాక్ట్ కింద నమోదు చేసి జైలుకు పంపుతామని ఎన్టిఆర్ జిల్లా ఎ కొండూరు ఎస్సై గంధం మహాలక్ష్ముడు చీమలపాడు అప్పసాని బాబూరావు పాఠశాల/ వసతి గృహంలో ఆదివారం సిఎస్ఐ సంఘం ఆధ్వర్యంలో జరిగిన మద్యపానం ధూమపానం అవగాహన సదస్సులో ఎస్సై మహాలక్ష్ముడు చీఫ్‌గెస్ట్‌గా పాల్గొని మాట్లాడుతూ హెచ్చరించారు. ఇంకా ఈ సదస్సులో మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు మేకల రామారావు (జాన్ పాల్గొని మాట్లాడుతూ చట్టానికి ఎవరూ చుట్టం కాదని, చట్ట పరిధిలో పోలీస్‌శాఖ తన వంతు పని చేస్తుందని మద్యపానం ధూమపానం నిషేధిత సదస్సులో ఎన్టిఆర్ జిల్లా కౌలు రైతుల సంఘం ఉపాధ్యక్షుడు మేకల డేవిడ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పానెం ఆనందరావు, కొచ్చెర్ల విజయరావు, పంబా వెంకటరత్నం, జాషువారత్నం, డాలు వాసు, దయాశీల, పి.చినవెంకయ్య, సర్వే సోములు, నరేంద్ర స్టాలిన్ తదితరులు మాట్లాడారు. కొర్లపాటి రవీంద్ర సదస్సుకు హాజరైన ప్రజలు యువత మహిళలను ప్రత్యేకంగా అభినందిస్తూ ముగించారు. సిఎస్ఐ సంఘ పెద్దలు ఎస్ఐ మహాలక్ష్ముడును శాలువతో సత్కరించారు. రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# విజయవాడ వార్త

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విజయవాడ కార్పొరేషన్, డిసెంబర్ 27, ప్రభాతవార్త: సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఈ సోమవారం కూడా కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతో పాటు జోనల్ కార్యాలయాల్లో కూడ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన సమస్యలన్నీ ప్రజలు తమ దగ్గర లోని కార్యాలయంలో సంప్రదించ వచ్చని ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని అధికారులందరూ జోనల్ కార్యాలయాలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడ అందుబాటులో ఉంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.




## నేడుప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతుల స్వీకరణ



విజయవాడ, డిసెంబర్ 28, ప్రభాతవార్త : డిసెంబర్ 29వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను 'మీకోసం.ఏపీ.జీవోవి.ఇన్' వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చని నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

## 2026 క్యాలెండర్ ఆవిష్కరణలో రాష్ట్ర బీసీ ఓబీసీ ఉద్యోగులందరూ పాల్గొనండి

విజయవాడ, డిసెంబర్ 28, ప్రభాతవార్త : ఆల్ ఏపీ బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో స్థానిక కమర్షియల్ టాక్స్



యూనియన్ కార్యాలయములో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల వీర బ్రహ్మం అధ్యక్షతన గౌరవాధ్యక్షులు బత్తుల అప్పారావు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వరరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ పక్కిభూషణరావు, రాష్ట్ర కోశాధికారి వై.శంకర రావు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు హేమలత అలాగే వివిధ జిల్లాల నుంచి వివిధ సంఘాల ప్రముఖ నాయకులు హాజరయ్యారని, 2026 జనవరి 4 ఆదివారం ఉదయం 10 గంటల నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికగా 8 మంది బీసీ మంత్రులు చేతుల మీదుగా 2026 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరుగుతుందని అటెండర్ స్థాయి నుంచి డిపార్టుమెంట్ హెడ్‌ల వరకు హాజరై జయప్రదం చేయవలసినదిగా కోరడం జరిగినది.

## మస్జీద్‌లు ఆధ్యాత్మిక ధార్మిక కేంద్రాలుగా పరిఢవిల్లాలి : ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

ఎ కొండూరు, డిశంబర్ 28, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం వీరులపాడు జుజ్జూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గౌసియా జామియా మస్జీద్‌ను నందిగామ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ముఖ్య అతిధిగా పాల్గొని ఆదివారం ఘనంగా అట్టహాసంగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ భారతదేశ సమైక్యతకు సమగ్రతకు సెక్యులరిజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని భారతదేశం భిన్న సంస్కృతి సాంప్రదాయాలకు నెలవని మతసామరస్యమే మన దేశానికి ఐక్యతకు బలమని, అన్ని మతాలు మానవతా విలువలకు శాంతి సోదరభావాన్ని బోధిస్తున్నాయని ప్రతి ఒక్కరు అన్నదమ్ముల్లా మెలగాలని సామాజిక ఐక్యతతో గ్రామాభివృద్ధికి పాటుపడే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం చీమలపాడు




అలుపెరగని అన్నదాత నకీబుల్ ఔలియా, సూఫీ ఆధ్యాత్మిక శిఖరం ముహమ్మద్ అతావుల్లా ఆధ్యాత్మిక వారసుడు ఎఎంటికె దర్బార్ బాబె ఎ బాగ్దాద్ పీఠాధిపతి మొహమ్మద్ ఖాజా మొహియుద్దీన్ షాతాజ్ ఖాదరీ బాబాను ముస్లీం సోదరులు సాదరంగా ఆహ్వానించి మత సాంప్రదాయం ప్రకారం సత్కరించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఖాజా బాబా మాట్లాడుతూ మస్జీద్‌లు చర్చిలు దేవాలయాలు ఆధ్యాత్మిక ధార్మిక కేంద్రాలుగా పనిచేయాలని తద్వారానే ఆయా వర్గాల ప్రజలకు ఆధ్యాత్మిక దైవ చింతన మనశాంతి కలుగుతుందని ఖాజా బాబా పేర్కొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మత పెద్దలు గ్రామ పెద్దలు టిడిపి ఎన్‌డిఎ కూటమి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సృష్టి ఆవిర్భావ తొలి దైవం విశ్వకర్మ

అమరావతి, డిసెంబర్ 28, ప్రభాతవార్త : శ్రీ ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం, శ్రీ వీరబ్రహ్మేంద్ర దేశీయ విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ (ఎస్వీబీడీవీబీ) విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో గుంటూరు అరండల్ పేటలోని శ్రీ విరాట్ విశ్వకర్మ సామాజిక ప్రాంగణంలో ఆదివారం ఉదయం నిర్వహించిన "విశ్వకర్మ వేదవిజ్ఞానము" గ్రంథావిష్కరణ సభకు ఆంధ్ర రాష్ట్ర దేశీయ విశ్వబ్రాహ్మణ సమాజం అధ్యక్షులు జంపని రాధాకృష్ణమూర్తి అధ్యక్షత వహించగా, విశిష్ట అతిథిగా వీవీఐటీ ప్రొఫెసర్ ఆచార్య తియ్యబిండి కామేశ్వరరావు పాల్గొని గ్రంథ ఆవిష్కరణ చేసారు. అనంతరం వీరితో పాటు సభకు విచ్చేసిన వక్తలుప్రొఫెసర్ మురుగుడు శ్రీ హరి, డాక్టర్ నాగార్జున కొండ సుందరాచారి'లు మాట్లాడుతూ వేదాధ్యయనం వలన హృదయ నిర్మల్యం ఏర్పడుతుందని, విశ్వకర్మ విశ్వతోముఖుడని అన్నారు. ఆ క్రమంలో గ్రంథ సంకలన కర్త మరియు సమర్పకులు కొండపి వేంకట గణేష్ బాబును అభినందించగా, ఆ క్రమంలో ఆయన మాట్లాడుతూతన తండ్రి గారైన కీర్తికాయులు బ్రహ్మశ్రీ డాక్టర్ కొండపి నాగేశ్వరరావు స్థాపించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర దేశీయ విశ్వబ్రాహ్మణ అసోసియేషన్ విశాఖపట్నం 40వ (రూబీ) వార్షికోత్సవం సందర్భంగా ఈ ఆవిష్కరణ జరిపినట్టు చెప్పారు.

## వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం

విజయవాడ, డిశంబర్ 28, ప్రభాతవార్త : వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10 గంటల నుంచి



మధ్యాహ్నం 2గంటల వరకు జరిగింది. పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ముజ్తబా ఫారూఖ్, పార్టీ ఇన్చార్జ్ హబీబుల్లాఖాన్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఈ సమావేశం ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ సమస్యలతో పాటు పార్టీ అంతర్గత సమస్యలను చర్చించి ఆమోదించిన తీర్మానాలలో డిసెంబర్ 25 క్రిస్టమస్ సందర్భంగా ఫ్యాసిస్ట్ శక్తులు దేశవ్యాప్తంగా చర్చిలపై దాడులు చేసి క్రైస్తవ సోదరులకు వారి ప్రార్థనలకు అంతరాయం కలిగించే దుశ్చర్యలను ఏకగ్రీవంగా ఖండించింది. ఆరావళి పర్వతాలను రక్షించ ఏకోవడానికి కదిలిన పదిలక్షల పౌర సమాజానికి రైతులకు పర్యావరణ పరిరక్షకులకు సమావేశం జేజేలు పలికింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై భారత దేశంలో మైనారిటీపై ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనైనా మైనారిటీలపై జరిగే దాడులు మానవ హక్కులకు వ్యతిరేకమని తక్షణమే ప్రభుత్వాలు వీటిపై స్పందించి మైనారిటీల సాంస్కృతిక మతపర భాషాపర హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేసింది.


## వేడుకలు ఆమోదయోగ్యం - ఆహ్లాదకరంగా ఆరోగ్యంగా హానిరహితంగా ఉండాలి

నగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్. వి రాజశేఖర్ బాబు, ఐ.పి.ఎస్.

విజయవాడ, డిసెంబర్ 28, ప్రభాతవార్త : ఎన్.టి.ఆర్.జిల్లా నగర ప్రజలకు , పోలీస్ సిబ్బంది మరియు అధికారులకు ఎన్.టి.ఆర్. జిల్లా పోలీసు కమిషనర్ శ్రీ ఎస్. వి రాజశేఖర్ బాబు , ఐ. పి. ఎస్. గారి 2026 సంవత్సర నూతన సంవత్సర శుభాకాంక్షలు.ఈ నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ డిసెంబర్ 31వ తేది రాత్రి నిర్వహ్నించుకొనే వేడుకలకు ప్రజల భద్రతను దృష్టిలో వుంచుకొని ఆంక్షలు తప్పని సరి చేయటమైనది. కావున ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి పోలీసులకు సహకరిస్తూ, పోలీసు కఠిన చర్యలు నుంచి దూరంగా వుండాలని విజయవాడ నగర పోలీస్ కమీషనర్ శ్రీ ఎస్. వి రాజశేఖర్ బాబు, ఐ. పి. ఎస్ గారు విజయవాడ ప్రజలకు విజ్ఞప్తి చేయట మైనది. నగర ప్రజలకు సూచనలు: అర్ధరాత్రి రోడ్డుమీద వేడుకలకు అనుమతులు లేదు. వాహనములు నడుపు వ్యక్తి అతి వేఘంగా, అజాగ్రత్తగా వాహనము నడప రాదు.ట్రిపుల్ రైడింగ్ చేసి వాహనము నడుప రాదు.మద్యం సేవించి వాహనములు నడప రాదు. ప్రధాన రహదారులు అయిన బందర్ రోడ్డు, ఏలూరు రోడ్డు, బి.ఆర్.టి. ఎస్. రోడ్ల పై పూర్తిగా ట్రాఫిక్ ఆంక్షలు విధించ బడును. అదే విధంగా బెంజ్ సర్కిల్ ఫ్లైఓవర్లు (కొత్త, పాత) , కనక దుర్గా ఫ్లైఓవర్ ల పై ట్రాఫిక్ అనుమతించ బడదు.గ్రూపులు గుంపులుగా చేరి నడి రోడ్డు పై కేకులు కోసి అల్లర్లు చేయరాదు.డిసెంబర్ 31వ తేది రాత్రివేళ కేకలు వేస్తూ వాహనములపై తిరుగ రాదు.హద్దుమీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవు.డిసెంబర్ 31వ తేది రాత్రివేళ నగరంలో గస్తీ ముమ్మరంగా వుంటుంది.ప్రత్యేక హెచ్చరిక: మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి.మద్యం సేవించి వాహనములు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోన బడును.ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్ తీసివేసి అధిక శబ్దాలతో హోరెత్తించడం, అతి వేగంతో రోడ్ల పై తిరగటం, వాహనములు నడుపుతూ విన్యాసాలు ప్రదర్శించడం, బాణాసంచా పేల్చడం వంటి వాటివలన ప్రశాంతతకు భంగం కలిగి వృద్దులకు, చిన్న పిల్లలకు , రోగులకు ఇబ్బంది కలుగుతుంది. కావున ఇలాంటి వాటికీ పాల్పడితే తగిన చర్యలు తీసుకోన బడును. పై సూచనలను పాటించి నూతన సంవత్సర వేడుకలను ఆహ్లాదకర వాతావరణం లో జాగ్రత్తగా రోడ్డు ప్రమాదములకులోను కాకుండా, ఇతరులను ఇబ్బందులకు మరియు ప్రమాదాలకు గురిచేయకుండా జరుపుకోవాలని పోలీసు వారి విజ్ఞప్తి.

## ముత్యాలంపాడు ఆంధ్రా షిర్డీ సాయిబాబా 2026 కేలండర్ ఆవిష్కరణ

విజయవాడ, డిసెంబర్ 28, ప్రభాతవార్త : ముత్యాలంపాడులో కొలువైన ఆంధ్రా షిర్డీగా పేరొందిన



షిర్డీ సాయిబాబా ఆలయంలోఆదివారం ఉదయం 10.30లకు మందిర గౌరవాధ్యక్షులు పూనూరు గౌతమ్ రెడ్డి చేతుల మీదుగా మందిర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొని 2026 నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరణ నిర్వహించారు.

## ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం కొత్త కమిటీ ఎన్నిక

విజయవాడ, డిశంబర్ 28, ప్రభాతవార్త : జగ్గయ్యపేట టీచర్స్ కోఆపరేటివ్ సొసైటీ బిల్డింగులో గోర్బాయ్ సేవా సంఘం జగ్గయ్యపేట నియోజకవర్గ కొత్త కమిటీ ఎంపికలో అధ్యక్షులుగా లాహోరీ బద్దునాయక్, ఉపాధ్యక్షులుగా కృష్ణ నాయక్, బ్రహ్మం నాయక్



కార్యదర్శిగా, భూక్య బధ్యానాయక్ కోశాధికారిగా మోహన్ దారియ నాయక్ సంయుక్త సంచాలకులుగా రాము నాయక్, ఐటిఐ బాలాజీ నాయక్‌లను సంఘం కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బాణావత్ శ్రీనివాస్ నాయక్ మరియు యన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు జటావత్ బాలాజీ నాయక్ ఉపాధ్యక్షులు లాహోరీ ప్రేమ్నాథ నాయక్ వారి ఆధ్వర్యంలో కొత్త బాడీని ఎన్నుకోవడం జరిగినది. హాజరైన సుమారు 100 మంది గోర్ భాయ్ సేవా సంఘం సభ్యులు నూతనంగా ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే కాలంలో సంఘం తరఫున మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని హాజరైన సభ్యులందరూ ఆకాంక్షించారు.

## ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలి

-మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు

పొన్నూరు, డిసెంబర్ 28,ప్రభాతవార్త: ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళరమేష్‌బాబు కోరారు. కమిషనర్ ఆదివారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ఆరవ వార్డుకు చెందిన ప్రజలు కొంత మంది పిచ్చిమొక్కలతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో, అందుకు స్పందించిన కమిషనర్ జెసిబి సహాయంతో పిచ్చిమొక్కలను తొలగించే విధంగా కింది స్థాయి సిబ్బందికి ఆదేశాలిచ్చారు. తక్షణమే జెసిబి సహాయంతో మొక్కల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుంది. స్పందించిన కమిషనర్ ముప్పాళ్ళకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ వేడుకలు

విజయవాడ, డిశంబర్ 28, ప్రభాతవార్త : అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి దిశానిర్దేశంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ 140వ ఆవిర్భావ వేడుకలు, విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వించిపేట, పంజా



సెంటర్‌లో నియోజకవర్గం కోఆర్డినేటర్ షేక్ బాజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నేతలు పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎపిసిసి ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ, వి గుర్నాథం, ప్రధాన కార్యదర్శి బైపూడి నాగేశ్వరరావు, సిటీ ఉపాధ్యక్షుడు షేక్ అన్సారీ, సిటీ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు రాచమల్లు ప్రకాష్, సిటీ కాంగ్రెస్ కార్యదర్శి పి సత్యనారాయణ 54 డివిజన్ అధ్యక్షుడు మొహమ్మద్ గాలీబ్, 50 డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ రియాజ్, 39 డివిజన్ అధ్యక్షుడు జెడా కొండా, 55 డివిజన్ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ భాషా, 34 డివిజన్ అధ్యక్షుడు అజ్మతుల్లా షరీఫ్, నియోజకవర్గ మైనారిటీ నాయకుడు సయ్యద్ అమీర్, బ్లాక్ 2 అధ్యక్షుడు షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరశెట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర సంగ్రామంలో కీలక పాత్ర పోషించటమే కాదు, స్వాతంత్రానంతరం దేశ నిర్మాణంలో బృహత్తరమైన భూమిక నిర్వహించింది న్నారు.ఈ రోజు ఆధునిక భారతదేశంలో ఆర్థిక అభివృద్ధికి అనేక ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఆదివారం ఎన్‌డిఎ ప్రభుత్వం కాంగ్రెస్ పథకాలకు పేర్లు మార్చి తామే అభివృద్ధి చేశామని ప్రచారం చేసుకుంటున్నారన్నారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ షేక్ బాజీ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఈ దేశాభివృద్ధికి ఏం చేసిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని, ప్రజలకు తెలుసన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గాంధీ, నెహ్రూలపై అసత్యాలు ప్రచారం చేస్తూ, ఆర్ఎస్ఎస్ భావజాలంతో మృతి వైషమ్యాలు రెచ్చగొడుతూ, దేశంలో అల్లకల్లోలాలు సృష్టిస్తున్నారన్నారు. ఎన్డీఎను గద్దె దించే వరకు కాంగ్రెస్ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. అనంతరం 54వ డివిజన్‌లో అధ్యక్షుడు రియాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని నరహరశెట్టి, హాజరైన నాయకులు ఆవిష్కరించారు. పార్టీకి సుదీర్ఘ కాలం సేవలందిస్తున్న సీనియర్ నేతలు నరహర శెట్టి, గుర్నాథం, అన్సారీ, కొలను కొండ శివాజీ లను ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ షేక్ బాజీ, డివిజన్ అధ్యక్షులు గాలీబ్, రియాజ్, ఖాదర్ భాషా, అజ్మతుల్లా షరీఫ్‌లు దుశ్శాలువలతో సత్కరించారు.

## నారాకోడూరులో ఓ వ్యక్తి దారుణ హత్య

-సంఘటనా స్థలాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

చేబ్రోలు(పొన్నూరు), డిసెంబర్ 28,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని నారాకోడూరు గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటన. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నారాకోడూరు గ్రామానికి చెందిన నత్తల మృత్యుంజయరావు(40)ని గుర్తు తెలియని వ్యక్తులు నారాకోడూరు నుండి తెనాలి వెళ్ళే వాటర్ ప్లాంట్ సమీపంలో కత్తులతో పొడిచి హత్య చేశారు. కత్తి పోట్లకు గురైన మృత్యుంజయరావు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులున్నారు. హత్య సంఘటనతో నారాకోడూరు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. హత్య కేసును అన్ని కోణాల్లో విచారణ చేసి, వేగవంతంగా కేసును చేధించాలని కిందిస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ వెంట తెనాలి డిఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్ ఎస్సై కృష్ణయ్య, ఎస్సైలు ఈశ్వరరావు, వీరనారాయణ ఉన్నారు.

## యేసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ వేడుకలు

విజయవాడ, డిశంబర్ 28, ప్రభాతవార్త : విశ్వవ్యాప్త కతోలిక శ్రీసభలో యేసుక్రీస్తు జయంతి 2025 జూబిలీ ముగింపు వేడుకలు నూతన అధ్యాయానికి నాందిగా చారిత్రాత్మక ఘట్టంగా



మిగిలిపోతాయని విజయవాడ కేథలిక్ డయోసిస్ మోస్ట్ రెవ. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు ఉద్ఘాటించారు. నిర్మలా హైస్కూల్ ప్రక్కన సెయింట్ పాల్స్ కథెడ్రల్లో ఆదివారం సాయంత్రం జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన దైవ సందేశమిస్తూ విశ్వశాంతి దూత దివంగత పోప్ ఫ్రాన్సిస్ 2025 సంవత్సరాన్ని యేసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ వేడుకలుగా ప్రకటించారని ప్రస్తుత జగద్గురువులు పోప్ లియో 14 వాటికన్ ప్రపంచవ్యాప్తంగా అన్ని కేథలిక్ డయోసిస్లలో డిసెంబర్ 28వ తేదీన యేసుక్రీస్తు జయంతి 2025 జూబ్లీ ముగింపు వేడుకలను సమిష్టి దివ్యపూజాబలితో ముగించారు.

## ఎస్సీఎస్టీలను అంటరానివారిగా చూస్తే జైలుశిక్ష

### మున్సిపల్ వైస్‌చైర్మన్ ప్రశాంత్ కుమార్

రేపల్లె, డిసెంబరు 28, ప్రభాతవార్త: సమాజంలోని ఎస్సీ,ఎస్టీలను అంటరానివారిగా పరిగణిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా చెల్లించకతప్పదని మున్సిపల్ వైస్ ఛైర్మన్,సీనియర్ న్యాయవాది గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ అన్నారు.స్థానిక అంబేద్కర్ భవనంలో ఆదివారం జరిగిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విజ్ఞాన సదస్సుకు ఎస్సీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దర్శి భాస్కరరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్ ప్రసంగిస్తూ ఆర్టికల్ 16(4) ప్రకారం ఉద్యోగాల భర్తీలో ఎస్సీ,ఎస్టీలకు కల్పించే రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.ఉద్యోగులు ఐకమత్యంతో వ్యవహరించాలని ఆయన కోరారు.బానిసత్వానికి కాలం చెల్లిందని ఆయన గుర్తుచేశారు.కారంచేడు,నీరుకొండ తదితర ప్రాంతాలలో ఎస్సీ,ఎస్టీలపై జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని డాక్టర్ కత్తి పద్మారావు యుద్ధప్రాతిపదికన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చి అగ్రకులాల ఆటకట్టించారని దళితులకు రక్షణ కల్పించారని ప్రశాంత్‌కుమార్ వివరించారు.సమాజంలో జరుగుతున్న అవినీతిని,అన్యాయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని ఆయన కోరారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ చదవాలన్నారు.విద్యావంతులైతేనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఎస్సీ,ఎస్టీలు గుర్తించాలన్నారు.దళిత వర్గాలలోని ఉద్యోగులు,పారిశ్రామిక వేత్తలు దళితుల అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు

## అనారోగ్యంతో తేలప్రోలు గ్రామ సర్పంచ్ మృతి

ఉంగుటూరు,డిసెంబరు27,ప్రభాతవార్త : ఉంగుటూరు మండలం, తేలప్రోలు గ్రామ సర్పంచ్ లాం దిబోరా(38) ఆదివారం అనారోగ్యంతో కన్నుమూశారు. గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేసిన ఆమె మృతి పట్ల పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దిబోర మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గ్రామ ఉపసర్పంచ్ వైసీపీ నాయకులు వింత ఆదినారాయణ రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు వింత శంకర రెడ్డి,నాయకులు విశ్వనాదపల్లి రవికుమార్ తదితరులు ఆమె సేవలను స్మరించుకుంటూ వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.ఆమె మృతి తో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భర్త కరోనా లోమృతి చెందగా, ఇద్దరి పిల్లలతో దిబోరా తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

## నెమలి శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో ముక్కోటి ఏర్పాట్లు



గంపలగూడెం, డిసెంబర్ 28, ప్రభాతవార్త: గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో ముక్కోటి పర్వదిన సందర్భంగా స్వామివారి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ సంధ్య తెలిపారు. 30న తెల్లవారుఝామునుంచి ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వారదర్శనం, 5.30 గంటలకు అభిషేకం, సహస్ర నామార్చన, గోదాదేవికి విశేషపూజలు నిర్వహిస్తామని, ఉదయం 10.30 గంటలకు నగరోత్సవం జరుగుతుందన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## చెత్తసేకరణ ట్రాక్టర్ ట్రాలీని ప్రారంభించిన 'ప్రత్తిపాటి'

చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: స్థానిక మున్సిపల్ విభాగం చెత్తసేకరణ నిమిత్తం రూ.11 లక్షలతో కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్‌ను, ట్రాలీని ప్రత్తిపాటి ప్రారంభించారు. స్వయంగా



నడుపుకుంటూ మున్సిపల్ కార్యాలయం నుంచి స్థానిక క్యాంపు కార్యాలయం వరకు వెళ్లారు. ట్రాక్టర్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వసొమ్ము కదా అనే నిర్లక్ష్యంతో వాహనాలు నిర్వహణను అశ్రద్ధ చేస్తే సిబ్బందిపై చర్యలుంటాయని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డిఇ అబ్దుల్ రహీమ్, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, మురకొండ మల్లిబాబు, పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజేఎఫ్ చిలకలూరిపేట నియోజకవర్గ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: ఏపీజేఎఫ్ చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులుగా జి కిరణ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జి వెంకటేశ్వరరావు, ఎం శ్రీధర్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కటారి ప్రసాద్, కోశాధికారిగా మాదాసు పృథ్వి సాయి, కార్యదర్శులుగా నిడమానూరు శరత్, వి సాయి, కార్యవర్గ సభ్యులుగా ఎస్కె కరిముల్లా, ఆరాధ్యుల రామకృష్ణ, మాదాసు తేజలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, ఈ ఎన్నిక కార్యక్రమాన్ని ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దండా గోపి, ఏపీజేఎఫ్ చిలకలూరిపేట నియోజకవర్గ మాజీ అధ్యక్షులు నాగ బైరు శ్రీనివాస రావు గారు నిర్వహించారు

## టిడిపికి బలం.. ధైర్యం.. తరగని ఆస్తి.. కార్యకర్తలే: 'ప్రత్తిపాటి'

చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: తెలుగుదేశంపార్టీ బలం.. ధైర్యం.. తరిగిపోని ఆస్తి కార్యకర్తలేనని, క్రమశిక్షణ, అంకితభావం, నిబద్ధత, విధేయతలకు వారు ప్రతిరూపాలని, వారి తెగువ, పనితీరే కష్టకాలంలో పార్టీని ప్రజలకు చేరువ చేసిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.ఆదివారం చిలకలూరిపేట పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉత్తమ కార్యకర్తలతో సమావేశమైన ప్రత్తిపాటి.. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజలకు చేరువ



చేయడంలో మంచి పనితీరు కనబరిచిన 40 మంది పసుపు సైనికులకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సుపరిపాలన.. ప్రజలకు, రాష్ట్రానికి శ్రీరామరక్ష వంటిదని, అలానే పరిస్థితుల్ని బట్టి.. ప్రజల్ని వేధిస్తూ, రాష్ట్ర అభివృద్ధి, జనసంక్షేమాన్ని అడ్డుకునే రాక్షసమూకను తుదముట్టించే రామబాణం కూడా అవుతుందన్నారు.పార్టీ బలం.. బలహీనత రెండూ కార్యకర్తలే యువనేత, పార్టీ జాతీయప్రధాన కార్యదర్శి లోకేష్ కార్యకర్తలకు అన్నివేళలా అండగా నిలుస్తున్నారని, పార్టీ నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించే ఒకరిద్దరిపై కాస్త కరుకుదనంగా వ్యవహరించినా, ఆయన అందరికి న్యాయమే చేస్తాడని ప్రత్తిపాటి పేర్కొన్నారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం ఏపీని తప్పకుండా ప్రపంచం గర్వించేస్థాయిలో నిలుపుతుందని, అప్పుడు ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసి మరీ గర్వపడొచ్చన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాలకుల దౌర్జన్యాలు, దుర్మార్గాలను ఎదిరించి ప్రజల పక్షాన నిలిచిన కార్యకర్తలు.. అధికారంలోకి వచ్చాక కొంత అసంతృప్తికి గురై అలకబూనారని, అండగా నిలిచే అధినాయకత్వం ఉన్నంతకాలం, ఎవరూ నిరుత్సాహపడాల్సిన పనిలేదని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. 4 దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో పార్టీ ఆటుపోట్లు.. ఒడిదుడుకులు.. కుట్రలుకుతంత్రాలు.. గెలుపోటముల్ని తట్టుకొని నిలబడటానికి కారణం కార్యకర్తల పనితీరేనని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఉత్తమ కార్యకర్తలుగా ఎంపికైన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా అభినందనలు తెలిపిన ప్రత్తిపాటి.. అందరితో విడివిడిగా ఫోటోలు దిగి, వారి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, టీడీపీ నాయకులు గంగా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కనకదుర్గ అమ్మవారి నగరోత్సవం

చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని వినాయక ట్రస్టు ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రి మీద వేంచేసియున్న కనకదుర్గ అమ్మవారి అర్చక బృందం సారథ్యంలో నిర్వహిస్తున్న కల్యాణహోత్సవం సందర్భంగా అమ్మవారి నగరోత్సవాన్ని శాసనసభ్యులు ప్రత్తిపాటి



పుల్లారావు ప్రారంభించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి అర్చకుల ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం నగరోత్సవం సందర్భంగా అమ్మవారి వేషధారణ, కోలాటాలు, వివిధ రకాల కళాకారులచే చేస్తున్న నృత్య ప్రదర్శనలు తిలకించి ఎంతో అద్భుతంగా ఉన్నాయని, చాలా ప్రతిష్ఠాత్మకంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న కమిటీ వారికి ప్రత్తిపాటి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, పఠాన్ సమద్, మద్దుమాల రవి, పిల్లి కోటి, రాయపూడి బదరి, తుబాటి శ్రీహరి, చంద్రపట్ల మణి, గ్రాత్రం అజయ్, కొల్లా ఉమా, పొట్టి రత్నబాబు, ప్రమీల, కొత్త కుమారి, లక్ష్మీ కుమారి, ఆలపాటి వెంకటరావు, అమరా మణి కుమార్, మధు, రాజా, కంచర్ల ప్రసాద్, కందుల రవి తదితరులు పాల్గొన్నారు..

## ఘనంగా పూర్ణాహుతి, పడిపూజ



చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి దక్షిణాన ఓగేరు వాగు సమీపాన వేంచేసి ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నందు మండల మహోత్సవం లో భాగంగా శ్రీ లక్ష్మీగణపతి హోమానికి పూర్ణాహుతి కార్యక్రమం జరిగింది. మండల మహోత్సవం పూర్ణాహుతి సందర్భంగా పడిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ శ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపి, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## టిడిపి వైద్య విభాగం.. ప్రజారోగ్యరక్షణకు మరిన్ని సేవలందించాలి ...

చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: ప్రజారోగ్య పరిరక్షణకోసం చంద్రబాబు నాయకత్వంలోని కూటమిప్రభుత్వం చేస్తున్న విశేష కృషిని, పేదలకు అందిస్తున్న వైద్యసేవల్ని మరింత విస్తృతం చేయడంలో టీడీపీ వైద్య విభాగం కీలక పాత్ర పోషించాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. ఆదివారం ఆయన పట్టణంలోని తూర్పు మాలపల్లెలోని దావూదుమోహి పార్కు నందు టీడీపీ డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ప్రజలను, వైద్యసిబ్బందిని ఉద్దేశించి ప్రసంగించారు. కంటి సంబంధిత సమస్యలతో పాటు.. గుండె, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేయడానికి ముందుకొచ్చిన వైద్యుల్ని,



ఆసుపత్రుల యాజమాన్యాల్ని ప్రత్తిపాటి ప్రత్యేకంగా అభినందించారు. కిడ్నీ సంబంధిత సమస్యలు, పలు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే పేద, మధ్యతరగతి వర్గాల ముంగిటకే వైద్యసేవలు చేరేలా టీడీపీ డాక్టర్స్ సెల్ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, అన్నివిధాలా సేవలందిస్తోందని, వైద్యారోగ్యశాఖతో సమన్వయం చేసుకుంటూ, పార్టీ వైద్య విభాగం కూడా ప్రజాసేవలో పాలుపంచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రజారోగ్య రక్షణకోసం ప్రభుత్వం చేస్తున్న కృషి, వెచ్చిస్తున్న ఖర్చు...కల్పిస్తున్న సౌకర్యాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు పిల్లి లెనిన్, గేరా రాము, వైద్యుల విభాగం ప్రతినిధులు గల్లా మురళీకృష్ణ, కొండబోయిన శ్రీనివాస్ రావు, సాతులూరి రాజేశ్వర, ఖలీఫా, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## నేటి నుండి కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్ ప్రారంభం



నరసరావుపేట,డిసెంబర్ 28 ప్రభాతవార్త :: డిసెంబర్ 29 నుండి కలెక్టరేట్లో రెవెన్యూ క్లినిక్ ను ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ కృతిక శుక్లా ఆదివారం తెలిపారు. గ్రీవెన్స్ లో భూమి సంబంధిత ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేకంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ తో పాటు ప్రతి సోమవారం రెవిన్యూ క్లినిక్ ను అధికారులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల తహసిల్దార్లు, ఆర్డీవోలు తమ ల్యాప్టాప్ లతో, కంప్యూటర్ ఆపరేటర్లతో, రెవిన్యూ రికార్డులతో హాజరు కావాలన్నారు. అదేవిధంగా ప్రజలు తమ ఫిర్యాదులను మీకోసం. ఏపీ.జివోవి. ఇన్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చున్నారు. అలాగే నమోదు చేసిన అర్జీల స్థితిగతులను తెలుసుకునేందుకు 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా సమాచారం పొందవచ్చు అన్నారు. దీంతోపాటు వాట్సప్ గవర్నెన్స్ మనమిత్ర యాప్ ద్వారా 36 ప్రభుత్వ శాఖలకు చెందిన 700 పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# వ్యవసాయానికి 'కూటమి' ప్రభుత్వం పెద్దపీట

### ఒంగోలు గిత్తల బలప్రదర్శన పోటీల్లో ఎంపి, ఎమ్మెల్యేలు

నరసరావుపేట,డిసెంబర్ 28 ప్రభాతవార్త :: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి, రైతాంగానికి మేలు చేసే విధంగా పాలనలో పెద్ద పీట వేసి చేయూతనిస్తున్నట్లు ఎంపీ ఎల్. కృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం సత్తెనపల్లి రోడ్ లోని జిల్లా స్టేడియంలో నాలుగో రోజు



ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు ప్రదర్శన పోటీలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పోటీలను పర్యవేక్షి ంచారు. పార్టీ సీనియర్ నాయకులు కపలవాయి విజయకుమార్,నాగసరపు సుబ్బరాయ గుప్తా, జనసేన నాయకులు సయ్యద్ జిలాని, క మిటి సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే డా. అరవింద్ బాబు అధ్యక్షత వహించిన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ వారం రోజులపాటు అద్భుతంగా నిర్వహిస్తున్న ఎడ్ల పందాలు ఎంతో వ్యయ, ప్రయాసలతో కూడినవని తెలిపారు. కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి సైతం 200కు పైగా ఎడ్ల జతలు రావడం సంతోషమన్నారు. అరుదైన ఒంగోలు జాతి ని రక్షి ంచుకునేందుకు ఇటువంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి పశు సంపదను కాపాడుకునేందుకు అవసరమైన పథకాలను రూపొందించి అమలు



చేస్తున్నట్లు తెలిపారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన వేలాది మంది రైతులకు ఎంపీ కృష్ణదేవరాయలు అభినందనలు తెలిపారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వం అని తెలిపారు. గత ప్రభుత్వం వ్యవసాయానికి నష్టం చేసిందన్నారు. రైతులు వ్యవసాయంలో వచ్చిన సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక పరిస్థితులు అంతగా అనుకూలంగా లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా అన్నదాతను ఆదుకునేందుకు సుఖీభవ పథకం ద్వారా వారి ఖాతాలలో డబ్బులు జమ చేసిందన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ వంటి ఆదాయ మార్గాలను నిర్వహించాలని సూచించారు. పల్నాడు ప్రాంతంలో వ్యవసాయం మరింత లాభదాయకంగా ఉండేందుకు అవసరమైన చర్యలను తీసుకుంటామన్నారు. రైతులకు కంది,మిర్చి,ధాన్యం, పత్తి వంటి పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలను కల్పించి అండగా ఉందని ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగుతాయి అన్నారు. రైతులకు, పశు పోషకులు, ప్రేక్షకులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. సహకరిస్తున్న కమిటీ సభ్యులకు రైతులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగో రోజు పందాలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు ఎంపీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు డాక్టర్ అరవింద బాబు, బ్రహ్మారెడ్డిలు

## మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు రూ టెండర్లు దాఖలు చేయకపోవడం జగన్ విజయం: డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, డిసెంబర్ 28 ప్రభాతవార్త : రాష్ట్రంలోని మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రభావంతో .... మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు కూటమి ప్రభుత్వం పిలిచిన టెండర్లకు ఒక్కరూ కూడా టెండర్ దాఖలుకు రాకపోవడం వైఎస్. జగన్మోహన్ రెడ్డి విజయానికి నిదర్శనమని, ఇది ప్రజా విజయమని వైసీపీ పల్నాడు జిల్లా



కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఆదివారం డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పట్టణంలోని ఇస్లాంపేట, వెంగళ రెడ్డి నగర్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడి ప్రజలను అక్కడి సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంగళరెడ్డి నగర్, ఇస్లాంపేటలోని పులివాగు డ్రైనేజీ కాలువ శుభ్రం చేసి దాదాపు నాలుగు నెలలు కావస్తుందని స్థానికులు చెబుతున్నారని తెలిపారు. కాలువలో మొత్తం చెత్తా, చెదారం, మట్టితో పూర్తిగా పూడుకుపోయి దర్శనామిస్తున్నాయని అన్నారు. గత నాలుగు నెలలుగా కాలువలు శుభ్రం చేసిన దాఖలాలు లేవన్నారు. గత వైసీపీ హయాంలో నగర దీపికలను పెట్టి ఎప్పటికప్పుడు చెత్తను తీసేశామన్నారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది ఎవరు కూడా వీధుల్లో పర్యటించడం లేదని, మున్సిపల్ కమిషనర్ రోడ్ల మీదకే రారని నరసరావుపేట మున్సిపాలిటీపై తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇంతవరకు ఒక కొత్తగా ఒక పెన్షన్ కూడా ఇవ్వలేదని విమర్శించారు. రేషన్ ను ఇంటికి వెళ్లి ఇచ్చే కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం తీసివేసిందని, రేషన్ షాపుల వద్దకు వెళ్తే ఐదు రోజులు మాత్రమే ఇస్తున్నారని ఆ తర్వాత డబ్బులు ఇస్తాము కావాలంటే తీసుకోండి లేకపోతే లేదని చెప్పడం అన్యాయమన్నారు. గత వైసీపీ హయంలో డిబిటీ ద్వారా ప్రజలకు అనేక పథకాలకు డబ్బులు ఇస్తే రాష్ట్రం శ్రీలంకలా మారిపోతుందని చంద్రబాబు నాయుడు గగ్గోలు పెట్టారని, ప్రస్తుతం ప్రజలకు ఒక పథకం కూడా ఇవ్వకుండా చంద్రబాబు నాయుడు ఈ రెండు సంవత్సరాల కాలంలో దాదాపు 2,60,000 వేల కోట్లు అప్పు చేశారన్నారు. ఈ డబ్బంతా ఎక్కడికి పోతుందో అర్థం కావటం లేదన్నారు. ఈ రాష్ట్రంలో పరిపాలన మొత్తం హెలికాప్టర్లలోను, చార్టెడ్ ఫ్లైట్లలో జరుగుతుందని ఎద్దేవ చేశారు. రాష్ట్రంలోని గ్రామాలలో పరిస్థితులు మరింత దారుణంగా ఉందన్నారు. ఈ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యక్తిగత నెలకొని ఉందని తెలిపారు. నరసరావుపేటలోని మెప్మా కుంభకోణంలో విచారణ కమిటీ వారు పార్టీల కతీతంగా వ్యవహరించి దోషులు ఎవరైతే ఉన్నారో వారందరినీ బయటకు తీసి శిక్షి ంచాల్సిన అవసరం ఉందన్నారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రతి వార్డు, ప్రతి సందు తిరిగి ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా టిడిపి కోశాధికారిగా నరసింహారావు

నరసరావుపేట టౌన్,డిసెంబర్ 28 ప్రభాతవార్త:: పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కోశాధికారిగా నరసరావుపేట పట్టణానికి చెందిన తిరుమల కొండ నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాలు పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పార్టీ



నాయకులు, కుల పెద్దలు, మిత్రులు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు నాయుడు, యువ మంత్రివర్యులు నారా లోకేష్, ఎంపీ కృష్ణదేవరాయలు, మాజీ జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, ఎమ్మెల్యేలు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు,జీవి ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా తనకు అండగా నిలిచి శుభాకాంక్షలు తెలిపిన సామాజిక వర్గ పెద్దలకు అభినందనలు తెలిపారు. తనపై పార్టీ ఉంచిన నమ్మకానికి, బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానని తిరుమల కొండ నరసింహారావు తెలిపారు.

## విద్యార్థి అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

నరసరావుపేట క్రైమ్,డిసెంబర్ 28 ప్రభాతవార్త :: రొంపిచర్ల మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో విద్యార్థి ఒకరు అనుమానాస్పద స్థితిలో ఆదివారం మృతి చెందారు. ఈనెల 13వ తేదీ నుండి మండలంలోని సంతగుడిపాడు గ్రామానికి చెందిన చప్పిడి తేజ కనిపించడం లేదని



తల్లిదండ్రులు పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సంత గుడిపాడు గ్రామము శివారులోని స్టోర్ రూమ్ లో భౌతిక దేహంను గ్రామస్తులు గుర్తించారు. పాడుబడిన స్టోర్ రూమ్ లో వాసన రావడంతో స్థానికులు గమనించి ఉరి వేసుకుని తేజ మృతి చెందినట్లు పోలీసులకు తెలియజేశారు. కాగా మృతుడు తేజ నరసరావుపేట లోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. సమాచారం తెలుసుకొని ఎస్సై లోకేశ్వరరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి స్థానికుల నుండి వివరాలు తీసుకున్నారు.

## పేదవిద్యార్థికి కృష్ణవేణి కళాశాల చేయూత

రొంపిచర్ల,డిసెంబర్ 28 ప్రభాతవార్త ::స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజీకి చెందిన ఒక విద్యార్థి గత కొన్ని రోజుల క్రితం ఆర్టీసీ బస్సు నుంచి ప్రమాదవశాత్తూ పడి తన రెండు కాళ్లను కోల్పోయాడు. పేద కుటుంబానికి చెందిన ఆ విద్యార్థికి తన తల్లే ఆధారం. ఈ ఘటనను తెలుసుకున్న కృష్ణవేణి డిగ్రీ కాలేజీ విద్యార్థులు, అధ్యాపకులు మానవత్వంతో స్పందించారు. వారంతా కలిసి విరాళంగా సేకరించిన రూ. 1,20,000 మొత్తాన్ని బాధిత విద్యార్థి తల్లికి ఆదివారం అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కళాశాల విద్యార్థులకు అధ్యాపకులకు యాజమాన్యానికి విద్యార్థి తల్లి కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ యోగేశ్వరరావు, సతీష్, తిరుపతిరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

నకరికల్లు,డిసెంబర్ 28 ప్రభాతవార్త : :మానవతా మరియు రెడ్ క్రాస్ సొసైటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం వర్క్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెడ్ క్రాస్



సొసైటీ మరియు మానవతా చైర్మన్ ఎం. రామ శేషగిరిరావు, రెడ్ క్రాస్ సెక్రటరీ శ్రీనివాస్, డాక్టర్ రాంప్రసాద్, మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రెసిడెంట్ మాకినేని హరిబాబు, సెక్రటరీ కదం నాగజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మగ్గం వర్క్ శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికేట్ అందజేశారు. శిక్షణ తీసుకున్న మహిళలు నేర్చుకున్న విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వశక్తితో ప్రతి మహిళ కుటుంబాలకు తమ వంతు చేయూతగా నిలవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోయ రామారావు, పోకా శ్రీనివాసు, కన్నెగంటి శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.

## ఏఎం.రెడ్డి కళాశాలలో ముగిసిన ఏఎంఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్ స్పోర్ట్స్ మీట్ 2కె25

నరసరావుపేట టౌన్, డిసెంబర్ 28 ప్రభాతవార్త :: ఏఎం.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఏఎంఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్ స్పోర్ట్స్ మీట్ 2కె25 క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ మరియు డిప్లొమా కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్. మల్లికార్జున్ తెలిపారు. వాలీబాల్ పోటీలో సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు విజేతగా నిలిచింది. 100 మీటర్ల పరుగుపందెంలో ఎన్.ఈ.సి. కాలేజ్ కి చెందిన కె. వెంకటేష్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. చలపతి లాం ఇంజినీరింగ్ కాలేజ్ కి చెందిన ఎన్. చంద్రశేఖర్ 2వ స్థానంలో నిలిచాడు. కబడ్డీలో విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కాలేజ్ మొదటి స్థానంలో నిలిచింది. ఏఎం.రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ రెండో స్థానంలో నిలిచింది. మహిళా విద్యార్థుల విభాగంలోని త్రోబాల్ పోటీలో ఏఎం.రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, కబడ్డీ పోటీలో ఈశ్వర్ కాలేజ్, వాలీబాల్ లో యూనివర్సల్ కాలేజీలు విజయం సాధించాయి. డిప్లొమా విద్యార్థుల త్రోబాల్ పోటీలో ఏఎం.రెడ్డి కాలేజ్, మహిళా డిప్లొమా విద్యార్థుల విభాగంలో నిర్వహించిన ఖోఖో పోటీలో ఈశ్వర్ కాలేజ్ విజేతలయ్యారు. ఈ క్రీడా పోటీల్లోని విజేతలు బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అట్లూరి శ్రీనివాస రెడ్డి, సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో అవసరమని, ఇలాంటి క్రీడా పోటీలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమన్వయాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కృష్ణా రెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. భార్గవభూషణ రావు, అకడమిక్ డైరెక్టర్ ఏ. పావని, విభాగాధిపతులు, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు కె. ఈశ్వర్, ఏ. ఎమ్మాన్యువల్, మరియు పి. తిరుపతయ్య పాల్గొన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదు :ఎస్ఐ. సతీష్

నకరికల్లు, డిసెంబర్ 28 ప్రభాతవార్త :: మండల పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని నకరికల్లు ఎస్ఐ. సతీష్ హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో పాత నేరస్తులకు, రౌడీ షీటర్లకు నిర్వహించిన కౌన్సెలింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూసినా ఊరుకోబోమన్నారు. గ్రూపు రాజకీయాలతో అలజడులు సృష్టించినా సహించేది లేదని స్పష్టం చేశారు. రౌడీ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని, ప్రతి ఒక్కరూ పోలీస్ నిబంధనలను పాటించాలని సూచించారు.పోలీస్ నిబంధనలను ఎవరు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు.

## సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య శిబిరం



నరసరావుపేట,డిసెంబర్ 28 ప్రభాతవార్త : నందిగామ గ్రామంలో ఆదివారం సాయి కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వివరాలను హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలియజేశారు. సింగరాజు చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను రోగులకు వివరించామన్నారు. రోగ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. బీపీ,షుగరు,జ్వరాలు, నెమ్ము, ఆయాసం, ఉబ్బసం,జలుబు,దగ్గు థైరాయిడ్ సమస్యలతో పాటు అన్ని సాధారణ వ్యాధులకు, ఊపిరితిత్తులకు సంబంధించి ఉచితంగా పరీక్షలు చేశామన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ సింగరాజు సాయి కృష్ణతో పాటు డాక్టర్ సింగరాజు విద్య పాల్గొని వైద్య సేవలు అందించారు. గ్రామ సర్పంచ్ రమాదేవి, గ్రామ పెద్దలు అమరేశ్వరరావు, సాంబయ్య, విజయకుమార్, నాగ ఆంజనేయులు, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

## గణపవరం చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

నాదెండ్ల, డిసెంబర్ 28, ప్రభాతవార్త: చిలకలూరిపేటరూరల్ మండలం గణపవరం చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా నాదెండ్ల ఎస్సై వెంకటేశ్వరరావు వాహనదారులకు పలు సూచనలు చేశారు. హెల్మెట్ లేని వారికి, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి, సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్న వారికి, వాహనాలకి బండి నెంబర్ లేకపోయినా, చిన్న పిల్లలకి వాహనాలు ఇచ్చిన వారికి తగు సూచనలు చేశారు.



## వెంకట నరసమ్మ మృతికి ప్రముఖుల నివాళి



చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ మోహనరావు మాతృమూర్తి వెంకట నరసమ్మ ఇటీవల మృతిచెందారు. ఆదివారం గన్నవరం నియోజకవర్గం పెద్దఅవుటపల్లి గ్రామంలోని ఆమె స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో నరసమ్మకు ప్రముఖ నేతలు ఘనంగా నివాళులర్పించారు. మంత్రులు అచ్చెన్నాయుడు,. కొండపల్లి శ్రీనివాసరావుతోపాటు చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తదితరులున్నారు.

## శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణారావుకు ఘననివాళి

చిలకలూరిపేట, డిసెంబర్ 28, ప్రభాతవార్త: ఇటీవల విధి నిర్వహణలో గుండెపోటుతో అకస్మాత్తుగా



మృతి చెందిన చిలకలూరిపేట మునిసిపాలిటీ శానిటరీ ఇన్స్పెక్టర్ చేరెడ్డి నాగ వెంకట రమణారావు పెద్దకర్మ కార్యక్రమం స్థానిక సిఆర్ కాలనీ లోని, శ్రీ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తదితరులు హాజరై రమణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పల్నాడు జిల్లా వార్త



## మిర్చి యార్డు చైర్మన్ కుర్రాకు బుజ్జి సత్కారం

పెదకూరపాడు, డిసెంబర్ 28 ప్రభాతవార్త: మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావును పెదకూరపాడు మాజీ ఎంపీపీ బుజ్జి ఆదివారం శాలువా కప్పి సత్కరించారు. టిడిపిలో కష్టపడి పనిచేస్తున్న అప్పారావు కు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి వరించడం ఎంతో సంతోషమన్నారు.. ఈ కార్య క్రమంలో వట్టికూటి శివరామ కృష్ణయ్య, మన్నెం శ్రీనివా సరావు, ఆర్ పి రమేష్, వట్టికూటి సైదారావు, సాంబిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 1999-2000 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు: విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు ఘన సన్మానం

మంగళగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త :పాతికేళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. మళ్లీ బాల్యంలోకి వెళ్లి గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఇన్ని సంవత్సరాల తర్వాత కలుసుకుని ఘనంగా సన్మానించుకున్నారు. ఈ మధుర క్షణాలకు మంగళగిరి సీకే హైస్కూల్ వేదికైంది. మంగళగిరి పట్టణంలోని చింతక్రింది కనకయ్య బాలుర ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. పదవ తరగతి పూర్తిచేసుకుని 25 సంవత్సరాలు పూర్తి కావడంతో సిల్వర్ జూబ్లీ వేడుకలను వినూత్నంగా నిర్వహించారు. తొలుత వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల నుంచి మేళతాళాలు, వేదమంత్రోచ్ఛరణల నడుమ పూర్ణకుంభంతో గురువులకు స్వాగతం పలికి, అక్కడి నుంచి సీకే హైస్కూల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. సీకే హైస్కూల్‌లో విద్యా సంస్థల వ్యవస్థాపకులు స్వర్గీయ చింతక్రింది కనకయ్య విగ్రహానికి అలనాటి గురువులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సీకే హైస్కూల్ ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. చిన్నారులచే ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీకే జూనియర్ కళాశాల పాలక మండలి అధ్యక్షులు చింతక్రింది కనకయ్య, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ గంజి చిరంజీవి, ప్రిన్సిపాల్ అత్తోట రత్నబాబు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు దామర్ల కనకలింగేశ్వరరావు, ఆర్.సైదులు, గద్దె నరసింహారావు, జొన్నాదుల దేవేంద్రరావు, ఎం.రాజేంద్ర, జంజనం పాండురంగారావు, ఎన్.గుణేశ్వరరావు, పంచల సాంబశివరావు, శనగల రామ్మోహన్, తుమ్మా నాగేశ్వరరావు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, ఎం.చలపతిరావు, దాసరి సాంబశివరావు, వై.రాజశేఖర్, సుబ్బారావు, నాన టీచింగ్ స్టాఫ్ చిరంజీవి, నాగేశ్వరరావులను ఘనంగా సన్మానించి పూలమొక్కలు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథులైన చింతక్రింది కనకయ్య, గంజి చిరంజీవి, అత్తోట రత్నబాబులను జ్ఞాపికలతో సత్కరించారు. ప్రస్తుత పాలకవర్గ ప్రతినిధులు, విశ్రాంత అధ్యాపకులు తమ అమూల్యమైన సందేశాలను అందించి పూర్వవిద్యార్థులను అభినందించారు. దాదాపు 25 సంవత్సరాల తరువాత ఒక్కచోట కలుసుకోవడంతో పూర్వ విద్యార్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లువిరిసాయి. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆహ్లాదంగా, ఉత్సాహంగా గడిపారు. గురువులతో తమకు వున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆప్యాయంగా పలుకరించారు. మొత్తంగా 19992000 సంవత్సరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సీకే విద్యా సంస్థల్లో పండుగ వాతావరణాన్ని నింపింది.







## రైతు సమస్యలను పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తా'

### బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై వి సుబ్బారావు

మంగళగిరి, డిసెంబర్ 28, ప్రభాతవార్త : రైతాంగ సమస్యలను పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తాననిభారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై వి సుబ్బారావు అన్నారు. బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల నియమితులైన వైవి సుబ్బారావును జనసేన పార్టీ సీనియర్ నాయకులు, జై కాపునాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమల శెట్టి కొండలరావు ఆధ్వర్యంలో శనివారం ఆటోనగర్ లోని ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవి సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి రైతాంగ సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తన నియామకానికి సహకరించిన జిల్లా బిజెపి అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావుకు ధన్యవాదాలు తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ ఏ పార్టీలో అయినా కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో తిరుమల శెట్టి కొండలరావు కాపు సంఘం తరపున సేవా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు జనసేన పార్టీలో కీలకంగా పనిచేస్తున్నారని అన్నారు. భవిష్యత్తులో కొండలరావుకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు మాట్లాడుతూ... రైతే దేశానికి వెన్నుముక అని, అటువంటి రైతుల యొక్క సంక్షేమం కోసం కిసాన్ మోర్చా తరపున సుబ్బారావు కృషి చేయాలని కోరారు. అభివృద్ధి పనుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పోటీ పడుతున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జై కాపు సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమాటం అనిల్ బాబు, మాజీ ఉపాధ్యక్షులు తోట సాంబశివరావు, జై కాపునాడు నాయకులు రాఘవ, జనసేన నాయకులు విక్టర్ పాల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఆర్ఎంలో 50వ అఖిల భారత సామాజిక శాస్త్ర సదస్సు

### హాజరైన ఇండియన్ సోషియాలజికల్ సొసైటీ నిర్వహణ కమిటీ

### మూడు రోజుల పాటు ప్లీనరీలకు హాజరవుతున్న సామాజిక శాస్త్రవేత్తలు

మంగళగిరి, డిసెంబరు 28, ప్రభాతవార్త: ఇండియన్ సోషియాలాజికల్ సొసైటీ నిర్వహిస్తోన్న ఖ50వ అఖిల భారత సామాజిక శాస్త్ర సదస్సు 2025ఖ కు ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా మారింది. ఆదివారం ఉదయం వర్సటీలోని అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో ఈ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఇండియన్ సోషియలాజికల్ సొసైటీ పర్యవేక్షణలో యూనివర్సిటీకి చెందిన ఈశ్వరీ స్కూల్ ఆఫ్ లిబరల్ ఆర్ట్స్ సదస్సు నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. ఇండియన్ సోషియాలజికల్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మైత్రి చౌదరి, కార్యదర్శి శ్వేతా ప్రసాద్ లతో పాటు దేశ వ్యాప్తంగా ఉన్న సొసైటీ సభ్యులు, సామాజిక శాస్త్రవేత్తలు పెద్ద సంఖ్యలో సదస్సుకు హాదరయ్యారు.సదస్సు ప్రారంభోపన్యాసం లో యూవవర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగే ఇండియన్ సోషియాలజికల్ వదస్సు ఏపీ ఎస్ ఆర్ ఎం వర్సటీలో జరగడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. అత్యుత్తమ బోధన పరిశోధనలే లక్ష్యంగా ఏర్పాటు చేసిన.





ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్వాంటం టెక్నాలజీ కోర్సులు అందుబాటులోకి రానున్నాయి అన్నారు. పదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త మరియు న్యూఢిల్లీలోని జెఎన్ టీయు వర్సిటీ సామాజిక శాస్త్ర విభాగం మాజీ డీన్ ప్రొఫెసర్ రవీంద్ర కుమార్ జైన్ సామాజిక అవసరాలు, సొసైటీ పని తీరుపై ప్రసంగించారు. సొసైటీ సమావేశాలను సమర్థవంతంగా నిర్వహిస్తోన్న నిర్వహణ కమిటీ కృషి ని, ఎస్ఆర్ఎం వర్శటీ చొరవను ప్రశంసించారు. విశిష్ట అతిథిగా హాజరైన లఖిల భారత సోషియాలజిల్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మైత్రేయ చౌదరి సొసైటీ కార్యక్రమాలను, సామాజిక రంగంలో చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా వందేళ్లలో భారత్ సోషియాలజీ స్థితిగతులపై డాక్టర్ అబా చౌహాన్ సిద్ధం చేసిన పుస్తకాన్ని వేదిక పై ఆవిష్కరించారు. అదేవిధంగా మైగ్రేషన్ అండ్ మొబిసిటీ అంశంపై రూపుదిద్దుకున్న సోషియాలజికల్ బులెటిన్ పుస్తకాన్ని, మాజీ ఎంపీ డాక్టర్ ఎలమంచిలి శివాజీ రచించిన సామాజిక రంగ ప్రసంగాల సంపుటిని వీసీ సతీష్ కుమార్, ఆర్ కే జైన్, మైత్రియి చౌదరిలు ఆవిష్కరించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన మాజీ ఎంపీ ఎలమంచిలి శివాజీ శివాజీ సదస్సు నిర్వహణకు ముందుకు వచ్చిన యూనివర్సిటీ యాజమాన్యాన్ని ప్రశంసించారు. అనంతరం వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్ అతిథులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఇండియన్ సోషియాల్టీ కార్యదర్శి డాక్టర్ శ్వేతా ప్రసాద్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమాలలో రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్, డీన్ డాక్టర్ విష్ణుపద్, సదస్సు నిర్వహణ కో ఆర్డికేటర్లు డాక్టర్ బిక్కు, డాక్టర్ ఇస్మితా ప్రధాన్ లు పాల్గొన్నారు.

# తెదేపా కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాం

### : ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ, ఎంపి శ్రీకృష్ణదేవరాయలు

### కార్యకర్తల సంక్షేమానికి జీ.వీ రూ.5కోట్లు సొంత నిధులు కేటాయింపు

వినుకొండ,డిసెంబర్28,ప్రభాతవార్త: వినుకొండ నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న తెదేపా కార్యకర్తలను ఆదుకునేందుకు తాను వ్యక్తిగతగా 5 కోట్లు నిధులను వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్,సీనియర్ శాసనసభ్యులు జీ.వీ ఆంజనేయులు ప్రకటించారు. ఆదివారం చీఫ్ విప్ కార్యాలయంలో పట్టణ పార్టీ అధ్యక్షులు బొంకూరి రోశయ్య అధ్యక్షతన జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన టిడిపి కార్యకర్తలను పార్టీ అధిష్టానం గౌరవంగా అభినందించింది. ఉత్తమ కార్యకర్తలగా గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు పంపగా వాటిని నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు,చీఫ్ విప్ జీవి ఆంజనేయులు చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు నాయుడు,మంత్రి లోకేష్ బాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని,రానున్న 20 ఏళ్ల అధికారంలో ఉంచే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారని అన్నారు. సీఎం చంద్రబాబు ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకువెళ్లాలని ఆయన స్ఫూర్తితో ప్రతి కార్యకర్త పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని తెలిపారు. ఒక్కసారి అవకాశం అంటే ప్రజలు నమ్మి వైసిపికి అధికారం ఇస్తే జగన్మోహన్ రెడ్డి 10 లక్షల కోట్లు అప్పులు చేసి ఒక్క ప్రాజెక్ట్ కూడా పూర్తి చేయకుండా దుర్వినియోగం చేశాడని ఆయన విమర్శించారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను ఆదుకోవడం జరిగిందన్నారు. 4,500 కోట్లు పల్లె పండుగ పథకం ప్రవేశపెట్టి అభివృద్ధి దిశగా పయనిస్తున్నామన్నారు. కష్టపడి పని చేసే కార్యకర్తకు చంద్రబాబునాయుడు,లోకేష్ బాబు, వినుకొండలో తాను అండగా ఉంటున్నామని తెలిపారు. కార్యకర్తల రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో కష్టపడి పనిచేసిన కార్యకర్తలను ఆదుకునేందుకు వ్యక్తిగతంగా సొంత నిధులనుండి 5 కోట్లు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త నీతి,నిజాయితీ ,క్రమశిక్షణతో రాణిస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. ప్రతి బుధవారం కార్యకర్తల సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో ఉంటానని ఈ అవకాశాన్ని కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మెరుగైన సేవలు అందించిన 85 మందికి పురస్కార అవార్డులు రావటం అభినందనీయ మన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ కార్యకర్తలకు మేము కొండంత అండగా ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధారణమైన ఆరోపణలను కార్యకర్తలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,ఐదు మండలాలకు చెందిన పార్టీ అధ్యక్షులు,పిఎసిఎస్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జ్‌లు,కన్వీనర్లు,టిడిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజారోగ్యానికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత: ఎమ్మెల్యే జూలకంటి

వెల్దుర్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త: సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు.






ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో రూ.28 లక్షల 70 వేలు విలువ చేసే చెక్కులను 31 మంది లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపత్కాలంలో ఆసరాగా నిలుస్తూ, ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం బాసటగా ఉంటుందని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గస్థాయి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడుగుల పక్షపాతి బ్రహ్మానందరెడ్డి

వెల్దుర్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త: బడుగు బలహీన వర్గాల పక్షపాతి, వెన్నుదన్ను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా సోషల్ మీడియా సమన్వయకర్త వెంకటలక్ష్మణ్ చెప్పారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా సోషల్ మీడియా సమన్వయకర్త పదవీ బాధ్యతలకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు, పార్టీ, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జిల్లా సోషల్ మీడియా బాధ్యతలను అప్పగించినందుకు సదా రుణపడి ఉంటానని చెప్పారు. ఈ సందర్భంగా తనకు జిల్లా పదవి రావడానికి సహకరించిన యువనాయకుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్లయ్యలకు ఎమ్మెల్యే వ్యక్తిగత సోషల్ మీడియా టీం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## ఘనంగా కెఎల్ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం

### --5వేల మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం --44బంగారు,40 రజిత పతకాలు

తాడేపల్లి,డిసెంబరు 28,ప్రభాతవార్త : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ 15వ స్నాతకోత్సవం వడ్డేశ్వరంలోని వర్సిటీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.స్నాతకోత్సవ కార్యక్రమానికి నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్,ఇండియా అధ్యక్షుడు ప్రొఫెసర్ వినోద్ కె.సింగ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.టాటా మెమోరియల్ సెంటర్,ముంబై ఎండి,ఐఏపి పీడియాట్రిక్ హిమాటో - అంకాలజీ విభాగ చైర్ పర్సన్ ప్రొఫెసర్ శ్రీపాద్ బనవల్లి గౌరవాతిథిగా హాజరైన విద్యార్థులకు డిగ్రీలు అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ప్రొఫెసర్ వినోద్ కె.సింగ్ మాట్లాడుతూ తనను కెఎల్ వర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించినందుకు ఆనందంగా ఉందన్నారు మీకు ఉద్యోగం కావాలా లేక కెరీర్ కావాలా? అని విద్యార్థులను ప్రశ్నించారు. ఉద్యోగం మీ బిల్లులను చెల్లిస్తుంది, మిమ్మల్ని సురక్షితంగా ఉంచుతుంది.మీ ప్రాథమిక అవసరాలను తీర్చేలా చేస్తుందన్నారు.ఒక ఉద్యోగం మిమ్మల్నీ 9నుంచి 5వరకు పనిచేసే అనేక మందిలో ఒకరిగా ఉంచుతుందన్నారు.ఆ 9నుంచి 5గంటలు ముఖ్యమైనవని కెరీర్ (వృత్తి)నిర్ధారిస్తుందన్నారు.సాయంత్రం 5తర్వాత కూడా అభివృద్ధి చెందడానికి మిమ్మల్ని ప్రేరేపిస్తుందన్నారు. ప్రతి తరం ఒక సామాజిక దురాచారాన్ని అంతం చేసిందన్నారు.అవినీతిని అంతం చేసే తరం కావాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను అంటూ విద్యార్థులకు పిలుపునిచ్చారు.నిజాయితీగా జీవించడానికి దేశ అభ్యున్నతి కోసం పనిచేయడానికి మిమ్మల్నీ మీరు అంకితం చేసుకోవడానికి ఇప్పుడు కంటే మంచి క్షణం మరోకటి లేదని తెలిపారు.





### --గ్రాడ్యుయేట్ల నుంచి విలువ సృష్టికర్తల వరకు చాన్సలర్ కోనేరు సత్యనారాయణ

కెఎల్ యూనివర్సిటీ చాన్సలర్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ ఈ వేడుక కేవలం విద్యా విజయ వేడుక కాదు,ఇది పరివర్తన క్షణం అని అన్నారు.ఈరోజు ప్రధానం చేయబడిన డిగ్రీ అనేక సంవత్సరాల కృషి,క్రమశిక్షణ,పట్టుదల మరియు వృద్ధిని సూచిస్తుందన్నారు.మీలో చాలా మంది ఉపాధి ద్వారా మీ వృత్తిపరమైన ప్రయాణాలను ప్రారంభిస్తారు.కెఎల్ వర్సిటీ నిరంతరం అత్యుత్తమ ప్లేస్‌మెంట్ ఫలితాలను అందిస్తుందన్నారు.వరుసగా 20సంవత్సరాలుగా ఆసక్తి ఉన్న విద్యార్థులందరికీ మేము 100శాతం ప్లేస్‌మెంట్ సాధించామన్నారు.కార్యక్రమానికి కోనేరు సత్యనారాయణ అధ్యక్షత వహించారు.సంధాతకర్త,వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావులు వ్యవహరించారు.కార్యక్రమంలో కెఎల్ ఇఎఫ్ కార్యదర్శి కోనేరు శివకాంచనలత,ఉపాధ్యక్షుడు కోనేరు రాజా హరీన్,బోర్డు సభ్యురాలు కోనేరు నిఖిల,ప్రొఫెసర్ చాన్సలర్,వైస్ చాన్సలర్,ప్రొఫెసర్ వైస్ చాన్సలర్లు,అన్ని విభాగాల డీన్లు,డైరెక్టర్లు,ప్రిన్సిపాల్స్,విభాగాధిపతులు,విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల అభ్యున్నతికి 'కూటమి' ప్రభుత్వం కృషి: జీవీ.ఎంపీ లావు

వినుకొండ,డిసెంబర్28,ప్రభాతవార్త: రాష్ట్రంలో ఉపాధ్యాయుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం పాటుపడుతుందని ప్రభుత్వం చీఫ్ విప్,సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు,నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా 4వ కౌన్సిల్ సమావేశం






పట్టణంలోని వెల్లటూరు రోడ్డు కొండ క్రింద ద్వారకా నగర్ నందు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చీఫ్‌విప్ జీ.వీ,ఎంపి శ్రీకృష్ణదేవరాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయులకు ఇటీవల ఒక డీఏ కూడా ఇవ్వటం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి లోకేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు,ఉపాధ్యాయ సంఘం నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ఈపూరు,డిసెంబర్28,ప్రభాతవార్త: ఈపూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్లలోని నీలకంటేశ్వర వైన్,విప్పర్ల రెడ్డి పాలెంలోని తిరుమల వైన్స్ మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. మద్యం నిల్వలను పరిశీలించి,టి.పిలతో సరి పోల్చుకోవడం జరిగింది. దీనికి ముందుగా డెకొయ్ ఆపరేషన్‌లు చేసి సదరు మద్యం దుకాణాల్లో విక్రయిస్తున్న మద్యం ధరలు నిర్ధారించుకోవడం జరిగింది. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నాటు సారాయి,కల్తీ మద్యం,నకిలీ మద్యం,గంజాయి తదితర మాదకద్రవ్యాలు, కల్తీ కల్లు గురించి ఎలాంటి సమాచారం వున్నా తెలపాలని తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని చెప్పారు. మద్యం దుకాణాల మీద పర్యవేక్షణ కోసం"ఎక్సైజ్ ఐ"యాప్ ద్వారా సిబ్బంది కి విధులు కేటాయించడం జరుగుతుందని పేర్కొన్నారు.



## అప్పారావుకు అభినందనలు తెలిపిన మండల టిడిపి నాయకులు.

పెదకూరపాడు, డిసెంబర్ 28 ప్రభాతవార్త: ఆసియా ఖండంలోనే మిర్చి కి అతిపెద్ద ఎగుమతి దిగుమతుల మార్కెట్ గుంటూరు మిర్చి మార్కెట్. అలాంటి ప్రతిష్టాత్మకమైన మార్కెట్ కమిటీ పాలకవర్గ అధ్యక్షునిగా కూటమి ప్రభుత్వం చే నియమించబడిన దేశం పార్టీ సీనియర్ నాయకులు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ కి ప్రియ మిత్రులు అయిన కుర్రా అప్పారావు ని పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు ఏటుకూరి బ్రహ్మయ్య నాయకత్వంలో కలసి వెళ్లి అప్పారావు కి అభినందనలు తెలియజేశారు. అభినందనలు తెలియజేసిన వారిలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు అత్తిమళ్ళ రమేష్, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ గుడిపూడి చిన్న రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ అంద్ర ప్రసాద్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షురాలు షేక్ ముంతాజ్ మాజీ మండల అధ్యక్షులు బెల్లంకొండ రాంగోపాల్రావు గల్లా బాబురావు సీనియర్ నాయకులు మద్దినేని సత్యనారాయణ నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు మక్కిన సాగర్ తదితరులు పాల్గొన్నారు.




## నూతన క్యాలెండర్ ఆవిష్కరించిన పాస్టర్ పుష్ప రాజ్

పెదకూరపాడు, డిసెంబర్ 28 ప్రభాతవార్త. దైవచింతనతో ప్రశాంతతను పొందవచ్చునని కడప జిల్లా పెంతుకోస్తు సంఘం అధ్యక్షులు పాస్టర్ పుష్పరాలు అన్నారు. మండలములోని 75 త్యాలూరు లో ఆదివారం పెంతుకోస్తు దేవాలయం ఐదవ వార్షికోత్సవ వేడుకలు పాస్టర్ జొన్నకూటి జై రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాస్టర్ పుష్పరాజు మాట్లాడుతూ నూతన సంవత్సరం నూతన ఆలోచనలతో, మంచి నిర్ణయాలతో క్రీస్తు చూపిన బాటలో నడవాలని కోరారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ ను, డైరీలను ఆవిష్కరించారు. స్థానిక సంఘ కాపరి పాస్టర్ జయరావు మాట్లాడుతూ యవ్వన దశలోనే మంచి నడవడికి నడవాలని తెలిపారు. రాసుకోవచ్చు వేడుకలకు సహకరించిన వనస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ గుంటూరు బాబురావు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పెద్ద ట్రస్టు సంఘస్తులు పాల్గొన్నారు.



## గర్నెపూడి సుజాతకు డాక్టర్ 'గజ్జల' నివాళి

ముప్పాళ్ల డిసెంబర్ 28 ప్రభాత వార్త:ముప్పాళ్ళ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన గర్నెపూడి కోటేశ్వరరావు కుమార్తె సుజాత అనారోగ్య కారణంగా పరమపదించారు.సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ..డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవరెడ్డి.. రుద్రవరం గ్రామంలోని సుజాత గారి నివాసానికి వెళ్లి వారి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నక్కా శ్రీనివాసరావు, ఎం జె ఎం రామలింగారెడ్డి , రాప్రోలు వెంకట కృష్ణారెడ్డి , ఇందూరి నరసింహారెడ్డి , పుల్లారెడ్డి , బ్రహ్మ రెడ్డి , శివ కేశవ ఈ నాయకుల తదితరులు పాల్గొన్నారు.



29-12P8exHMNWJQE 8 VJA_29-12P8exHMNWJQE.qxd 29/Dec/25 12:34 AM Page 1



# ఉపాధి నిర్వీర్యం చేయకుండా పోరాడుదాం



**మహాత్మాగాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ**

**గ్రామసభల్లో తీర్మానం చేయండి**

**రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**ఎఫ్ఆర్‌బిఎం పరిమితి పెంచాలి : మంత్రి వివేక్ వెంకటస్వామి**

**ప్రపంచం గాంధీని కొనియాడుతోంది.. బిజెపికి**

**అది నచ్చడంలేదు : మంత్రి అజారుద్దీన్**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేయ కుండా కేంద్రంపై పోరాటం చేద్దామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు నిచ్చారు. ఆదివారం గాంధీభవన్‌లో మంత్రులు వివేక్ వెంకట్ స్వామి,అజారుద్దీన్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ 2004లో సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆనాడు అనేక మంది మేధావులతో సంప్రదించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వ్యవస్థ పెంపొందించే మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చిందని గుర్తుచేశారు. ప్రజలు తిండి లేకుండా పస్తులు ఉండే పరిస్థితి ఉండకుండా ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చారని అన్నారు. గ్రామాలలో పనిలేని రోజుల వందరోజులు పని కల్పించడంతో ప్రజల ఆర్థిక వ్యవస్థ రూపు మారిందని చెప్పారు.2014 ఎన్నికల ఎజెండాలో బిజెపి గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా పట్టణ ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పిందని ,దానిని విస్తరించకుండా మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. మళ్ళీగ్రామీణులు వలసలు మొదలైనా, ఆకలిచావులు మొదలైనా దీనికి పూర్తిగా బిజెపి కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన ఈ చట్టంలో రాష్ట్రాల పై భారం మోపేలా 60:40 శాతం నిధులు ఉండేలా చేస్తుందని ఇప్పటికే రాష్ట్రాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపిందని ఆయన ఆవేదన చెందారు. మహాత్మా గాంధీ పేరు తొలగించి జీరాంజీ పేరు పెట్టడంలోనే కుట్ర దాగుందని అన్నారు. మహాత్మా గాంధీ,నెహ్రూ ,ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ ల పేర్లు చరిత్రలో లేకుండా చేయాలని బిజెపి మోడీ సర్కార్ చేస్తుందని ఆయన అన్నారు. దానికి నిరసనగా ప్రతి గ్రామంలో గాంధీ ఫోటో లతో ప్రతి ఒక్కరు నిరసనలు తెలపాలని కోరారు. తెలంగాణలోని అన్ని గ్రామ సభల్లో మొదటి గ్రామ సభలో మహాత్మా గాంధీ పేరు తొలగించడాన్ని నిరసిస్తూ తీర్మానం చేయాలని ఆ తీర్మానం కాపీని మోదీ కి పంపించాలని పిలుపునిచ్చారు. దీనికి అధికారులు సహకరించాలని సూచించారు..ఉపాధి హామీ పథకాన్ని డెబ్బైసేలా చేసిన ఈ బిల్లు పై వెనక్కి తీసుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయోద్యమంలో స్వాతంత్ర్యాన్ని సాధించడంలో కీలక పాత్ర పోషించిందని 141పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులకు శుభాకాంక్షలు తెలుపుతూ అన్నారు. దేశ అభివృద్ధి లో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుందని అన్నారు. నెహ్రూ ,ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ, యుపిఎ ప్రభుత్వాలు చేసిన సంస్కరణలతోనే ప్రపంచంలో భారత్ ముందుందని అన్నారు.

**కాంగ్రెస్ ప్రధానుల దార్శనికతతోనే దేశాభివృద్ధి : మంత్రి వివేక్**

నెహ్రూ నుంచి మొదలు కొని మన్మోహన్ వరకు కాంగ్రెస్ ప్రధానులు తీసుకొన్న అనే సాహసోపేతమై విధానాల కారణంగానే దేశాభివృద్ధి జరుగుతోందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు,పథకాలు తీసుకు వచ్చింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని ఆయన అన్నారు.నెహ్రూ,ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ మన్మోహన్ సింగ్, పివి నరసింహారావు దేశ వ్యాప్తంగా ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చారని కొనియాడారు.ఉపాధి హామీ పథకంకు ఉన్న మహాత్మా గాంధీ పేరు తొలగించడం కుట్ర పూరితమైన నిర్ణయమని ఆరోపించార.రాష్ట్రాన్ని చెప్పుచేతల్లో పెట్టుకోవడానికి కేంద్రం మన రాష్ట్రానికి నిధులు ఇవ్వడం లేదని ఆవేదన చెందారు.ఎఫ్ఆర్‌బిఎం పరిమితిని పెంచడం లేదని ఆరోపించారు.ఉపాధి హామీ పథకం కు 90 శాతం నిధులు కేంద్రం కేటాయించాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ నాయకత్వంలో అన్ని ఎన్నికలు ఓడిపోయారని కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని అన్నారు. ప్రపంచం గాంధీని కొనియాడుతోందని కేవలం బిజెపి మాత్రమే గాంధీనితిరస్కరిస్తుందని మంత్రి అజారుద్దీన్ అన్నారు. బిఆర్ఎస్ కేవలం సోషల్ మీడియాల్లో మాత్రమే బ్రతికి ఉందని ప్రజల్లో లేదని అన్నారు.

# పంచాయతీ నిధులకు పైరవీ అవసరంలేదు

**కేంద్రం నుంచి నేరుగా వస్తాయి**

**కెసిఆర్‌లో చాదస్తం, వైరాగ్యం తప్ప ఏమీ కనపడటం లేదు**

**నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** గ్రామపంచాయతీలను పరిపుష్ఠిచేసి పరిపాలన వికేంద్రీకరణచేయలనేదే ప్రధానమంత్రి నరేంద్రమోడీ లక్ష్య మని ఆర్థిక నిధుల కోసం రేవంత్ రెడ్డి ఎక్కడికీ పోవాల్సిన పని లేదని పంచాయతీ ఖాతాల్లో కేంద్రం నేరుగా నిధులు జమ చేస్తుందని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిజామాబాద్ లో జరిగింది. ఈకార్యక్రమంలో మాట్లాడిన అర్వింద్.సర్పంచ్ లకు సీఎంతో ఏం పని లేదన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పీఠం ఎక్కి రెండేళ్ల పూర్తయిందని ఈ రెండేళ్ల సర్పంచ్ ఎన్నికలు నిర్వహించకపోవడం వల్లే కేంద్ర నుంచి నిధులు రాలేకపోయాయని ఇప్పుడు సర్పంచ్ ఎన్నికలు జరగడంతో కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి నిధులు జమ చేస్తుందన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లడం, ఆ సంచులు మోయడం ఏమీ చేయాల్సిన పనిలేదని ఎకసెక్కాలు చేశారు. రెబల్స్ ను కూడా సిఎం రేవంత్ రెడ్డి తన ఖాతాల్లో వేసుకుంటున్నారని 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు లేవని దుబ్బాక, హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్లు దక్కలేదన్నారు. మా ఖర్మ కొద్ది బిజెపి టైమింగ్ సరిగా లేకపోవడం వల్ల తెలంగాణలో మీరు అధికారంలోకి వచ్చారన్నారు. నూతన పాలక వర్గాలు పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. కెసిఆర్ ప్రెస్ మీట్ లో చాదస్తం, వైరాగ్యం తప్ప తనకేమి కనిపించలేదని అర్వింద్ విమర్శించారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను చెప్పమంటే పాత రామాయణం అంతా వినిపించారన్నారు. ఇక్కడున్న చాలా మందితో పాటు తాను కూడా గతంలో కేసీఆర్ అభిమానులమేనని చెప్పారు. నీటి అంశంలో మంచి సబ్జెక్ట్ నేర్చుకున్నప్పటికీ ఆ జ్ఞానమంతా ఆయన కుటుంబానికి రూ40 -50 వేల కోట్లు సంపాదించుకోవడానికి ఉపయోగించారు. కెసిఆర్ అంతా పాపాత్ముడు సబూతో న భవిష్యత్ అని అన్నారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు సంగతి కవిత చెప్పుకుంటూ రాష్ట్రమంతా తిరుగుతోందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలుగా బిఆర్ఎస్ నాశనం చేసి ఇవాళ సూక్తులు చెబుతున్నారని ధ్వజమెత్తారు.

## రేపు కృష్ణాగోదావరి జలాల్లో న్యాయమైన వాటాపై రౌండ్‌టేబుల్ సమావేశం

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం అవతరించి 12 యేళ్ల అవుతున్నా కృష్ణాగోదావరి నదులలో న్యాయమైన జలాల వాటా పొందడంలో విఫలం,కారణాలు డిండికి పాలమూరుకు అన్యాయం చేసింది ఎవరు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం ఈనెల 30న మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఇంజనీర్స్ ఫోరం కన్వీనర్ దొంతులక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఉదయం పదిన్నరకు ముఖ్య అతిథి చందన్‌కుమార్,పాశం యాదగిరి అధ్యక్షతన ఈ రౌండ్ టేబుల్ సమావేశం ఉంటుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



విద్యార్థినులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య

## ఉన్నత స్థానాల్లో ఉన్నోళ్లంతా సర్కారు బడిలో చదివినోళ్లే..

**కలలు కని సాకారం చేసుకోవాలి**

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 28, ప్రభాతవార్త :** నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నవారు చాలామంది ప్రభుత్వ కళాశాలలు,వసతి గృహాల్లో చదివిన వారేనని, చదువు జీవితాన్ని మార్చుతుందని విద్యార్థినిలు బాగా కష్ట పడి చదివి తమ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకొని తల్లి దండ్రుల ఆశయం నెరవేర్చాలని రాష్ట్ర ఎస్‌సి.,ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన వేముల గ్రామంలో అత్యాచారానికి గురై మరణించిన దళిత యువతి కుటుంబాన్ని పరామర్శించి ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,ఎస్.పి. డి.జానకితో కలిసి చర్చించారు. అనంతరం మహబూబ్ నగర్ తిరుమల హిల్స్ లోని గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను సందర్శించారు.డిగ్రీ రెండవ,మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో సమావేశమై వారితో మాట్లాడారు. బోధన, భోజనం,వసతులు,ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉన్నాయా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.సమస్యలు ఏమి లేవని విద్యార్థినులు చెప్పారు.

## కేంద్ర బడ్జెట్‌లో అన్నదాతకు బాసట

**సాగుకు అత్యంత ప్రాధాన్యత**

**రాష్ట్రాలకు బలమైన మద్దతు**

**2025-26 కన్నా 2.10 శాతం ఎక్కువ**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** కొత్త ఏడాది వస్తుండటం, ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుండటంతో 2026-27 కేంద్ర వ్యవసాయ బడ్జెట్‌పై కసరత్తు జరుగుతోంది. వేటికి ఎన్ని నిధులు కేటాయించాలనే దానిపై ఇప్పటినుంచే చర్చలు జరుగుతున్నాయి కొత్త బడ్జెట్ లో ఉంది), రైతుల ఆదాయాన్ని పెంచడం, డిజిటల్ వ్యవసాయం (డిజిటల్ వ్యవసాయ మిషన్), ఆహార భద్రత (నూనె గింజలు, ఉద్యానవనాలు) మరియు క్రెడిట్ మద్దతుపై దృష్టి సారించే దిశగా కేటాయింపులు జరుగుతున్నట్లు తెలియవచ్చింది. అలాగే వ్యవసాయంలో రాష్ట్రాలకు బలమైన మద్దతు మరియు రైతులకు పూర్తి చేయూత ఇవ్వడానికి నిరంతర విధాన చర్యలు తీసుకురానుంది. ప్రస్తుత 2025-26 బడ్జెట్ వ్యవసాయ శాఖకు రూ.1.27 లక్షల కోట్లకు పైగా కేటాయించింది. కొత్త బడ్జెట్‌లో దీనికన్నా అదనంగా మరో 2 శాతం 32.5 లక్షల కోట్ల వ్యవసాయ రుణాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఈ కొత్త బడ్జెట్‌లో 2.10 శాతం అధికంగా పెంచే యోచనలో ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉన్నతా ధికారవర్గాల ద్వారా తెలియవచ్చింది. అలాగే డేటా ఆధారిత వ్యవసాయం, ఆహార భద్రత మరియు వాతావరణ స్థితిస్థాపకత కోసం డిజిటల్ వ్యవసాయ మిషన్‌ను విస్తరించనుంది. అలాగే వ్యవసాయ పథకాలకు నిరంతర నిధులు, రైతుల ద్రవ్యతను పెంచడానికి వ్యవసాయ రుణ లక్ష్యాన్ని పెంచనుంది. పంట శాస్త్రం, ఉద్యానవనం, పశువుల ఆరోగ్యం, నూనెగింజలు, పామాయిల్ కోసం మిషన్లకు కేటాయింపులు పెంచుతోంది. అలాగే వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి, వ్యవసాయ యాంత్రీకరణ తదితర పథకాలకు మద్దత ఇచ్చే దిశగా కేటాయింపులు జరపాలని నిర్ణయించింది. నూనెగింజలు, ఉద్యానవన పంటలు, సహజ వ్యవసాయంపై దృష్టి సారించే మిషన్ల ఏర్పాటు, బలోపేతం వంటి చర్యలు చేపట్టనుంది. ఇక కేటాయింపులలో మరింత పెరుగుదల, ముఖ్యంగా సాంకేతికత మరియు వాతావరణ అనుకూలత కోసం నిధులు పెంచే ఆలోచన చేస్తోంది. దీనికి తగినట్లుగా సమర్థవంతమైన వ్యయం, డిజిటల్ వ్యవసాయ మిష్లకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించడంపై ప్రాధాన్యత ఇవ్వనుంది.

202627 సంవత్సరానికి (సాధారణంగా ఫిబ్రవరి 2026 లో) ఆర్థిక మంత్రి పూర్తి కేంద్ర బడ్జెట్‌ను సమర్పించినప్పుడు మీకు ఖచ్చితమైన గణాంకాలు మరియు పథకాలు లభిస్తాయి . రాబోయే 202627 కేంద్ర బడ్జెట్ కోసం, వ్యవసాయ రంగం అంచనాలలో పరిశోధనలకు నిధుల పెంపు, పంటల బీమా వ్యవస్థ యొక్క సమగ్ర మార్పు మరియు విలువజోడింపు మౌలిక సదుపాయాలకు మద్దతు ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారవర్గాలు చెబుతున్నాయి.

# నుమాయిష్-2026 ప్రారంభోత్సవానికి రండి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానించిన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు**

**జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు నుమాయిష్-2026**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** జనవరి 1 నుంచి ప్రారంభం కానున్న నుమాయిష్-2026 ప్రారంభోత్సవానికి రావాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు ఆహ్వానించారు. జనవరి 1 నుండి ఫిబ్రవరి 15 వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ఎగ్జిబిషన్(నుమాయిష్) ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాల్సిందిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ని ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతినిధులు ఆదివారం ఆహ్వానించారు.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేయనున్న నుమాయిష్-2026 (85వ అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన) జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు జరగనున్నాయి. నుమాయిష్‌ను జనవరి 1న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఎగ్జిబిషన్‌లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు స్టాళ్లు ఏర్పాటు చేయనున్నాయి.

ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు, శని, ఆదివారాల్లో రాత్రి 11 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ప్రవేశ రుసుమును రూ.50 ఉండగా ఐదేళ్లలోపు పిల్లలకు ఉచిత ప్రవేశం కల్పించనున్నారు.

# సంక్షేమ పథకాల నుంచి కుట్రపూరితంగా గాంధీ పేరు తొలగింపు

**నాడు బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిందెవరు? నేడు అనాలోచితంగా కీర్తించబడుతున్నదెవరు?**

**సిపిఐ జాతీయ నేత నారాయణ**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపీ నేతలు జాతి పిత మహాత్మాగాంధీ పేరును సంక్షేమ పథకాల నుంచి కుట్రపూరితంగా తొలగిస్తున్నారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ అధ్యక్షులు డాక్టర్ కె నారాయణ విమర్శించారు. అహింస, లౌకికత్వం, సామాజిక న్యాయం వంటి గాంధీయ విలువలను బలహీనపరుస్తూ, స్వాతంత్ర్య పోరాటానికి దూరంగా ఉండి, ఆ పోరాటాన్ని వ్యతిరేకించిన శక్తులు నేడు తమకు అనుకూలంగా చరిత్రను వక్రీకరిస్తూ తిరగరాయడం దురదృష్టకరమని, ఇది భారతదేశ ప్రతిష్టకు అవమానకరమన్నారు. నాడు బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిందెవరు? నేడు అనాలోచితంగా కీర్తించబడుతున్నదెవరని ప్రశ్నించారు. భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. అది కోట్లాది మంది స్వాతంత్ర్య సమరయోధులు చేసిన దశాబ్దాల త్యాగపోరాట ఫలితం. ఈ పోరాటానికి నాయకత్వం వహించినవారు జాతిపిత మహాత్మా గాంధీ. కానీ కొందరు చెబుతున్న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 1924 డిసెంబర్ 25న జన్మించారు. స్వాతంత్రం వచ్చినప్పుడు ఆయన వయస్సు 22 సంవత్సరాలు మాత్రమేనని, క్విట్ ఇండియా ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం వంటి ఏ ప్రధాన బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమాల్లోనూ ఆయన పాల్గొన్నట్లు ఎటువంటి చారిత్రక ఆధారాలు లేవన్నారు. అయినప్పటికీ నేడు దేశమంతటా వాజ్ పేయి విగ్రహాలు ఏర్పాటు చేయటం, రహదారులు, పలు సంస్థలు, ప్రజా స్థలాలు, పథకాల పేర్లలో మార్పులు చేయడం వంటి చర్యలను మనం చూస్తున్నామన్నారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత నాయకులుగా చలామణి అయిన వారిని స్వాతంత్ర్య సమరయోధులుగా చిత్రీకరించే దుస్థితి దాపురించిందన్నారు. అంతేకాకుండా మహాత్మా గాంధీ పేరును సంక్షేమ పథకాల నుంచి కుట్రపూరితంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. భారత దేశానికి స్వాతంత్రం ఎవరు దానం చేయలేదని, అనేక ప్రాణత్యాగాలతో సాధించ బడిందన్నారు . ప్రస్తుత రాజకీయ భావజాలాలకు అనుగుణంగా గత చరిత్రను మార్చాలనుకోవటం అవివేకమన్నారు. మహాత్మ గాంధీని కేవలం విగ్రహాలకు మాత్రమే పరిమితం చేసి, ఆయన ఆలోచనలను ఆచరణలో లేకుండా చూడాలన్నదే నేటి పాలకుల అనాలోచిత విధానంగా గోచరిస్తుందన్నారు.

# పేదలను దోచి అదానీ, అంబానీకి కట్టబెడుతున్న బిజెపి పాలకులు

**ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షుడు రోహిత్ ప్రమాణస్వీకారంలో మహేష్‌కుమార్‌గౌడ్**


**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** పేదలను దోచి ఆధాని, అంబానీలకు బిజెపి పాలకులు సంపదను కట్టబెడుతున్నారని బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.గాంధీ భవన్ లో ఆదివారం ఖైరతాబాద్ డిసిసిఅధ్యక్షులు మోతే రోహిత్ పదవీ బాధ్యతలు స్వీకరణ కార్యక్రమానికిముఖ్య అతిథిగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వాకాటి శ్రీహరి, ఎంపి అనిల్ యాదవ్, మాజీ ఎంపి వి. హనుమంతరావు, పూర్వ డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ఫిరోజ్ ఖాన్ కార్పోరేషన్ చైర్మన్‌లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా గాంధీ భవన్ కు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అమిత్ షా రాజ్యాంగానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారనీవాళ్ళ పదవి కాపాడుకోవడానికి ఎంతవరకైనా దిగజారీ పోతారని విమర్శించారు.రాష్ట్ర వాట కేంద్ర వాటా అని క్రమేణా మన్రేగా పథకాన్ని తీసివేయలని బిజెపి చూస్తుందని విమర్శించారు. బిజెపి పెత్తందారు పార్టీ అని బీద వాడి గోడు కేంద్రంలో ని బిజెపి ప్రభుత్వానికి పట్టట్లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద వాడి పార్టీ అనిస్వోత్కర్షలు చెప్పుకొన్నారు. కాంగ్రెస్ లో మనం ఉండటం మన అదృష్టం అని భాష్యం చెప్పారు. రేవంత్‌రెడ్డి విజన్ ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడానికి తపన పడుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఆకాంక్ష మేరకు రేవంత్ రెడ్డి కుల సర్వే చేశారని గుర్తుచేశారు. మోడీ జనగణన చేస్తా అనడానికి ప్రేరణ రేవంత్‌రెడ్డి మాత్రమే అని ఆ ఘనత రేవంత్ రెడ్డిది అని కొనియాడారు. రానున్న రోజుల్లో బిజెపి విధానాలు ఎండగడుతూ రాహుల్ గాంధీని ప్రధానిని చేయడానికి అందరం కష్టపడి పని చేద్దామని పిలుపునిచ్చారు.

# టిడిపి నేత సాయిబాబా ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి తీరనిలోటు

**పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్**

**హైదకాబాద్ (ముషీరాబాద్), డిసెంబరు 28, ప్రభాతవార్త:** టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ పి.సాయిబాబా ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ఆపార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు ఎం.అరవింద్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సాయిబాబా సంతాప కార్యక్రమం ఏర్పాటుచేసి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా అరవింద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశంకు విశేష సేవలు అందించిన సాయిబాబా శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో హఠాత్తుగా మరణించటం విచారకరమని అన్నారు. తెలుగుదేశం పార్టీలో సాయిబాబా ఒక కీలకమైన వ్యక్తి అని, తెలుగదేశం పార్టీ స్థాపనకు ముందే ఎన్టీఆర్ వీరాభిమానిగా ఉండి, ఎన్టీఆర్ అభిమాన సంఘాలను ఒక సమాఖ్యగా చేసి, తద్వారా ప్రజలకు చేరువయ్యే విధానాలతో ముందుకు నడిపి, ఎన్టీఆర్ దత్తపుత్రుడిగా పేరుతెచ్చుకున్నారని గుర్తు చేశారు. తెలుగుదేశం కార్యకర్తగా, రాజకీయంగా ఆరోజుల్లో నేషనల్ ఫ్రంట్ యూత్ కోఆర్డినేటర్‌గా సేవలు అందించటమే కాకుండా వికలాంగుల సంక్షేమ సంస్థ కార్పోరేషన్ ఛైర్మన్‌గా రెండు పర్యాయాలు, లేపాక్షి హస్తకళల సంస్థ ఛైర్మన్‌గా ఒకసారి, రాష్ట్ర గ్రంధాలయాల ఛైర్మన్‌గా కూడా పనిచేశారని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను దూరదృష్టితో యువతలోకి బలంగా తీసుకెళ్లడంలో అద్భుత సామర్థ్యం కలిగిఉన్నారని కొనియాడారు. తెలుగుదేశం ఉమ్మడి రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షులుగా అనేక పర్యాయాలు నిర్వహించారని, పార్టీ ఎన్నికల సభలు, సమావేశాలే కాకుండా బహిరంగ సభల్లో, బజాత్ స్థాయిలో నగా పనిచేశారని గుర్తు చేశారు. బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేసేవారని, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయటానికి, తెలుగుదేశం పథకాలను సమర్ధ వంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లటానికి సాయి బాబా నిస్వార్ధంగా కృషి చేశారని అన్నారు. ఈ సంతాప కార్యక్రమంలో టీడీపీ నేతలు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ నాగు నగేష్, ఎస్.ప్రకాష్, చంద్రమోహన్ గౌడ్, శ్యాంసుందర్, బాలాజీగోస్వామి, సిహెచ్. విజయశ్రీ, భానుప్రకాష్, సత్యనారాయణ, ఎండి సలీం, టి.అనిల్, భవాని, శ్రీనివాస్, శ్రీకాంత్, జోగింధర్‌సింగ్, బి.రాజు, రవి, శక్తిప్రేమ్, సుక్రవేది, జగదీష్‌గౌడ్, సత్తన్న, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయంకు సాయిబాబా పార్థీవదేహం: తెలుగుదేశం పార్టీకి నిస్వార్ధంగా సేవలు అందించిన సాయిబాబా పార్ధీవ దేహాన్ని సోమవారం ఉదయం 9.30 నిమిషాలకు దోమలగూడలోని పార్టీ కార్యాలయంకు తీసుకువస్తారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సాయిబాబా పార్ధీవ దేహానికి నివాళులర్పించిన అనంతరం అంబర్‌పేటలోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తారని టీడీపీ నేతలు తెలిపారు.



సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

## ఎంపిక చేయబడిన డిఇఒలు, ఎంఇఒలు, జెహెచ్‌ఎంలతో టిఇపిపై నేడు మీటింగ్

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రత్యేకంగా ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ-2025 పేరుతో కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ ఇప్పటికే పలువురు విద్యావేత్తలు, విద్యారంగ నిపుణులతో సమావేశం ఏర్పాటు చేసి వివరాలను సేకరించింది. అందులో భాగంగా త్వరలోనే ఎడ్యుకేషన్ పాలసీని రూపొందించాలని భావిస్తున్న కమిటీ.. నేడు(సోమవారం) మల్టీజోన్-1, 2లో కొందరు ఎంపిక చేయబడిన డీఈవోలు, ఎంఈవోలు, జీహెచ్‌ఎంలు, ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలతోపాటు ఎస్ఏలు, ఎస్‌జిటిలు, పీఈటీలు, పీడీలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు సేకరించాలని భావించింది. అందులో భాగంగా సోమవారం మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సమావేశాన్ని నిర్వహించాలని తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ-2025 కమిటీ ఛైర్మన్ కె కేశవరావు నిర్ణయించారు. సమావేశంలో మల్టీజోన్-1 నుంచి 12 మందిని, మల్టీజోన్-2 నుంచి 12 మందిని ఎంపిక చేసి వారితో ప్రత్యేకంగా మాట్లాడనున్నారు. వారి నుంచి వివరాలను సేకరించనున్నారు. ఆ తరువాత మరో రెండు, మూడు సమావేశాలను ఇదేమాదిరిగా నిర్వహించిన అనంతరం తెలంగాణ విద్యా విధానాన్ని ఫైనల్ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.



ఖైరతాబాద్ కూడలిలో పిజెఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్, విజయారెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తదితరులు.

## పిజెఆర్‌కు కాంగ్రెస్ పార్టీ ఘననివాళులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), డిసెంబరు 28, ప్రభాతవార్త:** దివంగత సీఎల్పీ నాయకులు పీజేఆర్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘణ నివాళులు అర్పించారు. పీజేఆర్ 18వ వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పీజేఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇక ఖైరతాబాద్ కూడలిలోని పీఆజేఆర్ విగ్రహం వద్ద టీపీసీసీ కార్యదర్శి, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, పీజేఆర్ కుమార్తె పి. విజయారెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యులు అనీల్‌కుమార్‌యాదవ్, జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ వల్లాల, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, పలు సంస్థల ఛైర్మన్లు నూతి శ్రీకాంత్, కాల్వ సుజాత, కాంగ్రెస్ నేతలు ఫిరోజ్‌ఖాన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటస్వామిలతోపాటు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. - ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్‌లోని చందానగర్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని కార్పొరేటర్ విజయారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు. - ఖైరతాబాద్ డివిజన్‌లోని బడా గణేష్ కూడలిలో మాజీ సీఎల్పీ దివంగత పీజేఆర్ విగ్రహానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్, కార్పొరేటర్ విజయారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రయోజనాల కోసం రాజీపడని నేత పిజెఆర్

**గాంధీభవన్‌లో పిసిసి చీఫ్ మహేష్‌కుమార్, మంత్రి వివేక్ నివాళులు**

**హైదరాబాద్, డిసెంబరు 28, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రయోజనాలకోసం రాజీపడని నేత పిజెఆర్ అని పోతిరెడ్డిపాడు నుంచి నీటిని తరలించడాన్ని వ్యతిరేకించారని నేరుగా ఆనాటి ముఖ్యమంత్రివైఎస్ రాజశేఖర్‌రెడ్డితో తెలంగాణ ప్రయోజనాలకోసం విభేదించారని టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి వివేక్ అన్నారు. గాంధీభవన్‌లో దివంగత నేత పి జనార్దన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పిజెఆర్ చిత్రపటంకు పూలమాల వేసి మంత్రి వివేక్ వెంకటస్వామి,మహేష్‌కుమార్‌లు నివాళ్ళు అర్పించారు. పిజెఆర్ ప్రజా నాయకుడని, పేదల కోసం నిరంతరం అందుబాటులో ఉండి వారి కోసం పని చేసే గొప్ప నాయకుడని వివేక్ గుర్తు చేసుకున్నారు.

29-12Pg5 9_29-12Pg5.qxd 28/Dec/25 10:38 PM Page 1



# దేశ భద్రతలో రాజీ లేదు



'ఆపరేషన్ సిందూర్'తో ప్రపంచానికి చాటిచెప్పాం

ప్రగతి సంవత్సరంగా నిలిచిన 2025

దేశ భవిష్యత్తుకు యువతే ప్రధాన బలం

యువశక్తితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యం

మన్‌కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

నరసాపురం అల్లికలు ప్రత్యేకంగా ప్రస్తావన



**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** దేశ భద్రత విషయంలో ఎలాంటి రాజీపడబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. 'మన్‌కీ బాత్'129వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారు. ఇందులో భాగంగా 2025లో భారతదేశం సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ ప్రపంచ దేశాలకు తన బలాన్ని చూపించిందని చెప్పారు. దేశంలోని ప్రతిపౌరుడికి ఈ ఆపరేషన్ గర్వకారణంగా మారిందన్నారు. ముఖ్యంగా ఆపరేషన్ సిందూర్‌ను మారుతున్న భారతావనిగా అభివర్ణించి, సైనిక విజయాన్ని దేశవ్యాప్త దేశభక్తిని పెంచిన ఘటనగా ప్రధాని ప్రశంసించారు. ఈ ఏడాది భారత్.. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా చూపిన ధైర్యం, స్వదేశీ ఆయుధాలు, టెక్నాలజీ ఉపయోగం ద్వారా సాధించిన విజయాలను మోడీ ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశం ఉగ్రవాదాన్ని రూపుమాపే నిర్ణయాన్ని చాటిందని, ఇది కేవలం సైనిక చర్య కాదు.. మారుతున్న భారత్ బలాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. నేటి భారత్ భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడబోదని ప్రపంచానికి స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చిందని అన్నారు. అంతేకాకుండా, గిర్ అడవుల్లో ఆసియాటిక్ సింహాల సంఖ్య పెరుగుదల, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, మహిళా సాధికారత వంటి అంశాలను కూడా ప్రధాని ప్రస్తావించారు. 2025 సంవత్సరం అన్ని రంగాల్లో భారత్ గణనీయమైన ప్రగతిని సాధించిన సంవత్సరంగా నిలిచిందని ప్రధాని తెలిపారు. దేశ భవిష్యత్తుకు యువతే ప్రధాన బలమని, యువశక్తితోనే వికసిత్ భారత్ లక్ష్యం సాధ్యమని పేర్కొన్నారు. స్టార్టప్‌లు, వ్యవసాయం, ఫిట్‌నెస్ వంటి రంగాల్లో యువత వినూత్న ఆవిష్కరణలతో ముందుకు వస్తోందని, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న సరికొత్త టెక్నాలజీ, ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని సూచించారు. క్రీడల్లో కూడా ఈ ఏడాది భారత్ గణనీయమైన విజయాలు సాధించిందని తెలిపారు. నూతన సంకల్పాలు, స్పష్టమైన లక్ష్యాలతో 2026లోకి అడుగుపెడుతున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్:2026 జనవరి 12న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ రెండో ఎడిషన్ జరగనున్నదని ప్రధాని తెలిపారు. యువత తమ ఆలోచనలు, అభిప్రాయాలను ఎలా పంచుకోవాలో సూచించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని, ఇందులో ప్రధాన మంత్రి స్వయంగా పాల్గొననున్నట్లు వివరించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ వంటి కార్యక్రమాలు యువత ఆలోచనలను ఆచరణలోకి తేవడానికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఐఎన్‌సీకి చెందిన గీతాంజలి, దుబాయ్‌లోని కన్నడ పాఠశాల, జమ్మూ-కాశ్మీర్ సాంస్కృతిక వారసత్వంవంటి అనేక ప్రేరణాత్మక ఉదాహరణలను ప్రధాని ప్రస్తావించారు. వందేమాతరం గేయం 150 ఏళ్ల పూర్తి చేసుకున్నప్పుడు కూడా దేశ ప్రజల్లో ఇదే స్ఫూర్తి కనిపించిందని ప్రధాని చెప్పారు. క్రీడారంగంలో కూడా ఈ ఏడాది విస్మరణీయమని మోదీ అన్నారు. 12 ఏళ్ల తర్వాత టీమిండియా పురుషుల క్రికెట్ జట్టు ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని సొంతం చేసుకుందని, మహిళల క్రికెట్ జట్టు మొదటిసారి వన్డే ప్రపంచకప్ గెలుచుకుందని తెలిపారు. మహిళల అంధుల జట్టు టీ20 ప్రపంచ కప్పు గెలుచుకొని చరిత్ర సృష్టించిందని గుర్తుచేశారు. అంతరిక్ష రంగంలోనూ ఈ ఏడాది భారత్ తన ప్రతిభను చాటుకుందని ప్రధాని అన్నారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించిన శుభాన్షు శుక్లాను ఆయన ప్రశంసించారు. మహా కుంభమేళాకు కోట్లాదిమంది తరలివచ్చారని, ఆ సంఖ్యను చూసి ప్రపంచం ఆశ్చర్యపోయిందని ప్రధాని తెలిపారు. అయోధ్య రామాలయంలో జరిగిన ధ్వజారోహణ కార్యక్రమం ప్రతి హిందువు గర్వపడేలా చేసిందని చెప్పారు. ఈ ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలను గుర్తుచేశారు. దేశ ప్రజలు స్వదేశీ ఉత్పత్తుల పట్ల గొప్ప ఉత్సాహాన్ని చూపిస్తున్నారని, వోకల్ ఫర్ లోకల్‌ను మరింత బలోపేతం చేయాలని, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగంలో శుభాంశు శుక్లా సాధించిన విజయాలతో దేశకీర్తి మరింత పెరిగిందని కొనియాడారు. భారతీయ భాషల ప్రోత్సాహానికి ప్రత్యేకంగా తమిళ భాషకు కాశీ తమిళ సంగమం వంటి కార్యక్రమాల ద్వారా జరుగుతున్న కృషిని ప్రధాని ప్రశంసించారు. స్వాతంత్ర్య సమరయోధులు వర్ధంతి నివాళి అర్పించారు. యాంటీబయాటిక్స్ దుర్వినియోగంపై ప్రజలను అప్రమత్తం చేస్తూ, ఆరోగ్యంపై జాగ్రత్త అవసరమని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌లోని నరసాపురం లేస్ కళాకారులను అభినందించగా, కచ్ వైట్ రణ్ భారతదేశ సహజ సౌందర్యానికి ప్రతీకగా పేర్కొన్నారు. ప్రజలకృషి, ప్రేరణాత్మక కథలతో భారత్ 2026లో మరింత ఉత్సాహంగా అడుగుపెడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. 2025లో దేశ ప్రజలు ఏ విధంగా ఐక్యతతో సామరస్యంగా ఉన్నారో అదేవిధంగా కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాలని పిలుపునిచ్చారు. నూతన సంవత్సరంలో దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు.

## ఖాప్ పంచాయతీ కఠిన నిర్ణయాలు

18యేళ్లలోపు వారికి స్మార్ట్‌ఫోన్ నిషేధం

యువతీయువకులు బయటకు వస్తే షార్టులు, హాఫ్ పాంట్లు నిషేధం

సామాజిక బాధ్యతలు గుర్తుచేస్తున్న గ్రామపెద్దలు



**భాగ్‌పట్,(యుపి), డిసెంబరు 28:** సామాజిక విలువల పరిరక్షణ పేరుతో ఉత్తరప్రదేశ్‌లోని బాగ్‌పత్ జిల్లాకు చెందిన థాంబా పట్టి మెహర్ దేశ్ ఖాప్ పంచాయతీ పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. యువత దారి తప్పుతోందని, క్రమశిక్షణ లోపిస్తోందని భావించిన ఖాప్ నేతలు విద్యార్థులు, యువత జీవనశైలిపై కఠిన ఆంక్షలు విధించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు స్మార్ట్‌ఫోన్లు వాడటం వల్ల చదువుపై శ్రద్ధ తగ్గడమే కాకుండా పెద్దల పట్ల అవిధేయత పెరుగుతోందని ఖాప్ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. టీనేజర్లకు మొబైల్ ఫోన్లను నిషేధించారు. బహిరంగ ప్రదేశాల్లో అబ్బాయిలు హాఫ్ ప్యాంట్లు, అమ్మాయిలు షార్ట్స్ ధరించకూడదని ఆదేశించారు. అబ్బాయిలు కుర్తాపైజమా, అమ్మాయిలు సల్వార్‌కమీజ్ వంటి సంప్రదాయ దుస్తులే ధరించాలని సూచించారు. ఇంట్లో ఎలాంటి దుస్తులైనా వేసుకోవచ్చని, కానీ బయటకు వచ్చేటప్పుడు మాత్రం సామాజిక నిబంధనలు పాటించాలని హుకుం జారీ చేశారు. కేవలం యువతపైనే కాకుండా వివాహ వేడుకల విషయంలోనూ ఖాప్ పంచాయతీ కీలక మార్పులు సూచించింది. వివాహాలు మ్యారేజ్ హాళ్లలో కాకుండా గ్రామాల్లో లేదా సొంత నివాసాల్లోనే జరుపుకోవాలని పేర్కొంది. మ్యారేజ్ హాల్ కల్చర్ వల్ల కుటుంబ బంధాలు బలహీనపడుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు. పెళ్లి పత్రికల ముద్రణ ఖర్చును తగ్గించేందుకు వాట్సాప్ ద్వారా ఆహ్వానాలు పంపడం ఉత్తమమని స్పష్టం చేశారు. ఖాప్ పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయాలకు రాజకీయ నాయకుల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత చౌదరి యశ్‌పాల్ సింగ్, ఆర్‌ఎల్‌డీ ఎంపీ రాజ్‌కుమార్ సాంగ్వాన్ ఈ నిర్ణయాలను సమర్థించారు. సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడేందుకు ఇటువంటి నిర్ణయాలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. ఈ నియమాలను ఉత్తరప్రదేశ్ అంతటా అమలు చేసేందుకు ఇతర ఖాప్ కౌన్సిళ్లతో కూడా చర్చలు జరుపుతామని ఖాప్ ప్రతినిధులు తెలిపారు.

## పెళ్లికాకుండానే గర్భం దాలిస్తే రూ.38 వేలు జరిమానా

చైనాలోని యునాన్ గ్రామపెద్దల కఠిన కార్యాచరణ



**యునాన్(చైనా)డిసెంబరు 28:** నగరాలలో నాగరికత పేరుతో సహజీవనం, వివాహానికి ముందే గర్భం దాల్చడం, ప్రేమ పెళ్లిళ్ల సాధారణంగా మారిపోయాయి. ఇలాంటి వ్యవహారాలను తమ గ్రామంలోకి అడుగుపెట్టకుండా చేసేందుకు చైనాలోని యునాన్ రాష్ట్రం లిన్ కాంగ్ జిల్లాలో ఓ గ్రామస్థులు కఠినమైన నిబంధనలను పెట్టుకున్నారు. సామాజిక బాధ్యతలను గుర్తుచేస్తూ గ్రామపెద్దలు కఠిన కార్యాచరణ అమలుచేసేందుకు నడుం బిగించారు. ఈమేరకు గ్రామ పెద్దలు ఓ తీర్మానం చేసి కొన్ని రూల్స్ నిర్ణయించారు. గ్రామంలో ఎవరైనా వివాహం కాకుండా కలిసి ఉంటే ఏటా 500 యువాన్లు భారత కరెన్సీలో సుమారు రూ.6 వేలు జరిమానాగా చెల్లించాలని నిర్ణయించారు. అదేవిధంగా, పెళ్లి కాకుండానే గర్భం దాల్చిన యువతి 3,000 యువాన్లు అంటే రూ.38,472, పెళ్లి అయిన తర్వాత 10 నెలల లోపే బిడ్డకు జన్మనిచ్చినా ఇంతే మొత్తం ఫైన్ కట్టాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తిని వివాహం చేసుకుంటే 1,500 యువాన్లు మన కరెన్సీలో సుమారు రూ.19 వేలు, దంపతులు గొడవపడి గ్రామ పెద్దల వద్దకు వస్తే ఇద్దరూ చెరో 500 యువాన్లు సుమారు రూ.6 వేలు, మద్యం సేవించి గ్రామంలో గొడవ చేస్తే 3 వేల నుంచి 5వేలయువాన్లు రూ.8,472 నుంచి రూ.64,120, నిరాధార ఆరోపణలు, పుకార్లు సృష్టిస్తే 500 నుంచి 1,000 యువాన్లు రూ.6,412 నుంచి రూ.12,824 జరిమానా చెల్లించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఓబోర్డును తయారు చేసి గ్రామంలోని కార్యాలయం ముందు ఏర్పాటు చేశారు. సంప్రదాయ కుటుంబ విలువలు, నైతికతను కాపాడాలనే ఉద్దేశంతో ఈ నియమాలు అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఇందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వెంటనే ఆ బోర్డును తొలగించారు.

## వేధిస్తున్న బిజెపి నేతకు పోలీసులు చెక్



**భోపాల్, డిసెంబరు 28:** అత్యాచారానికి పాల్పడటమే కాకుండా, బాధితురాలిని బెదిరించాడో నాయకుడు. ఫిర్యాదు చేసినా తనను ఎవరూ ఏమీ చేయలేరని ధీమా వ్యక్తం చేశాడు. మధ్యప్రదేశ్ లోని సత్నా జిల్లాలో ఈ దారుణం చోటుచేసుకుంది. అత్యాచారం చేస్తూ వీడియోలు తీసి నెలల తరబడి వేధింపులకు గురిచేశాడంటూ బాధితురాలు కన్నీళ్లతో న్యాయం చేయాలని వేడుకుంటోంది. తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ నిందితుడు విర్రవీగుతున్న వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సత్నా జిల్లా రాంపూర్ బాఘేలన్ నగర్ పరిషత్ కౌన్సిలర్ భర్త అశోక్ సింగ్ అధికార బిజెపికి చెందిన స్థానిక నాయకుడు. ఆరు నెలల క్రితం అశోక్ సింగ్ ఓ మహిళ ఇంట్లోకి చొరబడి, కత్తితో బెదిరించి ఆమెపై అత్యాచారం చేశాడు. ఆ దృశ్యాలను తన మొబైల్‌లో రికార్డు చేశాడు. అత్యాచారం చేసిన విషయాన్ని బయటకు చెబితే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. ఆమెతో పాటు ఆమె కుటుంబం మొత్తాన్నీ అంతమొందిస్తానని హెచ్చరించాడు. భయంతో బాధితురాలు మౌనంగా ఉండడాన్ని అలుసుగా తీసుకున్న అశోక్ సింగ్ ఆ తర్వాత కూడా వేధింపులకు గురిచేశాడు. ఈ నెల 20న మరోసారి బాధితురాలిని వేధిస్తూ తాను చెప్పినట్లు వినకపోతే వీడియోను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. దీంతో అశోక్ సింగ్‌ను బాధితురాలు నిలదీసింది. వీడియో రికార్డు చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పగా అశోక్ సింగ్ అహంకారంతో మాట్లాడాడు. ఎవరికి ఫిర్యాదు చేసినా తనకేమీ కాదని ధీమా వ్యక్తంచేశాడు. తనను అడిగే వారు లేరని విర్రవీగడం వీడియోలో కనిపిస్తోంది. నీ ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకో పోలీసులే కాదు ఎవరూ నన్నేమీ చేయలేరు. నాకేం కాదు అంటూ బాధితురాలిని హేళన చేశాడు. బాధిత మహిళ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేస్తూ అశోక్ సింగ్ నుంచి తనను కాపాడాలని, అతడికి తగిన శిక్ష పడాలని విజ్ఞప్తి చేసింది. ఈ వీడియో చూసిన స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అశోక్ సింగ్‌కు నేరచరిత్ర ఉందని, అయినా అధికార పార్టీ అండతో అతడు యథేచ్ఛగా తిరుగుతున్నాడని ఆరోపించింది. ఐదు రోజుల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేసినా సరైన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. నిందితుడి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణాపాయం ఉందని తమకు ఏమైనా జరిగితే పోలీసులదే బాధ్యతని ఆమె హెచ్చరించింది. బాధితురాలి వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో పోలీసులు సీరియస్‌గా స్పందించారు. నిందితుడు అశోక్ సింగ్ పై కేసు నమోదు చేశారు. దీనిపై సత్నా ఎస్పీ హంసరాజ్ సింగ్ స్పందిస్తూ డిప్యూటీ ఎస్పీ మనోజ్ త్రివేది ఆధ్వర్యంలో ఈ కేసు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. నిందితుడిని న్యాయస్థానం ముందు నిలబెడతామని, చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చూస్తామని చెప్పారు.

## పుణే మున్సిపల్‌ఎన్నికల్లో గ్యాంగ్‌స్టర్

పోలీస్ బందోబస్తుతో వచ్చి నామినేషన్



**పూణె, డిసెంబరు 28:** పుణెలో జరగనున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు చర్చనీయాంశంగా మారాయి. స్థానిక గ్యాంగ్‌స్టర్, మనవడి హత్య కేసులో ప్రధాన నిందితుడైన బందు అందేకర్ శనివారం నామినేషన్ దాఖలు చేశాడు. ప్రస్తుతం ఎరవాడ సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అతడు భారీ పోలీసు భద్రత నడుమ ప్రభుత్వ కార్యాలయానికి చేరుకున్నాడు. పోలీసు వ్యాన్‌లో వచ్చిన బందు అందేకర్ చేతులకు తాళ్లు కట్టి ఉండగా, ముఖానికి నల్లటి గుడ్డ కప్పి ఉంది. భవానీ పేటలోని నామినేషన్ కేంద్రానికి తీసుకురాగానే పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ లోపలికి వెళ్లాడు. మనవడు ఆయుష్ కోమ్కర్ హత్య కేసులో అందేకర్ ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రత్యేక కోర్టు అనుమతి ఇవ్వడంతో స్వతంత్ర అభ్యర్థిగా రంగంలోకి దిగాడు. అందేకర్ మాత్రమే కాకుండా, ఇదే కేసులో నిందితులుగా ఉన్న అతడి సోదరుడి భార్య లక్ష్మి అందేకర్, కోడలు సోనాలి అందేకర్ కూడా కోర్టు అనుమతితో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. పుణె మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు మరో 28 సంస్థలకు జనవరి 15న ఎన్నికలు జరగనున్నాయి. మాజీ కార్పొరేటర్, బందు అందేకర్ కుమారుడు వనరాజ్ అందేకర్ గతంలో హత్యకు గురయ్యాడు. దీనికి ప్రతీకారంగానే మనవడు ఆయుష్ కోమ్కర్‌ను సెప్టెంబర్ 5న కాల్చి చంపినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ దారుణ హత్య వెనుక అందేకర్ గ్యాంగ్ ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

## హమాస్ నిరాయుధీకరణను ఒప్పకోం

అమెరికా ప్రణాళికలో పాక్ మెలిక



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** గాజాలో ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్‌లో భాగంగా తమ దళాలను పంపించడానికి సానుకూలంగా స్పందించిన పాక్ ఇందుకు ఓ మెలిక పెట్టింది. అమెరికా ప్రతిపాదిత 20 అంశాల ప్లాన్‌లో హమాస్‌ను నిరాయుధీకరించాలన్న పాయింట్‌ను తొలగించినప్పుడే తాము భాగమవుతామంది. ఈ మేరకు పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్టెబిలైజేషన్ ఫోర్స్ (ఐఎస్ఎఫ్)లో తమ దేశం భాగం కావడం చాలా సున్నితమైన అంశంగా అభివర్ణించారు. శాంతిని పరిరక్షించే దళంగానే పాకిస్థాన్ కొనసాగుతుందన్నారు. 'మమ్మల్ని శాంతి నెలకొల్పే చర్యలు లేదా హమాస్ నిరాయుధీకరణలో భాగంగా చేయకుండా కేవలం శాంతి పరిరక్షణ చేసేందుకు అయితే ఆ దళంలో సంతోషంగా భాగం అవుతాం. శాంతిని కొనసాగించడంలో మా పాత్ర చాలా పరిమితం' అని పేర్కొన్నారు. అమెరికా ప్రతిపాదిత శాంతి ప్రణాళిక రెండో దశలో హమాస్‌ను నిరాయుధీకర చేయడమే ప్రధాన అంశంగా ఉంది. గాజాలో శాంతి స్థాపించడంలో ఇదే ముఖ్యమైన దశగా అమెరికా విశ్వసిస్తోంది. ఇటీవల అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మాట్లాడుతూ గాజాకు బలగాలు పంపుతామని పాకిస్థాన్ ఆఫర్ చేసినట్లు పేర్కొన్నారు దీంతోపాటు పలు దేశాలు కూడా దీనిలో భాగం అయ్యేందుకు ఆసక్తిగా ఉన్నట్లు చెప్పారు.

## 1 నుంచి గుజరాత్‌లో అంతర్జాతీయ పుష్పప్రదర్శన



**అహ్మదాబాద్, డిసెంబరు 28:** కొత్తసంవత్సరం జనవరి మొదటితేదీనుంచీ గుజరాత్‌లోని అహ్మదాబాద్ రివర్‌ఫ్రంట్ వెంబడి అంతర్జాతీయ పుష్పాల ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. రకరకాల పూలతో ఈ నెలరోజులు సందర్శకులను ఆకర్షించేదిశగా గుజరాత్‌లో ప్రతి ఏటా ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఉదయంనుంచి సాయంత్రంవరకూ ఈ ప్రదర్శననిర్వహిస్తారు. అహ్మదాబాద్ మున్సిపల్‌కార్పొరేషన్ ఈ ఎగ్జిబిషన్ నిర్వహణను పర్యవేక్షిస్తోంది. సబర్మతి రివర్‌ఫ్రంట్‌వద్ద ఎల్లిస్‌బ్రిడ్జ్, సర్దార్ బ్రిడ్జిల మధ్యలో ఈ పూల ఎగ్జిబిషన్ నిర్వహిస్తారు. ఆటో, క్యాబ్, సిటీబస్సులకు సైతం ఈ ప్రాంతం అనువుగా ఉంటుంది. ప్రపంచంలోని వివిధ రకాల పూలమొక్కలు, పుష్పాలతోపాటు వివిధ జంతువులు, పక్షుల రూపంలో అలంకరించిన పుష్పాలు, గార్డెనింగ్ వంటివి సందర్శకులను కనువిందుచేస్తాయి. ప్రకృతి ప్రేమి కులకు ఈ ఫ్లవర్‌షో వీనుల విందుచేస్తుందని నిర్వాహకులు చెపుతున్నారు.

## దౌత్యం విఫలమైతే ఇక ఉక్రెయిన్‌పై సైనిక చర్యలే..



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ హెచ్చరిక

**మాస్కో, డిసెంబరు 28:** ఉక్రెయిన్‌పాలకులకు శాంతియుత మార్గంలో వివాదాన్ని పరిష్కరించుకోవడం ఇష్టం లేదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమర్శించారు. ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ దౌత్యం విఫలమైతే ప్రత్యేక సైనిక చర్య తప్పదని, లక్ష్యాలన్నింటినీ బలప్రయోగం ద్వారానే సాధిస్తామని హెచ్చరించారు. పుతిన్ ఈ వ్యాఖ్యలు చేస్తున్న సమయంలోనే రష్యా దళాలు ఉక్రెయిన్‌పై కనీవినీ ఎరుగని రీతిలో దాడులకు తెగబడ్డాయి. రాత్రంతా జరిగిన ఈ దాడుల్లో సుమారు 500 డ్రోన్లు, 40 క్షిపణులను రష్యా ప్రయోగించింది. ఈ భీకర దాడిలో ఒకరు మృతి చెందగా, 27 మంది గాయపడ్డారు. రష్యాకు యుద్ధం ఆపే ఉద్దేశంలేదనడానికి ఈ 10 గంటల విధ్వంసమే నిదర్శనమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగేళ్లుగా సాగుతున్న ఈ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలను వెతకడానికి జెలెన్‌స్కీ నేడు అమెరికాలో డొనాల్డ్ ట్రంప్‌తో భేటీ కానున్నారు. ఫ్లోరిడాలో జరగనున్న ఈ సమావేశంలో భద్రతా హామీలు, వివాదాస్పద ప్రాంతాలపై చర్చించనున్నారు. ట్రంప్‌తో భేటీకి ముందు కెనడా చేరుకున్న జెలెన్‌స్కీ శాంతి స్థాపన కోసం తాము చేస్తున్న ప్రయత్నాలకు రష్యా అడ్డు తగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌పై రష్యా జరుపుతున్న దాడులను కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా ఖండించారు. ఈ దాడులను ఆయన అమానవీయమైనవిగా అభివర్ణించారు. శాంతి స్థాపన జరగాలంటే రష్యా సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ఉక్రెయిన్ పునర్నిర్మాణం కోసం కెనడా ప్రభుత్వం 2.5 బిలియన్ కెనడియన్ డాలర్ల సుమారు 1.82 బిలియన్ యూఎస్ డాలర్లు భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించింది.


## పాక్‌తో అమెరికా 'ఖనిజ' బంధం

యుఎస్ లోకోమోటివ్‌లను కొనుగోలు చేయనున్న పాక్



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** అమెరికా-పాకిస్థాన్ వాణిజ్య బంధం మరింత బలపడుతోంది. ఈ క్రమంలో అమెరికా తన లోకోమోటివ్ రైళ్లను పాక్‌కు విక్రయించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతోపాటు పాకిస్థాన్‌లో అరుదైన ఖనిజాల అన్వేషణకు కూడా సమష్టిగా కృషి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పాక్ పత్రిక ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ తన కథనంలో పేర్కొంది. ఈ యేడాది అక్టోబరులో పాక్ ఆర్థికమంత్రిమహమ్మద్ ఔరంగజేబు వాషింగ్టన్‌ను సందర్శించినప్పుడు వీటిపై చర్చలు మొదలయ్యాయి. ఆ తర్వాత నుంచి అమెరికాక ప్రయోజనాలు కల్పించేలా పాక్ అధికారులు చర్చలు చేపట్టారు. అధ్యక్షుడు ట్రంప్‌నకు సలహాదారు అయిన రేమాండ్ ఎమోరి కాక్స్, అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల విషయంలో సలహాదారు అయిన రికీ గిల్ స్వయంగా పాక్‌తో చర్చలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో అమెరికా తయారీ లోకోమోటివ్‌లను పాక్ కొనుగోలు చేయాలని గిల్ కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటికే పాక్ ఆ దేశం తయారీ 55 లోకోమోటివ్‌లను వాడుతోంది. కాకపోతే ప్రస్తుతం పాక్ రైల్వే వద్ద తగినంత నగదు లేదు. స్టార్‌లింక్ ఇంటర్నెట్ అనుమతలను కూడా సానుకూలంగా పరిశీలించాలని కూడా రికీ గిల్ కోరినట్లు సమాచారం. ఈ క్రమంలో అమెరికన్ కంపెనీలపై పాకిస్థాన్ 5 శాతం డిజిల్ పన్నును కూడా తొలగించింది. ఖనిజాల రంగంలో పెట్టుబడి పెట్టేందుకు అమరికా 135 బిలియన్ డాలర్లను సిద్ధం చేసింది. ఈ క్రమంలో బలోచిస్థాన్‌లోని రెకో డిక్ మైనింగ్ కంపెనీకి 1.25 బిలియన్ డాలర్లను తమ దేశ ఎగ్జిమ్ బ్యాంక్ ద్వారా అమెరికా మంజూరు చేయించింది. ఇక పాకిస్థాన్ ఖనిజాల నిల్వలను గుర్తించే విషయంలో, కృత్రిమ మేధ అభివృద్ధిలో అమెరికా-పాక్ కలిపి పనిచేయాలని నిర్ణయించాయి. ఈ యేడాది పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ అమెరికా పర్యటనతో ఇరు దేశాల సంబంధాల్లో భారీ మార్పులు చోటుచేసుకొన్నాయి.

## ప్రపంచంలోనే అత్యంత పొడవైన చేతిరాత బైబిల్



**తిరువనంతపురం, డిసెంబరు 28:** ప్రపంచంలోనే అత్యంత పొడవైన, చేతితో రాసిన బైబిల్ ఆవిష్కరణకు సిద్ధమైంది. ఏకంగా 100కిలోమీటర్ల పొడవున్న ఈ బృహత్తర బైబిల్‌ను కేరళలోని త్రిసూర్‌లో ఆది వారం కార్డినల్ మార్ జార్జ్ కూవక్కాడ్ ఆవిష్కరించనున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి సేక్రేడ్ హార్ట్ ఆఫ్అవర్ లేడీ ఆఫ్ సారోస్ బసిలికా ప్రాంగణం వేదిక కానుంది. 2025 జూబ్లీ ఇయర్ వేడుకలు, త్రిసూర్ బసిలికా శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మొత్తం 2,025 మంది భక్తులు, ప్రతినిధులు కలిసి ఈ బైబిల్‌ను చేతితో రాయడం విశేషం.

## సంక్షిప్తంగా..

### 'సిందూర్' వేళ బంకర్‌లో దాక్కోమన్నారు: పాకిస్థాన్ అధ్యక్షుడు



**ఇస్లామాబాద్, డిసెంబరు 28:** పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా పాకిస్థాన్‌పై భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన విషయం తెలిసిందే ఈ క్రమంలోనే అక్కడ అగ్ర నాయకత్వానికి వణుకుపట్టినట్లు తెలిసింది. భారత్ ఆపరేషన్ నేపథ్యంలో బంకర్‌లోకి వెళ్లిపోవాలని తమ సైన్యం సూచించిన మాట వాస్తవమేనని పాక్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ అంగీకరించారు. ఇటీవల ఓ బహిరంగ సభలో ఈ విషయాన్ని స్వయంగా వెల్లడించారు. 'మిలటరీ సెక్రటర నా దగ్గరకు వచ్చి ఆపరేషన్ సిందూరు పేరుతో బారత్ డాదులు చాస్తోంది. యుద్ధం ప్రారంభమైంది. బంకర్లోకి వెళ్దాం' అని తనను అప్రమత్తం చేసినట్టు జర్దారీ వెల్లడించారు. అయితే, ఆయన సలహాను తాను తిరస్కరించానని చెప్పారు. పాక్, పిఒకెలలోని సైనిక, ఉగ్ర శిబిరాలను లక్ష్యంగా చేసుకొని భారత్ సైన్యం మే7న ఆపరేషన్ చేపట్టింది. పలు ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది.

### ఆధ్యాత్మిక యాత్రను పూర్తిచేసిన ఎంపి కంగనా రనౌత్




**సిమ్లా, డిసెంబరు 28:** ప్రముఖ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన దశాబ్దకాల ఆధ్యాత్మిక యాత్ర ను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 12 జ్యోతిర్లింగాలను ఆమె దర్శించుకున్నారు. భీమశంకర జ్యోతిర్లింగాన్ని దర్శించుకోవడంతో తన యాత్ర పూర్తయిందని ఆదివారం సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. కంగనా తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కొన్ని ఫొటోలను పోస్ట్ చేశారు. సంప్రదాయ దుస్తుల్లో శివలింగానికి పాలాభిషేకం చేస్తూ, పూజల్లో పాల్గొన్న చిత్రాలను పంచుకున్నారు. మహాదేవుడి దయ, నా పూర్వీకుల పుణ్య కర్మల వల్ల ఈరోజు నేను 12 జ్యోతి ర్లింగాల దర్శనాన్ని పూర్తి చేశాను. పదేళ్లకు పైగా సాగిన నా యాత్ర భీమశంకర దర్శనంతో ముగిసింది. మొదట్లో ప్రయాణాల్లో యాదృచ్ఛికంగా దర్శనాలు జరిగాయి. కానీ ఇటీవల గట్టి నిర్ణయం తీసుకుని అన్నింటినీ పూర్తి చేయాలనుకున్నానని కంగనా తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

### హిందువుల నిరసనను అడ్డుకున్న ఖలిస్థానీలు



**లండన్,డిసెంబరు 28:** లండన్ లోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బంగ్లాదేశ్‌లో ఇటీవల మైనారిటీ హిందువులపై మూకదాడులు, హత్యలు జరుగుతున్న విషయం తెలిసిందే. హిందువులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ దాడులను నిరసిస్తూ లండన్‌లోని హిందువులు బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. బంగ్లాదేశ్ లోని మైనా రిటీలకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన హిందువులు ఈ నిరసన కార్యక్రమం చేపట్టగా ఖలిస్థానీ వేర్పాటువాదులు దీనిని అడ్డుకున్నారు. పెద్ద సంఖ్యలో బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం వద్దకు చేరుకుని భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ భయాందోళనలు సృష్టించారు. ఖలిస్థానీ జెండాలు ఎగురవేస్తూ నినాదాలు చేశారు. రెండు గ్రూపులు పోటాపోటీగా నినాదాలు చేస్తుండడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

### మంచు తుపానుతో అమెరికాలో ఎమర్జెన్సీ విధింపు



**న్యూయార్కు, డిసెంబరు 28:** అమెరికాలోని ఈశాన్య ప్రాంతం, గ్రేట్ లేక్స్ పరిసరాల్లో మంచుతుపాను బీభత్సం సృష్టిస్తోంది. శుక్రవారం సాయంత్రం నుంచి మొదలైన మంచువర్షం తీవ్ర రూపందాల్చింది. దీనితో ఈశాన్యప్రాంతాల్లోతుపాను అత్యవసరపరిస్థితిని ప్రకటించారు. మధ్యాహ్న సమయానికి అమెరికావ్యాప్తంగా దాదాపు5,580 విమానాలు ఆలస్యంగా నడవగా, కనీసం 860విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. ముఖ్యంగా న్యూయార్క్ మెట్రోపాలిటన్ పరిధిలోని మూడుప్రధాన విమానాశ్రయాలపై దీనిప్రభావం తీవ్రంగా పడింది. పరిస్థితి తీవ్రతను గమనించిన న్యూయార్క్, న్యూజెర్సీ గవర్నర్లు ఆయా రాష్ట్రాల్లో ఎమర్జెన్సీ (అత్యవసర స్థితి) ప్రకటించారు.

### కొడుకు కావాలన్న కోరికతో కూతుర్ని హత్యచేసిన తల్లి

**నవీముంబయి, డిసెంబరు 28:** నవీ ముంబైలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. కొడుకు కావాలన్న బలమైన కోరికతో ఓ తల్లి తన ఆరేళ్ల కన్నకూతురిని కిరాతకంగా హత్య చేసింది. సైన్స్ గ్రాడ్యుయేట్ అయిన ఆమెను కళంబోలి పోలీసులు అరెస్ట్‌చేశారు. గురుసంకల్ప్ సొసైటీలో నివసించే సుప్రియా మహామున్కర్ (30)ఈ నెల 23న తన కుమార్తె మాన్సి(6) అనారోగ్యంతో చనిపోయిందని పోలీసులకు తెలిపింది. పాప మృతిపై అనుమానం వచ్చిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. ఊపిరాడకుండా చేయడంవల్లే చిన్నారి చనిపోయినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలడంతో పోలీసులు హత్య కేసునమోదు చేశారు. అనంతరం సుప్రియను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. కొడుకు పుట్టాలనే కోరికతోనే ఈ దారుణానికి పాల్పడినట్లు ఆమె ఒప్పుకుంది.

29-12Pg6exHMNWJQE 10_29-12Pg6exHMNWJQE.qxd 28/Dec/25 11:13 PM Page 1





## ఎఐ కళ్ల జోళ్లు పంపిణీ

చేజర్ల (నెల్లూరు), డిసెంబరు 28 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా చేజర్ల మండలం మామూడూరు గ్రామంలోని అబ్బూరి మహాలక్ష్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసర్చ్ సెంటర్, అచల గ్రూప్ ఆదివారం సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ కళ్ళ జోళ్ళను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళ్ళ జోళ్ళు నిర్వహణలో కిమ్స్ ప్రతినిదులు ఆచల గ్రూప్ ప్రతినిధులు సంయుక్తంగా కొన్ని రోజులు శిక్షణ ఇస్తారని తెలిపారు. అంగవైకల్యం కలిగిన వారు మరొకరి సహాయంతో వారి పనులు చేసుకుంటారని అన్నారు. అయితే నేడు అంధత్వం కలిగిన వారికి ఎలాంటి సహాయకులు లేకుండా నేరుగా వారి పనులు చేసుకోవడానికి ఏఐ గ్లాసులు ఎంతో ఉపయోగ పడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అచల గ్రూప్ వైస్ ప్రెసిడెంట్ రవితేజా, నేషనల్ పెడిరేషన్ ఆఫ్ బ్లైండ్ సంస్థ నుండి వెంకటరావు నేషనల్ పెడరేషన్ ఆఫ్ బ్లైండ్ జిల్లా సెక్రటరీ కోటేశ్వరరావు, ఆత్మకూరు ఆర్‌డిఒ బి.పావనీ, ప్రముఖ వైద్యనిపుణులు బొల్లినేని భాస్కరరావు, బొల్లినేని శ్రీనివాసులు, ఆత్మకూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తాళ్ళూరి గిరినాయుడు, బొల్లినేని ఆసుపత్రి సిబ్బంది, ఆచలా గ్రూప్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## చెట్టును ఢీకొన్న కారు

### విశాఖ వాసులు ఇద్దరు దుర్మరణం

### గజపతినగరం రైల్వే జంక్షన్ వద్ద ఘటన

గజపతినగరం (విజయనగరం జిల్లా), డిసెంబరు 28 ప్రభాతవార్త: విజయనగరం జిల్లాలోని గజపతినగరం రైల్వే స్టేషన్ జంక్షన్ సమీపంలో 26వ నెంబర్ జాతీయ రహదారి వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చింత చెట్టును బలంగా ఢీకొనడంతో, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులిద్దరూ విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నంలోని కంచరపాలెం ఏరియాకు చెందిన పొట్నూరు వినయ్ కుమార్(35) యల్లబిల్లి దినేష్ (24)లు తమ వ్యాపారంలో భాగంగా బేకరీ ఐటమ్స్ తీసుకుని ఏపీ39డి 2851 నెంబర్ గల వ్యాన్‌లో 27వ తేదీ(శనివారం) సాయంత్రం ఒరిస్సా రాష్ట్రంలోని రాయగడకి వెళ్లారు. అక్కడ బేకరీ ఐటమ్స్ అప్పగించి, తిరిగి ప్రయాణంలో విశాఖపట్నం బయలు దేరారు. ఈ క్రమంలో 28 వ తేదీ (ఆదివారం) తెల్లవారు జాము 4 గంటల ప్రాంతంలో గజపతినగరం రైల్వే స్టేషన్ జంక్షన్ సమీపంలో చింత చెట్టుని బలంగా ఢీకొన్నారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న పొట్నూరు వినయ్ కుమార్, పక్క సీట్లో కూర్చున్న దినేష్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. కారు నుజ్జునుజ్జయింది. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీస్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకొని, ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కారులో చిక్కుకున్న ఇద్దరి మృతదేహాలను బయటికి తీసి పోస్ట్ మార్టం నిమిత్తం విజయనగరం పెద్ద ఆస్పత్రికి తరలించారు. మృతులు వినయ్ కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు కాగా, దినేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎల్లబిల్లి శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

## మట్టి అక్రమార్కుల దాష్టీకం

### అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపై ప్రొక్లెయిన్‌తో దాడి... తమిళనాడు కృష్ణగిరి జిల్లాలో ఘటన

కుప్పం, డిసెంబరు 28 ప్రభాతవార్త: జిల్లా కలెక్టరు ఆదేశాలతో చెరువు వద్ద మట్టి అక్రమ రవాణా అడ్డుకునేందుకు వెళ్లిన ఒ తహాశీల్దార్, ఉప తహాశీల్దార్‌లపై ఓ డ్రైవర్ ప్రొక్లెయిన్‌తో దాడి చేసి ఎక్కించబోయి హత్యాయత్నంకు పాల్పడిన సంఘటన తమిళనాడులోని కృష్ణగిరి జిల్లాలో చోటు చేసుకుంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా.. కృష్ణగిరి జిల్లా పోచంపల్లి సమీపంలోని చెంగంపట్టి గ్రామం వద్ద ఆనందూర్ చెరువు ఉంది. ఆ ప్రాంతంనుంచి భారీగా సారవంతమైన మట్టిని కొందరు స్మగ్లర్లు తరలిస్తున్నారని కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంగా మట్టి అక్రమ రవాణా అరికట్టాలని కలెక్టరు ఊతంగరై తహాశీల్దార్ రజలత్‌సుమి, ఉప తహాశీల్దార్లు సహదేవ, జయపాల్‌లను ఆదేశించారు. దీంతో రెవెన్యూ అధికారులబృందం సంఘటనా స్థలంకు చేరుకోగా అక్కడ మట్టిని ప్రొక్లెయిన్ సాయంతో లారీలో ఎక్కిస్తుండడాన్ని అధికారులు గుర్తించారు. అక్కడున్న కొందరు అధికారులను చూసి పరారు కాగా ప్రొక్లెయిన్ డ్రైవర్ వాహనంతో వేగంగా వచ్చి తహాశీల్దార్, ఉప తహాశీల్దార్లపై ప్రొక్లెయిన్‌తో ఢీకొట్టి వారిపై ఎక్కించాలని హత్యాయత్నంకు పాల్పడ్డాడు. అనంతరం అతను పరారవుతుండగా అధికారులు పట్టుకునే యత్నం చేయగా తప్పించుకున్నాడు. పోచంపల్లి పోలీసులు అధికారుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలికి చేరుకుని అక్కడున్న లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఈసంఘటన కృష్ణగిరి జిల్లాలో కలకలం రేకెత్తించింది.

# ఆత్మకూరులో రూ.144.5 కోట్ల అభివృద్ధి పనులు

### - రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



ఆత్మకూరు (నెల్లూరు), డిసెంబరు 28 ప్రభాతవార్త: ఆత్మకూరు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖాల ద్వారా సుమారు 144.5కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు మండలంలోని వాసిలి గ్రామంలో జాతీయ రహదారి నుంచి వాసిలి గ్రామం వరకు సుమారు 49లక్షల రూపాయలతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మించనున్న సిసిరోడ్లకు మంత్రి ఆనం శంఖు స్థాపన చేశారు. అనంతరం పూర్తయిన రోడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా ఆత్మకూరు మండలంలో 19కోట్ల రూపాయలతో 76పనులను ప్రారంభించామన్నారు. కొన్ని టెండరు ప్రక్రియ సాగుతుందన్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 336 పనులకు 65కోట్ల రూపాయలు నిధులు మంజూరయ్యాయని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.4కోట్ల రూపాయల నిధుల కొరత ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలు చెల్లిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 5లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను మరమ్మత్తులు చేయడం జరుగుతుందన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలద్వారా చివరి ఆయకట్టు భూములు కూడా వ్యవసాయ ఆమోదయోగ్యం పొందడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలో అనేక లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు నిధులు మంజూరు చేశారన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవసాయంలో అంతర్భాగమన్నారు. మరికొన్ని నూతన పథకాలను కూడా ప్రారంభిస్తామన్నారు. ఎన్‌డిఎ చేసిన వాగ్ధానాల మేరకు అభివృద్ధి పనులు చేపడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్లు అందజేస్తుందన్నారు. ఈనెల 31వ తేదీనే పెన్షన్ పంపిణీ చేస్తామన్నారు. ఇంటింటికి మూడు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదనంగా నూతన గ్యాస్ కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని, అదనంగా నూతన గ్యాస్ కనెక్షన్ 200 ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందన్నారు. నియోజకవర్గ పరిధిలో 761 పనులకు 50కోట్ల 72లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు నియోజకవర్గ ప్రజల శ్రీకారం చుట్టి పనులు పురోగతి లో ఉన్నాయన్నారు. 9బిటి రోడ్లు 47కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసేందుకు 26.9 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేశారన్నారు. వాసిలి ఎస్సీ కాలనీలో 69.3లక్షల రూపాయలతో తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మండల పరిధిలో జలజీవన్ మిషన్‌కింద 76.19కోట్ల రూపాయలతో టెండర్ల ప్రక్రియ పూర్తయిందని నియోజకవర్గ పరిధిలో 336 పనులకు 6588 లక్షల రూపాయలతో శ్రీకారం చుట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి బి.పావని, మండల రెవెన్యూ అధికారి పద్మజ, మండల అభివృద్ధి అధికారి, పంచాయతీరాజ్ శాఖఅధికారులు, స్థానిక అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కల్తీ విత్తనాలతో నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

### - ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్



వరదయ్యపాళెం, డిసెంబరు 28 ప్రభాతవార్త: వరదయ్యపాలెం మండలం సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో సూళ్లూరుపేటలోని పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్‌లో సుమారు రూ.1500లకు కల్తీ విత్తనాలను కొని నారు పోసి నాటగా 15 రోజుల్లోనే ఎన్నులు తీయడం, పైకి ఎదగకపోవడం వల్ల కల్తీ విత్తనాలతో నష్టపోయిన సుమారు 250 మంది రైతులకు ప్రభుత్వం వెంటనే ఎకరాకు రూ.62000 నష్టపరిహారం చెల్లించాలని. ఈ కల్తీ విత్తనాల అమ్మిన సుళ్లూరుపేట పూజిత ఆగ్రో సర్వీస్ సెంటర్ యాజమాని శ్రీధర్ రెడ్డిపై చట్టప్రకారం చర్యలు తీసుకుని అరెస్ట్ చేయాలని తిరుపతి జిల్లా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కన్వీనర్ సుధాకర్ రెడ్డి, భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్ని రాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరదయ్యపాలెం మండలంలోని మావిళ్ళపాడు కలతూరు కొవ్వాకొల్లి మరదవాడ అంగూరు సాతంబేడు తదితర గ్రామాల రైతులు సుమారు 250 మంది విత్తనాలు నారుపోసి నాటి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎక్కువ మంది రైతులు భూములను కౌలుకు తీసుకొని ఈ వ్యవసాయ సాగు చేస్తున్నారని, కల్తీ విత్తనాల వల్ల నష్టపోయిన భూమి గల యజమానులకు కవులు డబ్బులు చెల్లించాల్సి వస్తుందని రైతులు తీవ్ర ఆవేదనకు గురి ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సుధాకర్‌రెడ్డి చిన్నిరాజ్ నాయకత్వాన వరదయ్యపాలెం మండలంలోని గ్రామాల పొలాలలో క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులతో కలిసి పరిశీలించడం జరిగిందని ఆ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గుత్తకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న మాకు ఈ కల్తీ విత్తనాలు వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి భూములను సరియైన నిర్వహించి రైతులను గుర్తించి పరిహారం చెల్లించాలని లేకుంటే ఆత్మహత్య చేసుకోవడమే తప్ప వేరే గత్యంతరం లేదని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనుంజయులు శెట్టి చంద్ర, ధనంజయల్ నాయుడు, చలపతి నాయుడు, విజయ ఉప్పరపాటి, మునిరాజా, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి నిధులతో కసాపురం దేవస్థానం అభివృద్ధి

### - అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

### - ఎంపిని కలిసిన కసాపురం దేవస్థానం ఇఒ విజయరాజు



అనంతపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో కసాపురం దేవస్థానం (గుంతకల్) కార్యనిర్వాహణ అధికారి విజయరాజు మర్యాదపూర్వకంగా కలుసుకొని, వేద ఆశీర్వాదాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కసాపురం దేవస్థానం అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించాను. జిల్లా స్థాయిలో దేవస్థానం మరింత మంచి స్థానం సంపాదించుకునేలా అభివృద్ధి చేయాలని, ఎంపీ నిధుల ద్వారా ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవాలయంలో ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నాను. ఇప్పటికే గ్రామం మరియు దేవాలయానికి బస్ షెల్టర్ ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు దేవాలయానికి అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని, బస్ షెల్టర్, నక్షత్రవనం, రహదారులు, నీటి వసతి, గది వసతులు, ఆర్చ్, పార్కింగ్, షెడ్స్, ఆధ్యాత్మిక వసతులు వంటి అన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యంగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కసాపురం దేవస్థానం అధికారులు, ప్రధాన అర్చకుల బృందం, ఆలయ సిబ్బంది, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంతలో శంబాల నటుల సందడి

### మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో ఘన సన్మానం



అనంతపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త: ఈనెల 24వ తేదీ విడుదలైన శంబాల సినిమా నటులు ఆదివారం అనంతలు సందడి చేసింది. హీరో తండ్రి సాయికుమార్, హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యర్, మధుసూదన్, ఇంద్రనీల్, అనంతపురం పట్టణానికి చెందిన మరో నటుడు, మటకశిర ఎమ్మెల్యే, శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెస్ రాజు కలిసి మాసినేని గ్రాండ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఆధ్వర్యంలో త్రివేణి థియేటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ భారీగా బాణ సంచులు పేలుస్తూ స్వాగతం పలికారు. అక్కడ శంబాల సినిమా ఆడుతున్న త్రివేణి హాల్లోకి వెళ్లి సందడి చేశారు. ప్రేక్షకులు కూడా సినీ నటులను చూసి ఆనందంతో కేకలు వేస్తూ విజిల్స్ వేశారు. శంభాల సినిమా ఈనెల 24వ తేదీ ప్రపంచవ్యాప్తంగా విడుదల అయిందని, ఈ సినిమాని అందరూ ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సినీనటులు తెలియజేశారు. పైరసీను ప్రోత్సహించకుండా థియేటర్లలోనే సినిమాలు చూడాలని కోరారు. అనంతరం గజమాల తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ మెంబర్ వెంకటప్ప, టిడిపి నాయకులు రాయల్ మురళి, దేవల మురళి, ఎంఆర్పిఎస్ నాయకులు పెద్దన్న, టిసి నాగేంద్రతో పాటు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి నేరం

### అటువంటి ఉన్మాదులను ప్రోత్సహించం

### - హోంమంత్రి వంగలపూడి అనిత

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: బహిరంగ ప్రదేశాల్లో జంతుబలి చేయడం నేరం అని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. వైఎస్సార్సీపీ నేతలు అనేకచోట్ల జంతుబలులు చేసి తమ ఉన్మాదాన్ని చాటుకున్నారని .ఆమె మీడియాతో మాట్లాడుతూ తమ పార్టీ నేతలు ఏం చేసినా ఆ పార్టీ నాయకుడు నోరు తెరిచి తప్పని చెప్పలేదు. జగన్ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేయడం ఉన్మాదం కాదా?. వచ్చే ఎన్నికల్లో గెలిస్తే మీ పరిస్థితి ఇదేనంటూ నినాదాలు ఇవ్వడం దారుణం. రాజకీయాలను అడ్డం పెట్టుకుని రౌడీయిజం చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకాలు కలిగించేందుకు కుట్రలు చేస్తున్నారు. చిన్న పిల్లలను కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారుచేస్తున్నారు. టీనేజ్ పిల్లల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నారు. రాజకీయ నేతల ఉద్దేశాలు కూడా పిల్లల తల్లిదండ్రులు ఆలోచించాలి. ఆస్తి గురించి సొంత తల్లి, చెల్లెలిపై కేసులు పెట్టినవారు మీ పిల్లల్ని రక్షిస్తారా?. పిల్లలు రోడ్డుపైకి వచ్చి నరుకుతాం, చంపుతాం అంటున్నారు. తమ పార్టీ నేతలు చేసింది తప్పని చెప్పలేరా జగన్. జగన్ అధికారంలో ఉన్నప్పుడు అనేక దారుణాలు జరిగాయి. అధికారం కోల్పోయినా మరో రకం దారుణాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి వాటిని ఖండించలేదంటే జగన్ అసలు మనిషేనా?. నేరాలు ప్రోత్సహించే పరిస్థితి నీది, వాటిని అరికట్టే బాధ్యత మాది. రోడ్లపై ఉన్మాదుల్లా ప్రవర్తిస్తే ఎవరినీ వదిలేది లేదు. ఫ్లెక్సీలపై రక్తం చల్లినవారందరినీ అరెస్టు చేశాం. నేరగాళ్లు, రౌడీ షీటర్లపై ఉక్కుపాదం మోపుతాం. తల్లిదండ్రులు తమ బిడ్డల భవిష్యత్తుపై ఆలోచన చేయాలని మంత్రి సూచించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు కత్తులు పట్టుకుని రోడ్డెక్కుతుంటే తప్పు అని చెప్పేందుకు కూడా మనసు రాలేదా? అని నిలదీశారు. జగన్ పుట్టినరోజు నాడు వైఎస్సార్సీపీ వికృత చేష్టలు మానవత్వం ఎటు పోతోందో అనే రీతిలో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ ముసుగులో వైఎస్సార్సీపీ సైకోలు చేపట్టే చర్యలు రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేలా ఉందని మండిపడ్డారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్సీపీ వికృత చేష్టలు, జంతు బలులపై హోంమంత్రి అనిత వీడియో విడుదల చేశారు. గతంలో మాదిరి నిందితులకు ముసుగు వేయకుండా వారిని అందరి ముందు బహిర్గతం చేస్తామని మంత్రి అనిత వెల్లడించారు. ఆడపిల్లల జోలికి వస్తే రోడ్డుపై నడిపించి స్టేషన్‌కు తీసుకెళ్తామని హెచ్చరించారు. శృతి మించి ప్రవర్తిస్తే రాష్ట్ర బహిష్కరణకు వెనుకాడమని వ్యాఖ్యా నించారు. ఫ్యాక్షన్ సినిమా చూసినట్లుగా వైఎస్సార్సీపీ వికృత చేష్టలు ఉన్నాయని, నేతల్ని ఉన్మాదుల్లా ఆపార్టీ నాయకుడు ఎలా తయారు చేస్తున్నాడో ప్రజలు గమనించాలని సూచించారు. జగన్ ఆదేశాలతోనే ఈ తరహా కార్యక్రమాలు జరిగాయా? అని మంత్రి అనిత ప్రశ్నించారు. గర్భిణీ స్త్రీని కాలుతో తన్నే ఉన్మా దుల్ని ఏమనాలని మండిపడ్డారు. రాజకీయ ముసుగులో రౌడీయిజం అడ్డం పెట్టుకునే చేసే కుట్రలు స్పష్టమవుతున్నాయని తెలిపారు. అధికారంలో ఉండగా గంజాయ్‌ని ప్రోత్సహించిన జగన్ యువత భవిష్యత్తుని నాశనం చేశారని అనిత ఆక్షేపించారు. తాజా వికృత చేష్టలతో 18ఏళ్ల లోపు యువత జీవితాల్ని నాశనం చేయటమే జగన్ పనిగా పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
రాజకీయ ముసుగులో యువత భవిష్యత్తును నాశనం చేయాలనుకుంటున్న జగన్ అసలు మనిషేనా అని అనిత ధ్వజమెత్తారు. ఇష్టానుసారం వ్యవహరిస్తే ఇక్కడ ఉంది సీఎం సీబీఎన్ అని జగన్ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించేందుకు వైఎస్సార్సీపీ నేతలు ఎంతకైనా దిగజారుతున్నారని హోంమంత్రి విమర్శించారు. జంతుబలులతో రక్తాభిషేకం చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. జగన్ జన్మదినం సందర్భంగా రాష్ట్రంలో పలుచోట్ల ఆ పార్టీ నేతలు ముగుజీవాల్ని బలి ఇచ్చి చేసిన రక్తాభిషేకంపై మండిపడ్డారు. రోడ్లపైకి వచ్చి కత్తులు పట్టుకుని తిరిగితే కఠిన చర్యలు తప్పవన్నారు. రక్తాభిషేకం చేసిన వాళ్లంతా కటకటాల్లో ఉన్నారని చెప్పారు. చిన్న పిల్లలను కూడా సైకోలు, ఉన్మాదుల్లా తయారు చేస్తున్నారని హోంమంత్రి



ప్లాస్మా జాతీయ సింపోజియంలో మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణ

### పారిశ్రామిక, బయో మెడికల్ రంగాల్లో

## ప్లాస్మా సైన్స్ కీలకం

### తిరుపతి ఐఐటిలో ప్లాస్మా 40వ జాతీయ సింపోజియం

శ్రీకాళహస్తి, డిసెంబరు 28 ప్రభాతవార్త: ఫ్యూజన్ ఎనర్జీ, స్పేస్, అస్ట్రోఫిజికల్, ప్లాస్మాలు, తక్కువ ఉష్ణోగ్రత ప్లాస్మాలు, ప్లాస్మా దయాగ్నస్టిక్ మెటీరియల్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో నేడు ప్లాస్మా సైన్స్ కీలకంగా మారిందని తిరుపతి ఐఐటిలో జరుగుతున్న ప్లాస్మా 40వ జాతీయ సింపోజియంలో పలువురు వక్తులు ప్రసంగించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సింపోజియంకు తిరుపతి ఐఐటి అతిధ్యం ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆదివారం నిర్వహించిన ఆలోచనాత్మక సమావేశాలకు డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి ఉత్కల్ యూనివర్శిటి మాజీ విసి ప్రొఫెసర్ ఎకె దాస్, ఎంటిఆర్‌డిసికి చెందిన డాక్టర్ ఎస్‌కె దత్, కాంచిపురం ఐఐటిడిఎం ప్రొఫెసర్ ఎంవి.కార్తికేయన్, నెట్‌కార్ లిమిటెడ్ డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ్ శర్మ తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడి భౌతిక శాస్త్రం, సివిల్, పర్యావరణ ఇంజనీరింగ్ విభాగం తిరుపతి ఐసర్, ప్లాస్మాసొసైటీ ఆఫ్ ఇండియా కలసి ఈ సింపోజియంను నిర్వహిస్తున్నట్లు వివరించారు. టెక్నాలజీలో ఇటీవల చోటు చేసుకుంటున్న పురోగతులు ఉద్భవిస్తున్న ధోరణులపై చర్చించటమే సింపోజియం లక్ష్యం అన్నారు. అంతర్ విభాగం పరిశోధనలు, శాస్త్రీయ నైపుణ్యాన్ని ప్రోత్స హించటానికే తిరుపతి ఐఐటి ప్రాధాన్యత ఇస్తుందని వివరించారు. భారత దేశ ప్లాస్మా పరిశోధన పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయటంలో ఇటువంటి సింపోజియంలు ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సింపోజియంలో ఆదివారం పలు అంశాలకు సంబంధించి చర్చలు జరిగాయి. అలాగే ప్యానెల్ చర్చలతో పాటు పలు పోస్టర్స్ ప్రెజంటేషన్ చర్చలు సుధీర్ఘంగా జరిగాయి. ఈ వాతావరణం విద్యాసంస్థలు, జాతీయ ప్రయోగశాలలు పరిశ్రమల మధ్య సహకారాన్ని పెంపొందించుటకు దోహద పడుతుందన్నారు.



చిత్తూరులో కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ ఉత్సవంలో నాయకులు, కార్యకర్తలు

## మరో స్వాతంత్ర్య సమరానికి కాంగ్రెస్ సై

### - చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్

చిత్తూరు, డిసెంబర్ 28 ప్రభాతవార్త: దేశంలో కాంగ్రెస్ పార్టీ మరో స్వాతంత్ర్య సమరానికి సిద్ధం అవుతోందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావించి 141 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో డిసిసి అధ్యక్షులు పోటుగారి భాస్కర్ కాంగ్రెస్ పతాకంను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఆయన పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశం నుండి తెల్ల దొరలను తరిమికొట్టడానికి స్వాతంత్ర్య పోరాటం చేసిందన్నారు. దేశంలో ప్రస్తుతం వున్న ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలు, ముస్లింలకు అన్యాయం చేసి ఆదానీ, అంబానీలకు ప్రయోజనం కలిగే నిర్ణయాలు తీసుకుని సామాన్య ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. చిత్తూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు టిక్కి రాయల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ బీద ప్రజల వైపు నిలిచి వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేసిందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి నాయకుడి నుండి కార్యకర్తల వరకు పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సత్యవేడులో రేషన్ దందా

### సరిహద్దు దాటుతున్న రేషన్ బియ్యం

సత్యవేడు (చిత్తూరు జిల్లా), డిసెంబరు 28 ప్రభాతవార్త: విజిలెన్స్ దాడులు... మూడు చోట్ల పోలీసుల మెరుపు దాడులు... బియ్యం స్వాధీనం... వాహనాలు సీజ్... ఇది గత కొంత కాలంగా పేదోడికి ఇంటికి చేరాల్సిన ప్రభుత్వ సబ్సిడీ బియ్యం విషయంలో అధికారుల స్పందన. అయినా మళ్లీ బియ్యం అక్రమ రవాణా మాఫియా విజృంభణ సత్యవేడులో మొదలైంది. తమిళనాడుకు సరిహద్దులో సత్యవేడు ఉండడం వల్ల ఇటు తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల సబ్సిడీ బియ్యాన్ని కొనుగోలు చేసి శ్రీకాళహస్తి, పలమనేరు ప్రాంతాలకు తరలించి అక్కడ బియ్యాన్ని పోలీసు చేసి ఏకంగా 25 కేజీల బస్తా బియ్యం సుమారు 1300 రూపాయలు విక్రయిస్తున్నారు. సత్యవేడులో ఓ నలుగురు ఏకమై పోలీసులు, ఇతర అధికారులను వారు మచ్చిక చేసుకుని ఈ వ్యాపారం మూడు బస్తాలు.. ఆరు రకాల ఆదాయ వనరులుగా మార్చుకుని లబ్ధిపొందుతున్నారు. సత్యవేడు కేంద్రంగా తమిళనాడు రాష్ట్రంలోని ఊత్తుకోట, గుమ్మిడిపూండి, మాధరపాకం, ఎగుమదురె, పాలవాకం, అచ్చిమనాయుడు కండ్రిగ, ఎన్ఎం కండ్రిగ ప్రాంతాలు నుంచి అక్కడ తమిళనాడు ప్రభుత్వం పేదలకు ఉచితంగా సరఫరా చేసేప్పుడు బియ్యాన్ని కేజీ 5 నుంచి 10 రూపాయల చొప్పున ఇక్కడికి తీసుకుని వచ్చి నిల్వ చేసుకుంటున్నారు.

### పట్టించుకుంటే ఒట్టు... అక్రమార్కుల కనికట్టు....

సత్యవేడు నియోజకవర్గంలోని సత్యవేడు, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల నుంచి మన రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీ బియ్యాన్ని సత్యవేడుకు చేరవేసుకుంటారు. ఇక్కడ ప్రభుత్వం ఇంటి పరిసరాలకే టెంపోల ద్వారా కొన్ని సందర్భాల్లోను, డీలర్లు వద్ద కొన్ని సందర్భాల్లో ఉచిత, కేజీ రూపాయి చొప్పున బియ్యాన్ని అందిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిగా ప్రజా పంపిణీ వ్యవస్థపై పర్యవేక్షణ మరచిపోవడంతో ఈ అక్రమ రవాణా మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. క్షేత్ర స్థాయిలో ఏడాది కాలంగా ఏ ఒక్క తహసీల్దార్ ఏ వీధికి కానీ, గ్రామానికి కాని వెళ్లి బియ్యం అందిందా.. లేదా.... అని ప్రశ్నించిన దాఖలాలు లేవు. దాంతో ఏకంగా డీలర్లు నుంచి 4.6 రూపాయల చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసుకుంటున్నారు. తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సేకరించిన బియ్యాన్ని సత్యవేడులోని జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న మంచినీటి ట్యాంకు సమీపంలో కొందరి ఇళ్ళలో ఉంచి లారీ మొత్తంలో నిల్వ చేరిన వెంటనే శ్రీకాళహస్తి, పలమనేరు ప్రాంతాలకు తరలించి భారీగా ఆదాయం పొందుతున్నారు. కొందరిపై వరుస కేసులు నమోదు అవుతున్నా ప్రయోజనం లేకపోతుంది. అటు కోర్టుకు వెళ్లామా... బెయిల్‌పై వచ్చి వెంటనే మరో ఇంటికి గోడౌన్‌గా మార్చి తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. మొత్తం మీద పేదోడి సర్కారు సబ్సిడీ బియ్యం అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్నా అధికార యంత్రాంగం ప్రేక్ష పాత్ర వహించడం ఆలోచించాల్సి ఉంది.

29-12P□g7exHMNWJQE 11_29-12P□g7exHMNWJQE.qxd 29/Dec/25 12:35 AM Page 1



# నరసాపురం లేస్.. ప్రస్తావన గర్వకారణం

## - మన్‌కీ బాత్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్




నరసాపురం, డిసెంబరు 28 ప్రభాతవార్త:మన్ కీ బాత్ 129వ ఎపిసోడ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన నరసాపురం లేస్ పరిశ్రమ, లేస్ పని చేసే మహిళల గురించి గర్వంగా ప్రస్తావించడం మన జిల్లాకు ఎంతో గర్వకారణమని కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ప్రధాని మోడీ తన ప్రసంగంలో నరసాపురం మహిళలు తమ చేతివృత్తి ద్వారా తయారు చేసే లేస్ ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. ఇది లోకల్ ఫర్ వోకల్ అనే నినాదానికి ఒక చక్కని ఉదాహరణ అని కొనియాడారు. 250 గ్రామాలలో లక్షలాది మంది గ్రామీణ మహిళలు ఈ కళ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా ఎదగడం పట్ల ప్రధాని ప్రశంసలు కురిపించారు. మహిళలు ఇలాంటి పురాతన కళలను కాపాడుకుంటూ వృత్తిలో రాణించడం దేశానికి గర్వకారణమని చెప్పారు. ఇక్కడ తయారైన 500 రకాల క్రోచెట్ లేస్ ఉత్పత్తులు విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని, ఇది భారతీయ సంస్కృతి, నైపుణ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్తోందని ప్రధాని పేర్కొన్నారు. నరసాపురం లేస్ పరిశ్రమకు ఇటీవల జిఐ ట్యాగ్ కూడా లభించిన నేపథ్యంలో, ప్రధాని ప్రసంగంలో నరసాపురం లేస్ మహిళల కోసం ప్రస్తావించడం స్థానికలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నరసాపురం లెస్ అభివృద్ధికి గత సంవత్సర కాలంగా పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఎంతో కృషి చేశారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం పెద్దమైన వానిలంక గ్రామంలో పలు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ మనకి బాత్ కార్యక్రమాన్ని స్వయంగా వీక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, పశ్చిమగోదావరి జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, పాల్గొన్నారు.

# పోలవరం ప్రాజెక్టుకు పొట్టి శ్రీరాములు పేరు సమర్థనీయం

● ఎమ్మెల్సీ కె.నాగబాబు ● పెనుగొండ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో జనసేనలో భారీగా ఆర్యవైశ్యులుచేరిక



విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగు మాట్లాడే వారిని చులకనగా చూస్తున్న కాలంలో వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలి అని ఆమరణ నిరాహార దీక్ష చేసి త్యాగధనుడు ఎమ్మెల్సీ, జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణకు కీలక భూమిక పోషించిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం అనేకమందికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అలాంటి మహానుభావుడు పేరు పోలవరం ప్రాజెక్టుకు పెట్టి ఆయనను గౌరవించుకోవాలని జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన సూచనను బలంగా సమర్థిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆదివారం, మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్ లో జెఎస్పీనేత ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ పెనుగొండ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో పలువురు ఆర్య వైశ్యులు జనసేన పార్టీలో చేరారు. వారిని శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ కలసి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అనగానే ప్రథమంగా గుర్తుకొచ్చేది అమరజీవి పొట్టి శ్రీరాములు, నెల్లూరులో డిగ్రీ విద్యనభ్యసిస్తున్నప్పుడు కళాశాలలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఉండేది, ప్రతి రోజూ ఆయనకు నమస్కరించి తరగతి గదిలో అడుగుపెట్టేవాళ్ళం. హిస్టరీ విద్యార్థిగా అమరజీవి గురించి చదివి ఆయన జీవన విధానం గురించి తెలుసుకున్నాం. ఆయన జీవితం అనేకమందికి ఆదర్శంగా నిలుస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతం కోసం, గ్రామాల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ పథకాలకు, ప్రాజెక్టులకు రాజకీయ నాయకుల పేర్లుపెట్టే ఆనవాయితీని తోసిపుచ్చి గోదావరి జిల్లాలకు శుద్ధి చేసిన మంచి నీరు అందించే నీటి ప్రాజెక్టుకు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పెట్టి ఆయన త్యాగాలను భవిష్యత్ తరాలు కూడా చెప్పుకొనేలా చేశారు" అన్నారు.

# జనసేన పార్టీ మూల సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి

● శాసన మండలిలో ప్రభుత్వ విప్, జెఎస్పీ నేత పిడుగు హరిప్రసాద్



విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: జనసేన ప్రాంతీయ పార్టీ అయినప్పటికి, జాతీయవాదం పనిచేయాలన్నదే పార్టీ అధినేత ఆదేశమని శాసన మండలిలో. ప్రభుత్వ విప్, జెఎస్పీ నేత పిడుగు హరిప్రసాద్ అన్నారు. పార్టీలో పలువురు ఇతర పార్టీల నుంచి ఆర్యవైశ్య సంఘాల నుంచి చేరిన సందర్భంలో హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రజా సేవే పరమావధిగా బతికే అతికొద్ది మంది నాయకుల్లో పవన్ కల్యాణ్ ముందు వరుసలో ఉంటారు. మహోన్నత ఆశయాలు కలిగిన పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి 14 ఏళ్లుగా ఎన్నో ఒడిదుడుకులు, ఆటుపోట్లు ఎదుర్కోవడం నేను స్వయంగా చూశాను. కూటమి ఏర్పాటు చేసి పార్టీని ప్రభుత్వంలోకి తీసుకురావడానికి చాలా కష్టపడ్డారు. ఈ ప్రయాణంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారు. సప్తాశ్వాలు, సప్తరుషులు, సప్తగిరులకు ఎంత విశిష్టత ఉందో జనసేన మూల సిద్ధాంతాలకు అంతటి విశిష్టత ఉంది. ఈ సూత్రాల ఆధారంగా జనసేన ముందుకు వెళ్తుంది. పార్టీలో కొత్తగా చేరిన వారు ఆ మూల సూత్రాలను అర్థం చేసుకుని ముందుకు వెళ్లాలి" అన్నారు. కొత్తగా పార్టీలో చేరుతున్న వారితో పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తామని ప్రమాణం చేయించారు. ఈ కార్ర్యమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ ఛైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను, మాజీ శాసన సభ్యులు కిలారి రోశయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్ పంచకర్ల సందీప్, శ్రీశైలం ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు దేవకీ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు గంజి చిరంజీవి, కందే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మవారి ఆలయంలో వేదోక్తంగా సూర్య ఆరాధన



ఇంద్రకీలాద్రి, డిసెంబరు 28 ప్రభాతవార్త: శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం నాడు వేదోక్తంగా సూర్యోపసన సేవను నిర్వహించారు. లోక సంక్షేమార్థం నిర్వహించిన ఈ సేవలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**దుర్గమ్మవారి సేవలో మంత్రి సంధ్యారాణి:**

దుర్గమ్మవారిని మంత్రి సంధ్యారాణి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. మంత్రికి ఇఓ శ్రీనా నాయక్ దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం మంత్రికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందిం చారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.

# సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్‌లో సూర్య చరిష్మకు స్వర్ణం



● అసాధారణ ఘనత అంటూ సిఎం చంద్రబాబు ప్రశంసలు

● రాష్ట్ర క్రీడాకారుల ప్రతిభకు ఇది నిదర్శనమని వెల్లడి

● జట్టు విభాగంలో ఎపి టీమ్‌కు తొలిసారిగా రజతం

విజయవాడ, డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్ షట్లర్ సూర్య చరిష్మపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసల వర్షం కురిపించారు. సూర్య చరిష్మ సాధించిన విజయం అసాధారణమైన ఘనత అని, ఇది రాష్ట్ర క్రీడాకారిణుల ప్రతిభకు గొప్ప నిదర్శనమని ఆయన కొనియాడారు.

విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్2025 పోటీల్లో ఈ ఘనత నమోదైంది. మహిళల సింగిల్స్ విభాగంలో అద్భుత ప్రదర్శన కనబరిచిన సూర్య చరిష్మ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

ఇదే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు కూడా చరిత్ర సృష్టించింది. తొలిసారిగా టీమ్ విభాగంలో రజత పతకం సాధించి సత్తా చాటింది. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో విజయాలతో వెలిగిపోతూ రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తెస్తున్నారని చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సూర్య చరిష్మ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సీఎం ఆకాంక్షి ంచారు. ఈ విజయాలు రాష్ట్ర క్రీడారంగానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయని, యువ క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు.

**సూర్య చరిష్మను చూసి గర్వపడుతున్నా: మంత్రి లోకేష్**

ఆంధ్రప్రదేశ్‌కు ఇది చారిత్రక క్షణమని, 87వ యోనెక్స్ సన్‌రైజ్ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచిన సూర్య చరిష్మను చూసి గర్వపడుతున్నానని ఏపీ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. రాష్ట్రానికి మహిళల సింగిల్స్‌లో ఇదే మొట్టమొదటి జాతీయ స్వర్ణ పతకం అని ఆయన కొనియాడారు. ఇదే టోర్నీలో ఏపీ మహిళల జట్టు తొలిసారి రజతం గెలవడం కూడా గర్వకారణమని తెలిపారు. మహిళా శక్తి, పట్టుదల, సమష్టి కృషికి ఇది నిదర్శనమని, ఆంధ్ర ఆడబిడ్డలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తూ భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు.




నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలో రజత పతకం గెలుచుకున్న ఆంధ్ర జట్టు

# విజయవాడలో నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు

● క్రీడాకారిణి తమిరి సూర్య చరిష్మ మహిళల సింగిల్స్ టైటిల్ ● పురుషుల సింగిల్స్‌లో రిత్విక్ సంజీవి టైటిల్

విజయవాడ. డిసెంబరు 28 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ వేదికగా ఆదివారం ముగిసిన సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో స్థానిక క్రీడాకారిణి తమిరి సూర్య చరిష్మ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. పురుషుల సింగిల్స్‌లో రిత్విక్ సంజీవి ఛాంపియన్‌గా నిలిచాడు. మహిళల సింగిల్స్ ఫైనల్‌లో 19 ఏళ్ల సూర్య చరిష్మ 1721, 2112, 2114తో తన్వి పత్రిపై అద్భుత విజయం సాధించింది.

తొలి గేమ్‌లో ఓడిపోయినప్పటికీ, స్థానిక క్రీడాకారిణి కావడంతో ప్రేక్షకుల నుంచి లభించిన గట్టి మద్దతుతో పుంజుకుని అద్భుతంగా పునరాగమనం చేసింది.

ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో రిత్విక్ సంజీవి 2116, 2220 తేడాతో భరత్ రాఘవ్‌పై గెలుపొందాడు. ఇతర విభాగాల్లో, మహిళల డబుల్స్‌లో శిఖా గౌతమ్‌అశ్విని భట్ జోడీ, పురుషుల డబుల్స్‌లో హరిహరన్‌రుబన్ కుమార్ జంట విజేతలుగా నిలిచారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ రెడ్డిరాధిక శర్మ జోడీ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

# జనవరి 4న బిసి, ఓబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం మహాసభ

విజయవాడ, డిసెంబరు 20 ప్రభాతవార్త: జనవరి 4న ఏపీ బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మహాసభ విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు ఆల్ ఏపీ బీసీ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుత్తుల. వీర బ్రహ్మం తెలిపారు. ఆదివారం ఆయన విజయవాడలో జరిగిన ప్రెస్మీట్లో మాట్లాడుతూ న్యూఇయర్ డైరీ, కాలండర్‌ను మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు, పల్లా శ్రీనివాస రావు ఆవిష్కరిస్తారన్నారు. ఏపీలో బీసీ ఓబీసీ జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, జ్యోతిరావు పూలే రెండు వందల జయంతిని శెలవు ప్రకటించడంతోపాటు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ఆ కార్యక్రమ వేదికపై డిమాండ్ చేస్తామని ఈ కార్యక్రమానికి అటెండర్ స్థాయి ఉద్యోగి నుంచి డిపార్టుమెంట్ హెడ్‌ల వరకు రాష్ట్ర బీసీ ఓబీసీ ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో హాజరు కావలన్నారు. కార్యక్రమంఓ గౌరవాధ్యక్షులు బత్తుల అప్పారావు, అసోసియేట్ ప్రెసిడెంట్ కేదారేశ్వర రావు, జనరల్ సెక్రెటరీ పక్కిభూషణరావు, కోశాధికారి వై శంకర రావు, మహిళా అధ్యక్షురాలు హేమలత, వివిధ జిల్లాల, వివిధ సంఘాల ప్రముఖ నాయకులు హాజరైనారు.

# గ్యాస్ లీక్... అగ్నికీలలు

- వృద్ధురాలికి తీవ్ర గాయాలు
- నెల్లూరు నగరంలో ఘటన

నెల్లూరు క్రైమ్, డిసెంబరు 28 ప్రభాతవార్త: గ్యాస్‌లీకై మంటలు వ్యాపించి వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన పెద్దబజారు కుమ్మరవీధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.... కుమ్మరవీధిలో షేక్ నజీనబేగం తన రెండోకుమారుడు ముత్తాహర్‌తో కలిసి ఉంటోంది. ఆదివారం కుమారుడు బయటకు వెళ్లాడు. ఆమె వంటచేసి గ్యాస్‌ను ఆపడం మర్చిపోవడంతో గ్యాస్‌లీకవుతోంది. ఈవిషయం గమనించని వృద్ధురాలు సాయంత్రం ఆమె టీ పెట్టుకునేందుకు స్టౌవ్‌వెలిగించగా మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. దీంతో ఆమె కిందపడిపోయింది. మంటలు ఆమెను చుట్టుముట్టడంతో కాళ్లు, చేతులు, వీపు కాలాయి. ఈవిషయాన్ని గమనించిన స్థానికులు నజీనబేగం కుమారుడికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. అనంతరం దుప్పటితో మంటలను ఆర్పి తీవ్రగాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం 108సాయంతో జీజీహెచ్‌కు తరలించారు. ఈమేరకు ఆమె చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బీహార్‌లో గూడ్స్‌కు పెను ప్రమాదం



**పాట్నా, డిసెంబరు 28:** బీహార్ రాష్ట్రంలోని జాముయి జిల్లాలో తెల్వా బజార్ హాల్ట్‌వద్ద గూడ్స్‌రైలు పట్టాలు తప్పడంతో రైల్వే ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. ఝూఝా జసిధీ రైల్వేసెక్షన్‌లో జరిగిన ఈప్రమాదంలో సుమారు 10 వ్యాగన్లు బ్రిడ్జి సమీపంలో పడిపోయాయి. మొత్తం 34కిపైగా రైళ్లరాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ వాగన్లు ట్రాక్‌పైనుంచి పక్కకు ఒరిగిపోయాయి. యుపి, బీహార్ సెక్షన్లలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జసిదీనుంచి ఝూఝాకు గూడ్స్‌రైలు ప్రయాణిస్తోంది. భారీ శబ్దంతో ఒక్కసారిగా వ్యాగన్లు పట్టాలు తప్పిపోయాయి. ఈ రైలులో సిమెంట్ బస్తాలు రవాణా అవుతున్నాయి. వంతెనపైనా, పరిసరాల్లో ఈ బస్తాలన్నీ చెల్లాచెదురుగా పడిపోయాయి. ఈ ప్రమాదంతో అనేక ప్యాసింజర్‌రైళ్లు, కియుల్‌జసిద్ది రైల్వే సెక్షన్ మధ్యలో పలు స్టేషన్లలో నిలిచిపోయాయి. అయితేఎలాంటిప్రాణాపాయం జరిగినట్లు సమాచారం లేదని అధికారులు తెలిపారు. వంతెనపై రైలు బోగీలను తప్పించి ట్రాఫిక్‌పునరుద్ధరణ చేపట్టినట్లు తూర్పురైల్వే అధికారులు తెలిపారు. పనులు పూర్తయ్యేంతవరకూ రైళ్లను ఇతర మార్గాలమీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఝూఝా స్టేషన్‌నుంచి మాత్రం నిర్ణీత మార్గంలోనే నడుస్తాయని చెప్పారు. అసన్‌సోల్,మధుపూర్, ఝూఝా స్టేషన్లనుంచి రిలీఫ్ రైళ్లను వెంటనే ఆప్రాంతానికి పంపించామన్నారు.

# మహనీయుల పోరాటాలకు వేదిక కాంగ్రెస్ పార్టీ


## వ్యవస్థాపక దినోత్సవంలో ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గే



**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** అఖిలభారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం కేంద్ర కార్యాలయంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన నాయకులకు ఘననివాళి అర్పించారు. ఎందరో మహనీయుల త్యాగాలతో మనం స్వాతంత్ర్యం సమకూర్చుకోగలిగామని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గే ఈసందర్భంగా పేర్కొన్నారు. పార్టీ 140వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, కార్యాచరణను మరింతగా మనం ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య పోరాటంలో అనేకమంది కార్యకర్తలు ప్రాణత్యాగంచేసారని, వందలాదిమంది జైళ్లకు వెళ్లారని గుర్తుచేసారు. 1885లో స్థాపించిన పార్టీ అప్పటినుంచి భారత్‌కు గుండెకాయలా మారిందని అన్నారు. మహాత్మాగాంధీ ఇచ్చిన పిలుపుతోనే స్వాతంత్ర్య పోరాటంలోకి మహిళలు, నిరుపేదలు అన్నివర్గాలప్రజలు పాలుపంచుకున్నారని అన్నారు. ఇదే సంవత్సరం మనం రాజ్యాంగం అమలు 75 ఏళ్లరాజ్యాంగ అమలు దినోత్సవం కూడా జరుపుకున్నామన్నారు. శతాధిక వర్ష పార్టీకి ఆనాడు తొలి మహిళా అధ్యక్షురాలిగా సరోజిని నాయుడు వ్యవహరించిన అంశాన్ని గుర్తుచేసారు. హరిత విప్లవం, శ్వేత విప్లవం, ఆటోమొబైల్, ఐటి రంగాల విస్తరణ, కమ్యూనికేషన్స్ రంగంలో విప్లవం కాంగ్రెస్‌వల్లనే సాధ్యం అయిందన్నారు. యుపిఎ హయాంలో సోనియా గాంధీ నాయకత్వంలో పౌర హక్కులను బలోపేతంచేసామన్నారు. మన్మోహన్‌సింగ్ హయాంలో భారత్‌కు ప్రపంచ గుర్తింపు లభించిన అంశాన్ని గుర్తుచేసారు. కాంగ్రెస్ నిర్మించిన రాజ్యాంగ సంస్థలను 11 ఏళ్లలో ప్రస్తుత మోడీ సర్కారు నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. దేశంలోని జల్, జంగిల్, జమీన్‌లకు ముప్పు ఏర్పడుతోందని ఆయన హెచ్చరించారు. రాజ్యాంగ విలువలను ఆర్‌ఎస్‌ఎస్ తక్కువచేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అనేది ఒక పార్టీ మాత్రమే కాదని, దేశప్రజలకు కార్యకర్తలకు గుండెకాయ వంటిదని పేర్కొన్నారు. అణగారిన, నిరుపేదల వాణిని నిరంతరం వినిపిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీలతోపాటు జైరామ్‌రమేష్, పార్టీ ఎంపిలు కెసి వేణుగోపాల్, శశిథరూర్, దిగ్వి జయ్‌సింగ్ వంటి ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఇక సినిమాలకు గుడ్‌బై! పూర్తికాలం రాజకీయాలకే..!!

## జననాయకన్ ఆడియో వేడుకలో విజయ్ సంచలన ప్రకటన



కౌలాలంపూర్,డిసెంబరు 28: తమిళ సూపర్‌స్టార్, దళపతి విజయ్ తన సినీ జీవితానికి ముగింపు పలుకుతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. పూర్తి స్థాయి రాజకీయాలపై దృష్టి పెట్టేందుకు నటన నుంచి తప్పుకుంటున్నట్లు స్పష్టం చేశారు. మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఉన్న బుకిట్ జలీల్ నేషనల్ స్టేడియంలో, దాదాపు 90,000 మంది అభిమానుల మధ్య జరిగిన జన నాయగన్ చిత్ర ఆడియో విడుదల వేడుకలో విజయ్ సంచలన ప్రకటన చేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, ప్రజాసేవ కోసమే తాను ఈ కఠిన నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. నా కోసం థియేటర్లలో నిలబడిన అభిమానుల కోసం, రాబోయే ముప్పయి 33 ఏళ్లు నేను నిలబడతాను. ఈ విజయ్ ఫ్యాన్స్ కోసమే నేను సినిమాను వదిలేస్తున్నానని ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు. తన మూడు దశాబ్దాల సినీ ప్రయాణంలో అభిమానులు అండగా నిలిచారని, వారి రుణం తీర్చుకుంటానని అన్నారు. నేను ఇసుకతో చిన్న ఇల్లు కట్టుకుందామని సినిమాలోకి వస్తే, మీరంతా నాకు ఒక రాజమహల్ ఇచ్చారు. మీ అందరికీ నా కృతజ్ఞతలని విజయ్ పేర్కొన్నారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న జన నాయగన్ తన 69వ మరియు చివరి చిత్రమని విజయ్ ఈ వేదికగా తేల్చిచెప్పారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది. విజయ్ ఈ ఏడాది ఫిబ్రవరి 2న తమిళగ వెట్రి కళగం (టివికె) పేరుతో రాజకీయ పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. 2026లో జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా ఆయన పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేశారు. ఈ ప్రకటనతో ఆయన పూర్తి సమయం రాజకీయ నేతగా మారనుండటం తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తిని రేపుతోంది.

# టెన్నిస్ టోర్నమెంట్‌లో వైదేహికి టైటిల్

## అంకిత-వైష్ణవి జోడీకి డబుల్స్ టైటిల్

**న్యూఢిల్లీ:** డబ్ల్యూ35 షోలాపూర్ 2025 టెన్నిస్ టోర్నమెంట్‌లో వైదేహి చౌదరి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. అలాగూ మహిళల డబుల్స్ విభాగంఒలో అంకిత-వైష్ణవి జోడీ డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఆదివారం మహారాష్ట్రలో జరిగిన ఈ టెన్నిస్ టోర్నీలో భారత స్టార్ టెన్నిస్ క్రీడాకారిణి వైదేహిచౌదరి మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది.





టోర్నమెంట్‌లో ఆరో సీడ్‌లో ఉన్న 25 ఏళ్ల ఈ క్రీడాకారిణి, మూడు సెట్ల హోరాహోరీ పోరు తర్వాత ఫైనల్‌లో జపాన్‌కు చెందిన దిగువ ర్యాంక్‌లో ఉన్న మిచికా ఒజెకిని 3-6, 6-3, 6-4 తేడాతో ఓడించింది. ఇది వైదేహి కెరీర్‌లో నాల్గవ ఐటీఎఫ్ సింగిల్స్ టైటిల్. అంతకు ముందు, ఆమె సెమీఫైనల్స్‌లో జాతీయ ఛాంపియన్ వైష్ణవి అడ్కర్‌ను ఓడించి ఫైనల్‌లో స్థానం సంపాదించుకుంది, ఓజెకి తన సెమీస్‌లో రెండవ సీడ్ శ్రీవల్లి భమిడిపాటిని ఓడించింది. గత ఏడాది జూన్ లో చైనీస్ తైపీలో జరిగిన జూ35 తైపీ ఫార్మోసా కప్ టైటిల్‌ను ఆమె గెలుచుకున్న తర్వాత మొదటిది. మరోపక్క సెమీఫైనల్స్ లో ఓడిపోయిన వైష్ణవి డబుల్స్ లో బలంగా పుంజుకుంది. అనుభవజ్ఞురాలైన అంకితా రైనాతో కలిసి మహిళల డబుల్స్ టైటిల్ ను గెలుచుకుంది. సూపర్‌టైబ్రేక్‌ల తర్వాత ఫైనల్‌లో ఇండోరష్యన్ జంట జీల్ దేశాయ్-ఎలినా నెప్లీని 4-6, 7-5, 10-6 తేడాతో ఓడించి టైటిల్‌ను సాధించింది. 21 ఏళ్ల వైష్ణవికి ఇది తొలి సీనియర్ అంతర్జాతీయ టైటిల్ కాగా, 32 ఏళ్ల అంకిత తన 33వ డబుల్స్ టైటిల్‌ను (2025లో నాల్గవది) గెలుచుకుంది.

## దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో..

# సన్‌రైజర్స్ ఘన విజయం

## 42 రన్స్‌కే కుప్పకూలిన రాయల్స్

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికా టీ20 లీగ్ 2025-26 సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ అనుబంధ సంస్థ సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ ఘనంగా ప్రారంభించింది. ఈ టోర్నీలో భాగంగా బోలాండ్ పార్క్ వేదికగా పార్ల్ యారల్స్‌లో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 137 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పార్ల్ రాయల్స్ 11.5 ఓవర్లలో కేవలం 42 పరుగులకే కుప్పకూలింది.



ఒక్కరంటే ఒక్కరు కూడా పట్టుమని పది నిముషాల కూడా క్రీజులో నిలవలేకపోయారు. మొత్తం తొమ్మిది మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. కెప్టెన్ మిల్లర్ (7) కూడా ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయాడు. సన్‌రైజర్స్ స్పీడ్ స్టార్ అన్రిచ్ నోర్జే 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. అతడితో పాటు, ఆడమ్ మిల్నే, తరించు రత్నాయకే తలా రెండు వికెట్లు సాధించారు. అంతకు ముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్ రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానిక 186 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జోర్డాన్ హెర్మన్ (5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 62) టాప్ స్కోరర్‌గా నిలవగా, క్వింటన్ డికాక్ (42) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. కాగా ఈ మ్యాచ్‌లో 49 పరుగులకే ఆలౌట్ అయిన పార్ల్ రాయల్స్ అత్యంత చెత్త రికార్డును తమ పేరిట లిచంచుకుంది. సౌతాఫ్రికా టీ20 లీగ్ చరిత్రలోనే అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా లిచంచుకుంది. ఇంతకు ముందు ఈ రికార్డు ప్రిటోరియా క్యాపిటల్స్ (520 పేరిట ఉండేది. తాజా మ్యాచ్‌తో ప్రిటోరియాను రాయల్స్ అధిగమించింది.




## షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో

# తిలోత్తమకు స్వర్ణం

**న్యూఢిల్లీ:** జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఫైనల్‌లో తిలోత్తమ సేన్ అద్భుతమైన ప్రదర్శనతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె 466.9 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. కర్ణాటక షూటర్ ఫైనల్ పోటీలో ముందంజలో నిలిచింది. కేరళకు చెందిన విదర్స కె. వినోద్ 462.9 పాయింట్లతో రజతాన్ని సాధించగా, రైల్వేస్‌కు చెందిన అయోనికా పాల్ 451.8 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. అంతకుముందు, తిలోత్తమ 591-29+తో అర్హత రౌండ్‌లో అగ్రస్థానంలో నిలువగా, విదర్స 589-29+తో రెండవ స్థానంలో, కర్ణాటకకు చెందిన అనుష్క హెచ్ థోకూర్ 588-33+తో అర్హత రౌండ్‌లో మూడవ స్థానంలో నిలిచింది. ఫైనల్లో, అనుష్క 441.2 పాయింట్లతో నాల్గవ స్థానంలో నిలిచి పతకాన్ని తృటిలో కోల్పోయింది. జూనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ ఈవెంట్‌లో ఆర్మీకి చెందిన రీతుపర్ణ సతీష్ దేశ్‌ముఖ్ ఫైనల్‌లో 458.6తో బంగారు పతకాన్ని గెలుచుకుంది. క్వాలిఫికేషన్‌లో నాల్గవ స్థానం నుండి రీతుపర్ణ 584-31+తో ఎగబాకి, ఫైనల్‌లో గరిష్ట స్థాయికి చేరుకుంది. హర్యానాకు చెందిన నిశ్చల్ బలమైన సవాలును ఎదుర్కొన్నప్పటికీ 0.5 పాయింట్లు వెనుకబడి 458.1తో రజతాన్ని, కర్ణాటకకు చెందిన అనుష్క హెచ్ థోకూర్ 447.6తో కాంస్యం సాధించింది. సీనియర్ మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పి టీమ్ ఈవెంట్‌లో రాజస్థాన్ జట్టు మణిని కౌశిక్, స్వీటీ చౌదరి, మోనికా జఖర్ 1751 పాయింట్లతో బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆశి చౌక్సే, శ్రీవల్లి శ్రీవాస్తవ, నూపుర్ కుమావత్ సంయుక్తంగా రాణించడంతో మధ్యప్రదేశ్ 1750 పాయింట్లతో రజత పతకాన్ని గెలుచుకుంది. హర్యానా జట్టు స్వాతి, ఆకృతి దహియా, నిశ్చల్ లు ప్రాతినిధ్యం వహించిన మొత్తం 1750 పాయింట్లతో కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

# వన్డేల్లో టాప్ 5 ఇన్నింగ్స్

## భారత్ బ్యాట్స్‌మన్ల అద్భుత ప్రదర్శన



**న్యూఢిల్లీ:** 2025లో టీమ్ ఇండియా వన్డేల్లో అద్భుతాలను సృష్టించింది. మెన్ ఇన్ బ్లూ 14 మ్యాచ్‌లు ఆడి 11 మ్యాచ్‌లు గెలిచి మూడింటిలో మాత్రమే ఓడిపోయింది. దీనితో వారికి 78.57 విజయ శాతం లభించింది. ఈ ఏడాదిని ఇంగ్లాండ్‌పై 3-0 తేడాతో స్వదేశంలో సిరీస్ విజయంతో భారత్ ప్రారంభించింది. ఆ తర్వాత యుఎఇలో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీలో వారు అజేయంగా నిలిచారు. తర్వాత ఆస్ట్రేలియాలో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 2-1 తేడాతో కోల్పోయింది. అయితే, దక్షిణాఫ్రికాపై 2-1 తేడాతో స్వదేశంలో సిరీస్ విజయంతో వారు 2025ను అత్యున్నత స్థాయిలో ముగించారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది టీం ఇండియా బ్యాట్స్‌మెన్ ఆడిన టాప్ ఐదు వన్డే ఇన్నింగ్స్‌లు తీపి గుర్తులుగా ఉండిపోయతాయి. రాంచీలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో విరాట్ కోహ్లీ తన అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించాడు. సిరీస్‌లోని మొదటి వన్డే మ్యాచ్‌లో కోహ్లీ 120 బంతుల్లో 135 పరుగులు చేశాడు. 173 నిమిషాల ఆటలో అతను 11 ఫోర్లు, 7 సిక్సర్లు బాదాడు. అలాగే సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన చివరి వన్డేలో భారత్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ అద్భుతమైన సెంచరీతో సంవత్సరాలను వెనక్కి తిప్పాడు. లక్ష్యఛేదనలో రోహిత్ 125 బంతుల్లో 121 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతను 13 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టాడు. ఇక దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో యశస్వి జైస్వాల్ తన తొలి వన్డే సెంచరీని కూడా సాధించాడు. గాయపడిన శుభ్‌మాన్ గిల్ లేకపోవడంతో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన జైస్వాల్, విశాఖపట్నంలో జరిగిన నిర్ణయాత్మక మ్యాచ్‌లో మ్యాచ్ గెలిచే ఇన్నింగ్స్‌ను అందించాడు. 271 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జైస్వాల్ 121 బంతుల్లో 116 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. శుభ్‌మాన్ గిల్ భారత్ తరపున 11 వన్డే మ్యాచ్‌లు ఆడాడు. 11 ఇన్నింగ్స్‌లలో, అతను 49 సగటు మరియు 88.76 స్ట్రైక్ రేట్‌తో 490 పరుగులు చేశాడు. ఈ సమయంలో 2 సెంచరీలు, మరో 2 హాఫ్ సెంచరీలు సాధించాడు. అహ్మదాబాద్‌లో జరిగిన మూడవ మరియు చివరి వన్డేలో గిల్ 102 బంతుల్లో 112 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 14 ఫోర్లు, మూడు సిక్సర్లు ఉన్నాయి. కాగా రాయ్‌పూర్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ తన తొలి వన్డే సెంచరీ సాధించాడు. శ్రేయాస్ అయ్యర్ గాయం కారణంగా అవుట్ కావడంతో అతను ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేశాడు.

దక్షిణాఫ్రికా టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న తర్వాత, భారత్ మొదటి 10 ఓవర్లలోనే ఇద్దరు ఓపెనర్లను కోల్పోయింది. ఆ తర్వాత గైక్వాడ్ బలమైన ఎదురుదాడిని ప్రారంభించి కేవలం 83 బంతుల్లో 105 పరుగులు చేసి 12 ఫోర్లు, 2 సిక్సర్లతో రాణించాడు.

## వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్..

# అగ్రస్థానానికి హంపి

## అర్జున్, గుకేష్ తొలి ఓటమి

**న్యూఢిల్లీ:** వరల్డ్ రాపిడ్ ఛాంపియన్‌షిప్ 2025లో వరుసగా మూడు విజయాలు సాధించిన తర్వాత భారత్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి అగ్రస్థానానికి చేరుకుంది. ఇదే సమయంలో భారత్ గ్రాండ్ మాస్టర్లు ఎరిగైసి అర్జున్, దొమ్మరాజు గుకేష్‌లు తొలి ఓటమిని ఎదుర్కొన్నారు. దోహాలో జరిగిన ఛాంపియన్‌షిప్ టోర్నీ మహిళల విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్ హంపి మొదటి రోజు నెమ్మదిగా ఆడిన హంపి తర్వాత వరుసగా మూడు విజయాలను నమోదు చేసింది. ఆ తర్వాత అలెగ్జాండ్రా గోరియాచ్కినాతో జరిగిన నాల్గవ గేమ్‌లో డ్రాగా ఆడింది. ఈ ప్రదర్శనతో ఆమె 8 ఆటల్లో 6.5 పాయింట్లతో



అగ్రస్థానంలో ఉన్న ఝు జినర్‌తో చేరింది. అలాగే ద్రోణవల్లి హారిక (6/8) 2వ రోజు తర్వాత అజేయంగా నిలిచింది. అయితే దివ్య దేశ్‌ముఖ్ (5.5/8) 8వ రౌండ్‌లో తన మొదటి ఓటమిని ఎదుర్కొంది. ఇక ఓపెన్ విభాగంలో అర్జున్-గుకేష్ వరుసగా ఆరవ, తొమ్మిదవ రౌండ్లలో తమ తొలి ఓటమిని ఎదుర్కొన్నారు. అర్జున్ రష్యాకు చెందిన వ్లాడిస్లావ్ ఆర్టెమియేవ్ చేతిలో తెల్లటి పావులతో ఓడిపోయాడు. గుకేష్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన నోడిర్బెక్ అబ్దుసత్తోరోవ్ చేతిలో తలవంచాడు. వారిద్దరూ ఇప్పుడు 9 ఆటల్లో 6.5 పాయింట్లను కలిగి ఉన్నారు. అలాగే భారత్‌కు చెందిన గ్రాండ్ మాస్టర్లు నిహాల్ సరిన్, రమేష్‌బాబు ప్రజ్ఞానంద, ప్రణవ్ ఆనంద్ 9 ఆటల్లో 6 పాయింట్లు సాధించారు.

# వాణిజ్యం

# రియాల్టీ రంగానికి 3.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## నైట్‌ఫ్రాంక్ సర్వే నివేదిక వెల్లడి

**ముంబయి, డిసెంబరు 28:** భారత రియల్‌ఎస్టేట్‌రంగంలో ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు ఈ ఏడాది ఇప్పటివరకూ 3.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు నైట్‌ఫ్రాంక్ నివేదిక స్పష్టంచేసింది. దీనితో రియల్ ఎస్టేట్‌రంగంపై ఇన్వెస్టర్ల ఆసక్తి స్థిరంగా ఉందని, తక్కువ రిస్క్, స్థిరమైన రాబడులు వస్తుండటంతో ఇన్వెస్టర్లు రియాల్టీవైపు మొగ్గుచూపిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది. ప్రైవేటు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్ ఇండియా హెచ్2 2025 అన్న శీర్షికన పొందుపరిచిన నివేదికలో ప్రైవేటు పెట్టుబడులు భారీగా పెరుగుతున్నట్లు అంచనావేసింది. మొత్తం పెట్టుబడుల్లో 58శాతం ఆఫీస్ రియల్ ఎస్టేట్ వాటాగా ఉంది. మొత్తం 200 కోట్ల డాలర్లుగా ఉన్నట్లు అంచనావేసింది. రియాల్టీరంగంలో ఇన్వెస్టర్లకు నమ్మకం మరింతపెరుగుతున్నట్లు సంస్థాగత డిమాండ్‌తోపాటు లీజు స్థిరత్వం కూడా పెరుగుతూ వస్తోంది. మూడేళ్ల సగటున చూస్తే ఆఫీస్ రియాల్టీలో మరింత విస్తృతం అవుతున్నాయి. ఇక రెసిడెన్షియల్ రియల్‌ఎస్టేట్ రంగంలో రెండో అతిపెద్ద వాటాతో ఉంది. ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులు 17శాతంగా ఉన్నట్లు తేల్చింది. ఇన్వెస్టర్లు ఎక్కువగా నిర్మాణం పూర్తిచేసిన, రుణ ఆధారిత డీల్స్‌వైపు ఆసక్తి పెంచుతున్నారు. ఇన్వెస్టర్ల ఫోకస్ కూడా రిటర్నులు, పెట్టుబడులకు రక్షణ ఉండేటట్లు చూసుకుంటున్నారు. తక్కువ రిస్క్ ఉన్న ప్రాజెక్టులవైపు ఫోకస్ పెడుతున్నారు. జిడిపి వృద్ధి, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్లు వంటివి కొంత మెరుగుదలను నమోదుచేసినా పెట్టుబడులను పెంచలేకుండా ఉన్నాయి. దీనివల్ల ఇన్వెస్టర్లు ఎంపికచేసిన రంగాల్లో అప్రమత్తంగా ఉంటున్నారు. గోదాములరంగంమూడో స్థానంలో ఉంది. 15శాతం మొత్తంప్రైవేటు ఈక్విటీపెట్టుబడులు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక లాజిస్టిక్స్ రంగంపరంగా కూడా స్థిరంగా ఉన్నాయి. ఈకామర్స్, ఉత్పత్తిరంగం, సరఫరా రంగాల్లో వృద్ధి ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడులకు ఆసరా ఇస్తున్నాయి. మొత్తంప్రైవేటు ఈక్విటీ పెట్టుబడుల్లోనే రియాల్టీరంగం 11శాతం పెట్టుబడులను ఆకర్షించింది. హైక్వాలిటీ రిటైల్ ఆస్తులు, పటిష్టమైన పనితీరు ఉండటంతో వాటిపైనే ఎక్కువ దృష్టిసారిస్తున్నట్లు నైట్‌ఫ్రాంక్ వెల్లడించారు.






## టాప్ ఏడు కంపెనీల్లో రూ.35,439.56

# కోట్లు పతనం

## మార్కెట్ విలువల్లో టాప్ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్

**ముంబయి, డిసెంబరు 28:** భారత్‌లోని టాప్ పది కంపెనీల్లో ఏడు కంపెనీల మార్కెట్ విలువలు రూ.35,439.56 కోట్లు క్షీణించాయి. వీటిలో బజాజ్ ఫైనాన్స్ సింహభాగంలో ఉంది. మార్కెట్ విలువలు బజాజ్‌ఫైనాన్స్‌పరంగా రూ.5102.43 కోట్లు క్షీణించి రూ.6,22,124.01 కోట్లకు చేరింది. టాప్ పది జాబితాలో భారతీయ స్టేట్‌బ్యాంకు భారీ నష్టం చవిచూసింది. మార్కెట్ విలువలు రూ.12,692.1 కోటు క్షీణించి రూ.8,92,046.88 కోట్లకు చేరింది. ఇతర సంస్థలు లార్సెన్ అండ్ టూబ్రో మార్కెట్ విలువలు రూ.4002.94 కోట్లు క్షీణించి రూ.5,56,436.22కోట్లకు చేరితే ఐసిఐసిఐబ్యాంకు రూ.2571.39 కోట్లుక్షీణించి రూ.9,65,669.15కోట్లకు చేరినట్లు తేలింది. జీవితబీమా సంస్థ కూడా రూ.1802.62 కోట్లు క్షీణించి రూ.5,37,403.43కోట్లకు చేరితే టిసిఎస్ రూ.1013.07 కోట్లు క్షీణించి 11,86,660.34కోట్లకు చేరుకుంది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు మాత్రం మార్కెట్ విలువలు పెంచుకోగలిగింది. రూ.10,126.81 కోట్లు పెరిగి రూ.15,26,765.44కోట్లకు చేరింది. ఇన్ఫోసిస్ రూ.6,626.62 కోట్లుపెరిగి మార్కెట్ విలువలు రూ.6,87,818.84కోట్లకు చేరినట్లుమార్కెట్ గణాంకాలు చెపుతున్నాయి. అలాగే భారతీ ఎయిర్‌టెల్ కూడా 5359.98కోట్లు పెంచుకోగలిగింది. మొత్తం మార్కెట్ విలువలు 12,00,692.32 కోట్లకు చేరాయి. వారంరోజుల్లో హెచ్చు తగ్గులు నెలకొన్నా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్, టిసిఎస్, ఐసిఐసిఐ బ్యాంకు, భారతీయ స్టేట్‌బ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టి, ఎల్‌ఐసి సంస్థలు వరుసస్థానాల్లో నిలిచాయి.




## 'శ్రేయీ' రుణాల్లో బకాయిలపై

# ఆర్బీఐకి పిఎన్బీ నివేదిక

**ముంబయి, డిసెంబరు 28:** ప్రభుత్వరంగంలోనిపంజాబ్‌నేషనల్‌బ్యాంకు తమ పరంగా శ్రేయీ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్, శ్రేయి ఇన్‌ఫ్రా ఫైనాన్స్‌లకు ఇచ్చిన రుణాల్లో మోసం జరిగిందని రిజర్వుబ్యాంకుకు తెలిపింది. మొత్తం రూ.2434 కోట్ల మేర మోసం జరిగినట్లు పీఎన్బీ ఆర్‌బిఐకి నివేదించింది. పంజాబ్ సింధ్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలు కూడా గతంలో ఈ మోసంపై ఆర్బీఐకి నివేదికలు ఇచ్చాయి. అలాగే పీఎన్బీ స్టాక్ ఎక్ఛేంజిల ఫైలింగ్‌లోకూడా ఈసమాచారం తెలిపింది. శ్రేయి ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్‌లో రూ.1240.94 కోట్లమేర ఉన్నాయని, మిగిలిన మొత్తం 1193.06 కోట్లు శ్రేయి ఇన్‌ఫ్రా ఫైనాన్స్‌పరంగా ఉన్నట్లు వెల్లడించింది. ఈరుణాలకోసమేప్రభుత్వరంగంలో మూడో అతిపెద్ద బ్యాంకు పిఎన్బీ 100శాతం కేటాయింపులు జరిపింది.

ఈ రెండుఖాతాలు మోసాలతో ఉన్న ఖాతాలని కెపిఎంజి ఫోరెన్సిక్ ఆడినివేదిక కూడా ఇచ్చిందని వెల్లడించింది. అయితే కెపిఎంజినివేదికను శ్రేయి వ్యవస్థాపకుడు హేమంత్ కనోరియా సవాల్‌చేసారు. శ్రేయిగ్రూప్‌ప్రస్తుతం దివాలా ప్రక్రియలో ఉంది. 2021నుంచి కొనసాగుతున్నది. జాతీయ కంపెనీ లాట్రిబ్యునల్ కంపెనీ దివాలా ప్రక్రియ ప్లాన్‌ను ఆమోదించింది. నేషనల్ అసెట్ రికన్‌స్ట్రక్షన్ కంపెనీ అందించిన దివాలాప్రక్రియకు ఎన్సీఎల్టీ ఆమోదం తెలిపింది. శ్రేయీ కంపెనీలు కొనుగోలుకు ఎన్ఎఆర్‌సిఎల్ బిడ్డువేసింది. రూ.32,750 కోట్లు రుణాలు చెల్లించాల్సి ఉంటుందని కూడా తేల్చారు. 2023 ఫిబ్రవరిలో కంపెనీ బిడ్ ఆమోదం లభించింది. 2024 జనవరికల్లా సమీకరణపూర్తిచేసుకోవాలి. సుమారు రూ.14,301 కోట్లు చెల్లించింది. బానయంకర్లకు రూ.3180 కోట్లు అప్‌ఫ్రంట్‌గా చెల్లించింది. డిబెంచర్లరూపంలో రూ.8వేల కోట్లు చెల్లింపులకు కూడా కంపెనీ ముందుకువచ్చింది.



## ఫెడ్‌రిజర్వు, డాలర్ రూపీ

# కదలికలే కీలకం!

## ఈ వారంలో బిఎస్ఇ సెన్సెక్స్‌లపై ఇన్వెస్టర్ల అంచనాలు

**ముంబయి, డిసెంబరు 28:** మార్కెట్లు ఆసాంతం ఈ వారంలో కొంతమేర నీరసిస్తే వచ్చేవారంలో మాత్రం గ్లోబల్ మార్కెట్ల తీరుతెన్నులు, దేశీయ గణాంకాలు కీలకం కానున్నాయి. వీటికితోడు అమెరికా ఫెడ్ రిజర్వు సమీక్ష నిర్ణయాలు, డాలర్ రూపాయి కరెన్సీ కదలికలు, విదేశీ పెట్టుబడుల లావాదేవీలు కూడా మార్కెట్లకు దిశా నిర్దేశంచేస్తాయి. వారాంతంలో మార్కెట్లు నష్టాల్లోనే ముగిసాయి. గ్లోబల్ మార్కెట్ల పరిస్థితులు మిశ్రమంగా కనిపించడం, ఇన్వెస్టర్ల అప్రమత్తత ఒత్తిడిని మరింతపెంచాయి. వచ్చే వారంలో భారత పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు కీలకం అవుతాయి. ఇన్వెస్టర్లు ఎక్కువగా నవంబరునెల పారిశ్రామిక ఉత్పత్తి డేటాపై దృష్టిసారిస్తారు. సోమవారం ఈ డేటా విడులవుతుంది. అలాగే అమెరికా ఫెడ్ రిజర్వు గణాంకాలుకూడా మార్కెట్లను ప్రభావితంచేస్తాయి. ఈనెల 31వ తేదీ ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ పాలసీ నిర్ణయాలు చైర్మన్‌జెరోమ్‌పావెల్ వెల్లడిస్తారు. ఫెడ్‌రిజర్వు తన వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 3.75శాతానికి తీసుకువస్తుందన్న అంచనాలున్నాయి. ఫెడ్ రిజర్వు నిర్ణయాలు మెరుగుపడితే మార్కెట్లనుంచి పెట్టుబడులన్నీ అటువైపు మళ్లుతాయి. ఇక డాలర్ రూపాయి మారకం విలువలు కూడా కీలకం అవుతున్నాయి. వారాంతంలో 19 పైసలు క్షీణించి 89.90 రూపాయలకు చేరుకుంది. మార్కెట్‌లపరంగా దేశీయంగా ప్రభుత్వపరమైన విధాన నిర్ణయాలేమీ లేకపోవడంతో ట్రేడింగ్‌లో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉంటారని తెలుస్తోంది. ఆర్థిక గణాంకాలు, గ్లోబల్ సంకేతాలు, విదేశీ ఫండ్‌ల రాక వంటివే ఈ వారం మార్కెట్లలో కీలకం అవుతాయి.

# భారత్ విదేశీ కరెన్సీ ఖజానా కళకళ!

## 693.32 బిలియన్ డాలర్లకు పెరిగిన నిల్వలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 28:** రిజర్వుబ్యాంకులో ఉన్న భారత విదేశీ కరెన్సీ నిల్వలు 4.37 బిలియన్ డాలర్లుపెరిగి 693.32 బిలియన్ డాలర్లమేర రికార్డుస్థాయికి పెరిగాయి. అంతకుముందు వారంలో 688.95 బిలియన్ డాలర్లతోపోలిస్తే 4.37 బిలియన్ డాలర్లుపెరిగినట్లు వెల్లడించింది. గత ఏడాది సెప్టెంబరులో ఒకపర్యాయం 704.89 బిలియన్ డాలర్లమేర నిల్వలు పెరిగాయి. విదేశీ కరెన్సీ ఆస్తులపరంగాచూస్తే బంగారం, స్పెషల్‌డ్రాయింగ్ రైట్స్, ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి వంటివి కీలకంగా పరిగణిస్తారు. ఆర్‌బిఐ విదేశీ కరెన్సీ ఆస్తులు 1.65 బిలియన్ డాలర్లుపెరిగి 559.43 బిలియన్ డాలర్లకు చేరాయి.

అదే అంతకుముందు వారంలో 557.78 బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. ఇక బంగారం పరంగాచూస్తే ఆర్బీఐ వద్ద పసిడి నిల్వలు 2.62 బిలియన్ డాలర్లు పెరిగి 110.36 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద ఆర్బీఐ స్పెషల్‌డ్రాయింగ్‌రైట్స్ స్థాయి 10 మిలియన్ డాలర్లుపెరిగి 18.74 బిలియన్ డాలర్లుగా ఉంది. అదే అంతకుముందు వారంలో అయితే 18.73 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ



వెల్లడించింది. ఐఎంఎఫ్ వద్ద భారత్ రిజర్వుస్థాయి కూడా 96 మిలియన్ డాలర్లుపెరిగి 4.782 బిలియన్ డాలర్లుగా ఉంది. అంతకుముందు వారంలో అంటే డిసెంబరు 12తోముగిసిన వారంలో 4.686 బిలియన్ డాలర్లుగా నిలిచింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14